954.84
उ05-072

# రాజరాజనరేంద్రుడు


భావరాజు వేంకటకృష్ణరావు
ఎం. ఏ., బి. ఎల్.



దివాకర ప్రచురణములు
౪౨, మౌబ్రేస్‌రోడ్డు, తేనాంపేట పోస్టు
మద్రాసు ౧౮


All Rights Reserved] 1950 [వెల రు ౨-౮-౦

మొదట ముద్రణము

95484
L 18337

*For copies apply to:*

DIVAKAR PUBLICATIONS

**42, Mowbrays Road, MADRAS 18**

72133

# పీఠిక

౧౯౨౨ సంవత్సరమున రాజమహేంద్రవరమునందు ఆంధ్రదేశ ఇతిహాస పరిశోధకమండలివారి పక్షమున రాజరాజనరేంద్రుని పట్టాభిషేక నవశతాబ్దోత్సవ వర్ధంతిని జరిపితిని. నాటినుండి నేటివఱకు రాజరాజనరేంద్రుని నిజచరిత్ర ఆంధ్రులకు సరిగా తెలియరాకున్నది. రాజరాజును గురించియు నన్నయభట్టును గురించియు కల్పితకథ లనేకములు లోకమున వ్యాపించి యున్నవి. వాటిని తర్కింపక విశ్వసించువారు అనేకులున్నారు. కొందరు రాజరాజునుగురించి దురభిప్రాయముగలిగి యాదురభిప్రాయము నాధారము గావించుకొని యనేకరచనలను సాగించిరి. చివర కారీతిగా వ్రాయబడిన వ్యాసములమూలమున అసలు చరిత్ర మరుగుపడుట సంభవించెను. ఇరువదియొనిమిదేండ్లనాడు నేను రాజరాజపట్టాభిషేక వర్ధంతిని జరుపుటయు ఈనాడు ఆరాజరాజనరేంద్రుని చరిత్రను వ్రాయుటయు దైవికములు. రాజరాజనరేంద్రుని కాలపుచరిత్రను అతనిచరిత్రను యథార్థముగ దెలుపు సంకల్ప మీ గ్రంథరచనకు నన్ను పురికొల్పి యుండెను. ఈ గ్రంథమును నేను ఏనాడో వ్రాసియుండవలెను.

ఈ చిన్న చారిత్రక గ్రంథమును 'రూలర్సు ఆవ్ ఇండియా' సీరీసు రచనాపద్ధతి ననుసరించి వ్రాసితిని. చరిత్రాంశములను చర్చించుచు విసుగుబుట్టించు విమర్శనలతో నీ రచనను నింపదలచుకొనలేదు. చదువుటకు కథవలె నుండవలెనని సంకల్పించితిని. అచ్చటచ్చట కొన్ని వృత్తాంతములు తప్పని సరిగా పౌనరుక్త్యమును బొందవలసివచ్చెను. ఇందు రాజరాజనరేంద్రుని కాలమునాటి చరిత్రనంతయు సమగ్రముగా దెలిపితిని. ఆ కాలము చాళుక్యయుగమున కడపటి ఘట్టము. కావున నీ చరిత్రను దానార్ణవుని మరణముతో ప్రారంభించి, వీరవిజయాదిత్యుని కథతో ముగించితిని. ఇందు శకసంవత్సరములు ౮౯౨ మొదలుకొని ౯౯౨ వఱకు

గల నరేంద్ర (క్రీ. శ. ౯౭౦ - ౧౦౭౦) చరిత్రమును తెలిపితిని. ఆంధ్ర దేశమును దృష్టియందు నిలిపికొని సకల కర్ణాట, ద్రావిడ, దక్షిణాపథ రాజవంశముల చరిత్రను గూడ వ్రాసితిని. ఆ విధముగా సింహావలోకనము చేసి సమకాలీన రాజ్యముల చరిత్రతోపాటు ఆంధ్రదేశ చరిత్రను చదివిన గాని, ఆ నాటి దక్షిణాపథ పరిస్థితులుగాని, రాజరాజనరేంద్రుని జీవిత మహత్వముగాని, ఆంధ్రభారతావతరణ కారణముగాని, తత్ప్రయోజనము గాని, నన్నియభట్టారకుని కవిత్వ మహత్వ విశేషముగాని బోధపడదని యట్లు రచించితిని. ఆ నాటి మహాపురుషుల జీవితచరిత్ర, వారికడ్డు తగిలిన సంఘటనలు, ఉదాత్తములైన వారిగుణములు, వారి ఉత్సాహప్రభుమంత్ర శక్తులు, మరియు ఆ నాటి చారిత్రక వ్యక్తుల లక్ష్యములు, కృత్యములు మతసాంఘిక సంఘటనలు మనకు సరియైన దృక్పథమున కనిపింపకున్న, యీ నాడు జాతియొక్క పురోభివృద్ధికి తోడ్పడజాలవు. చారిత్రరచనా పద్ధతియందు సత్యమును విడనాడరాదు. సంఘటిల్లిన వృత్తాంతములను చరిత్రకారుడు తన చిత్తవృత్తి బట్టి అన్వయింపరాదు. ఉన్నది ఉన్నట్టుగా చెప్పి, యా నాటి సంఘటనలకు కారణములుగా గన్పించువాటినుండి తత్వార్థమును దురభిమానముజూపక పరామర్శచేయవలెను. ఇందు తెలిసిన చరిత్ర స్వల్పము. తఱచి తఱచి తీయవలసిన చరిత్ర అత్యధికముగనున్నది. కాలానుక్రమణికను తయారుచేసికొని సంఘటిల్లిన వృత్తాంతముల పూర్వాపరముల నిర్ణయించి, పిమ్మట చారిత్రక అంతరార్థమును తెలిసికొనుటకు ప్రయత్నము చేయవలెను. ఈ గ్రంథమును అట్టి సంకల్పముతో వ్రాసితిని. అందు ఎంతవఱకు సఫలీకృతమనోరథుడనైతినో సహృదయులగుచదువరులు నిర్ణయింపగలుగుదురు. రాజరాజనరేంద్రుడు ఆంధ్రదేశము నేలిన మహాపురుషులలో నగ్రస్థానము నలంకరింప దగినవారి శ్రేణిలో చేరదగినవాడు. ఆమహనీయుని స్మరించినమాత్రాన ఒడలు జల్లుమని పులకాంకితుల మగుదుము - అతనితో ప్రాచీనయుగము అంతరించెను: అతని కాలమున ఆంధ్రజాతి నూతనవికాసముతో వెలువడెను.

ఈ గ్రంథమునందు సంవత్సరములన్నియు శకనృపకాలమున నీయబడెను. శకనృపకాలమునకే మనవారు అయిదువందల సంవత్సరములనుండి శాలివాహనశకము అని వాడుచున్నారు. అట్లువాడుట సమంజసముగాదు. శక సంవత్సరములకు ౭౮ కలిపిన క్రీస్తుశక సంవత్సరమువచ్చును. అనగా క్రీ. శ. ౭౮ వ నాడు శకనృపకాలము ప్రారంభింపబడెను.

రాజరాజనరేంద్రుని చరిత్రకు సంబంధించిన ముఖ్యశాసనములను ఆనాటి తెనుగు భాషాస్వరూపమును దెలుపు ఉద్దేశముతో "అనుబంధము"న నిచ్చితిని. అవసరమున్నవారు వాటిని చూచుకొందురు. అవి యన్నియు నొక్కచోట దొరకవు గావున అందరికి అందు బాటులో నుండుటకు వాటిని ఒకచోట చేర్చితిని.

ఈ రచనయందు "అంధ్ర" శబ్దమును వాడితిని. దేశమునందు "అంధ్ర" శబ్దము వాడుకలోనున్నది. "అంధ్ర" శబ్దము చారిత్రకముగా దుష్టశబ్దము. 'అంధ్ర'మని యుచ్చరింపరాదు. మనదేశమును, భాషను, ప్రజలను సరియైన పేరుతో పిలచుట అవసరము. చరిత్రజ్ఞులు యథార్థమును వెల్లడిచేయవలయును. నా మిత్రులు, చరిత్రపరిశోధనాదక్షులు శ్రీమల్లంపల్లి సోమశేఖరశర్మగారు నావాదమునంగీకరించి "అంధ్ర" శబ్దమునే తమరచనలందు వాడుచున్నారు. ఇది శుభసూచకము.

ఇందు అచ్చుతప్పులు కొన్ని అనివార్యముగ దొర్లినవి; వాటిని చదువరు లుపేక్షింతురు గాక.

మద్రాసు<br>వికృతి సంవత్సర చైత్రము } భావరాజు వేంకటకృష్ణరావు.

# తప్పొప్పుల పట్టిక

| పుట | | |
|---|---|---|
| 17, 18, 19, 20, 21, 34 లలో | చేతనభట్టు అని వచ్చినచోట నెల్ల | భీమనభట్టు అని చదువుకొనవలెను. |
| 64 | 3-వ పంక్తిలో ౧౦౦౭-౦౪ కు బదులు | ౧౦౦౭-౦౩ అని చదువుకొనుడు |
| 89 | ౯. ముమ్మడి వజ్రహస్త దేవుని కాలము ౯౫౦-౯౯౭ కు బదులు | ౯౬౦-౯౯౭ అని దిద్దుకొనుడు |
| | ౨. మధుకామార్ణవుడు ౯౪౦-౯౪౬ కు బదులు | ౯౪౧-౯౬౦ ౧౯ ఏండ్లు అని సవరించుకొనుడు |

# విషయసూచిక

పుటలు.


| | | |
|---|---|---|
| ప్రథమ ప్రకరణము | ... | 1- 24 |
| ద్వితీయ ప్రకరణము | ... | 25- 45 |
| తృతీయ ప్రకరణము | ... | 46- 69 |
| చతుర్థ ప్రకరణము | ... | 70- 91 |
| పంచమ ప్రకరణము | ... | 92-105 |
| షష్ఠ ప్రకరణము | ... | 107-130 |
| సప్తమ ప్రకరణము | ... | 131-153 |
| అష్టమ ప్రకరణము | ... | 154-171 |
| నవమ ప్రకరణము | ... | 172-185 |
| అనుబంధము : శాసనములు | ... | 186-224 |
| ౧. విమలాదిత్యుని రణస్థిపూండి తామ్రశాసనము | | 186-192 |
| ౨. రాజరాజనరేంద్రుని కోరుమిల్లి తామ్రశాసనము | | 192-198 |
| 3. ,, కలిదిండి తామ్రశాసనము | | 198-203 |
| ౪. ,, నందమపూండి తామ్రశాసనము | | 204-207 |
| ౫. ,, మండ తామ్రశాసనము | | 207-208 |
| ౬. మొదటి శక్తివర్మ ప్రభుబట్టు తామ్రశాసనము | | 208-210 |
| ౭. ,, పెనికేరు తామ్రశాసనము | | 210-211 |

| | పుటలు. |
|---|---|
| ౮. మొదటి శక్తివర్మ ఆంధ్రసాహిత్య పరిషచ్ఛాసనము | 212 |
| ౯. వీరవిజయాదిత్యదేవుని పాములవాకశాసనము | 212-214 |
| ౧౦. సత్యాశ్రయదేవుని తిమ్మాపురశాసనము | 214-217 |
| ౧౧. బణపతి దీక్షాసి శిలాశాసనము | 217 219 |
| ౧౨. వీరవిజయాదిత్యుని ర్యాలిశాసనము | 219-222 |
| ౧౩. ,, రెండవ ర్యాలిశాసనము | 222-223 |
| ౧౪. నారాయణభట్టుకూంతుఱు కుపమ దాక్షారామ శిలాశాసనము | 223 |
| ౧౫. వీరవిజయాదిత్యుని కూంతుఱు సోమలదేవి దాక్షారామశిలాశాసనము | 222-224 |

# ప్రథమ ప్రకరణము

సోమవంశ తిలకుడయిన రాజరాజనరేంద్రుడు శక వర్షములు తొమ్మన్నూట నలువదినాలుగు సంవత్సరములు గతించగా, దుందుభి సంవత్సర అమాంత భాద్రపద బహుళ విదియా గురువారమునా డుదయమున, సూర్యుడు సింహ రాశియందును చంద్రుడు కుంభరాశియందు నుండగా. ఉత్తరాభాద్రా నక్షత్రయుక్త తులా లగ్నమందు, ఆంధ్ర వసుమతీతలమును రక్షించుటకు బలదర్పితుడై మహావైభవముతో పట్టాభిషిక్తుడయ్యెను. రాజరాజ పట్టాభిషేక విషయ మాతని శాసనములన్నింటియందు నొక్కవిధముగా దెలుపబడియెను. అందొక విశేషమున్నట్లు తోచును. ఆ పట్టాభిషేకము ఇంగ్లీషు లెక్క ననుసరించి ఆగష్టు ౧౬, ౧౦౨౨ సంవత్సరమగును. ఆనాడు తులా లగ్నముదయ మేడు ఘడియల ఎనిమిది విఘడియల కారంభమై పండ్రెండు ఘడియల ఇరువదియేడు విఘడియల వఱకు విస్తరించి యుండెను. ఆలగ్నమునకు రాజ్యాధిపతియైన చంద్రుడు పంచమస్థానమందును లాభాధిపతియైన సూర్యుడు లాభస్థానమైన స్వక్షేత్రమందు నుండి, ఒండొరులను సమ సప్తక దృష్టిని జూచుకొనుచు నత్యంత శుభులయి, బలీయులై యుండిరి. రాజరాజనరేంద్రుని పట్టాభిషేక దినమొక మహా పుణ్యాదినము. పర్వపుదినము కూడ. రాజరాజదేవుడు పుణ్యశ్లోకుడు. ఆతనికీర్తి దిగంత విశ్రాంతయై ఆచంద్రార్కము

ఆంధ్ర భూస్థలిని నిలిచియున్నది. ఆత డంధ్రభాషకు జేసిన మహోపకార మనంతమైనది. ఆంధ్రదేశమున కాత డొనర్చిన నుపకృతి చిరస్మరణీయమైనది. పట్టాభిషేక సమయమునా చాలుక్య చూడామణి రాజచాలుక్యవంశ సంప్రదాయము ననుసరించి, జన సంప్రార్థనమును ప్రధానుల యాదేశమును పాటించి, రాజపరమేశ్వర, పరమభట్టారక, పరమ బ్రహ్మణ్యా, పరమ మాహేశ్వరాది పారమేష్ఠిత్వ సూచకము లైన విశేష పదములతో, కులక్రమాగతములయిన అన్వర్థక బిరుదములతో సర్వలోకాశ్రయ శ్రీవిష్ణువర్ధన మహ రాజాధిరాజని అభిషిక్తనామమును స్వీకరించెను. ఆత డధిష్ఠించిన సింహాపీఠమునకు త్యాగసింహాసనమని పేరు. ఆతడు చండికావరప్రసాదలబ్ధ సామ్రాజ్యమునకు చిహ్న మైన చక్రవర్తిపదవిని బడసెను.

చళుక్య వంశశిఖామణి యనదగినవాడు రాజరాజ నరేంద్రుడు. సత్యాశ్రయ కులశేఖరుడతడు. రాజ చాళుక్య వంశమునకు సత్యాశ్రయకులమని కూడ పేరుగలదు. వాతాపి చాళుక్యవంశమునకును వేంగిచాళుక్యవంశమునకును నిజ ముగా ఇమ్మడి పొలకేశి చక్రవర్తి వంశకర్త. ఆతనికి సత్యాశ్రయుడని, సత్యాశ్రయ పొలకేశివల్లభుడనియు బేర్లు. సత్యాశ్రయుడన్న బిరుదునామమును బట్టి చాళుక్య కులము నకు సత్యాశ్రయకులమని ప్రతినామ మేర్పడెను. సత్యా శ్రయవల్లభుని తమ్ముడు కుబ్జవిష్ణువర్ధనుడు వేంగిచాళుక్య రాజ్యస్థాతయయ్యెను. కుబ్జవిష్ణువర్ధను డాదిగా వేంగీ చాళుక్య భూపాలురందరును సత్యాశ్రయ వల్లభేంద్రుని వంశ

కర్తగా చేర్కొనిరి. కుబ్జవిష్ణువర్ధను డాకారణమున చాళుక్య భూపాలుర శాసనములందు "సత్యాశ్రయ వల్లభేంద్రస్య, భ్రాతా కుబ్జ విష్ణువర్ధనః" అని తెలుపబడెనుగాని కీర్తివర్మ తనయుడని విశేషముగా తెలుపబడి యుండలేదు. వేంగీ వాతాపి చాళుక్యు లాకతన తాము సత్యాశ్రయ కులజుల మని చెప్పుకొనిరి. యదార్థమునకు రాజరాజు సత్యాశ్రయ కులమున బుట్టి ప్రసిద్ధిగన్నవారందరికంటె ననేక కారణముల వలన గొప్పవాడు. సంతానవంతుడైనను రాజరాజదేవునితో సత్యాశ్రయకుల మంతరించెను. సత్యాశ్రయ కులమంధ్ర దేశము నయిదువందల సంవత్సరములు ఏకచ్ఛత్రాధి పత్యముగ పరిపాలించెను. శ.౫౪౬ సంవత్సరమున చైత్ర వైశాఖమాసములందు (మార్చి, ౬౨౪) కుబ్జ విష్ణువర్ధనుడు వేంగీమహీ మహారాజ్యమును స్థాపించెను. శ. ౧౦౪౦ సంవత్సర శ్రావణమాసమునకు బూర్వమెపుడో (జూలై ౧౧౧౮) రాజరాజ నరేంద్రుని తనయుడు కులోత్తుంగ చోళదేవుడు మరణించెను. ఆ యైదువందల సంవత్సరముల కాలమున ఆంధ్రజాతికి ఒక విశిష్టత యేర్పడెను. ఒక వికాస మేర్పడెను. ఒకనాగరికత యేర్పడను. ఆ నాడేర్పడిన విశిష్టతయే నేటిదాక నిలచియున్నది. ఆంధ్రభాషకూడ సత్యాశ్రయకుల యుగమున నొక విశిష్టతతో నేర్పడియెను. కన్నడ ముతో పూర్తిగా సంబంధ మాకాలమున విడిపోయెను. దక్షిణాపథమున నర్మదా కృష్ణవేణీనదీమధ్యస్థిత దక్షిణ దేశమందు జనులు మాటాడుకొనుచుండిన 'ఆదిభాష' చాళుక్య రాజ్యస్థాపనమునకు బూర్వము కొంతకాలము

క్రిందట ఆంధ్రకర్ణాటభాషలుగా విడిపోయెను. ఆంధ్రదేశ భాష తెనుగయ్యెను. కర్ణాటభాష కన్నడ మయ్యెను. చాళుక్యరాజ్యస్థాపనకాలమాదిగ ఆంధ్రజాతి విశిష్టత గన్న రీతిని ఆంధ్రభాషయైన తెనుగుకూడ నొకవిశిష్టతను రమణీయమైన శబ్దసౌష్ఠవమును బొందెను. ఆదరణీయమైనరమ్యతను విశిష్టతను క్రమముగా బొందుటకు కొన్ని వందలయేండ్లు బట్టెను. ఆపరిణామ ఫలము రాజరాజ నరేంద్రునికాలమున నన్నయభట్టారకుని మహాభారతకావ్యరూపమున వెలువడెను. జాతీయవికాసముతోపాటు భాషావికాసముగూడ సౌష్ఠవము నొందినది రాజరాజదేవరకాలమున. అది మహోదయ పుణ్యకాలము. కావున రాజరాజు సత్యాశ్రయ కులశేఖరుడయ్యెను. ఆతనిబోలిన ఆంధ్రధరణీపతి సత్యాశ్రయకులమున నింకొకడు జనింపలేదు. ఆరాజకులశేఖరుని కాతడేసాటి. రాజ చాళుక్యవంశ యశోలత యంధ్రభూమిని సుప్రతిష్ఠితయై దశదిశలప్రాకియుండెను. సత్యాశ్రయకులశేఖర బిరుదమునకు రాజరాజ విష్ణువర్ధనుడు తక్క అన్యులర్హులుగారు.

రాజరాజ నరేంద్రునివలె పట్టాభిషేక సుముహూర్తమును తమ శాసనములందు ప్రత్యేకముగ దెలుపుకొనిన చాళుక్య భూపాలురు ఆ రాజచంద్రునికి బూర్వము ముగ్గురు మాత్రమే గలరు. వారిలో ప్రథముడు సర్వలోకాశ్రయ శ్రీ విష్ణువర్ధన నామాంకితుడగు మొదటి చాళుక్య భీముడు. రెండవవాడు సమస్తభువనాశ్రయ శ్రీ విజయాదిత్య మహారాజాధి రాజయిన ఇమ్మడి అమ్మరాజ రాజమహేంద్రుడు. మూడవవాడు సర్వలోకాశ్రయ శ్రీ విష్ణు

వర్ధన మహారాజాధిరాజయిన శ్రీ విమలాదిత్య దేవుడు, రాజరాజ దేవర తండ్రి. ఆ ముప్వురివలెనే తన పట్టాభిషేక విషయమునుగూడ దెలుపుకొనుటకు రాజరాజున కొక విశేష ప్రయోజనము కారణమయి యుండవచ్చును. ఆ కారణమును కోరుమిల్లి శాసన కావ్యకర్త బేతనభట్టు స్పష్టముగ అర్థగాంభీర్యముతో నిండిన మాటలలో చెప్పినాడు. రాజరాజు సింహాసన మెక్కిన తరువాత, మొదట నిచ్చినదా కోరుమిల్లి దానశాసనము. "పృథివియం దఖల రాజ రాజన్య సేవితమయిన రాజ్యలక్ష్మిని భుజబలముచేత లాగుకొని, యా వసుమతిని రక్షించుకొనుటకు రాజరాజు వేంగీమహీ మహారాజ్యమునకు బట్టాభిషిక్తు డయ్యెను." అని బేతనభట్టు వర్ణించినాడు. నందమపూండి శాసనకావ్యమున నన్నయ భట్టుకూడ 'దేవలోకమున ఇంద్రునివలె భూతలమున రాజరాజు పరార్థ్యము శత్రువులను తన శౌర్యముచే నిర్జించి ఉదారమైన యశమును సంపాదించి, సకల క్షితితలమును సంరక్షించుటకు మణిమయూఖవిభాసితమైన మకుటమును శిరమునందు ధరించె' నని తెలిపినాడు. అంతే కాదు. పట్టాభిషిక్తుడగుటకు బూర్వము రాజరాజు 'నిజగుణ వశీకృతాఖల రాజన్యు' డయ్యెననియు సామంతరాజ లోకమును తన కనుకూలురగ జేసికొనెననియు చెప్పినాడు. ఈ విధములయిన వాక్యములకు ప్రయోజనమున్నది.

శాసన కావ్యకర్తలు నాటి రాజకీయ పరిస్థితులను, చరిత్రను వివరముగా తమ కావ్య ప్రశస్తులయందు తెలిపి యుండినచో మన కొక శ్రమ యుండదు. కావున ఆనాటి దేశ

స్థితిని, రాజ్యముల స్థితిని, రాజవంశముల కథను కొంతవఱకు తెలిసికొనినగాని, బేతనభట్టు నన్నయభట్టుల ప్రశస్తి వాక్యరచనాప్రయోజనము సుబోధకము కాజాలదు. చాళుక్యయుగమున ఆంధ్రదేశమునకు వేంగీదేశమనియు, అంధ్ర ధరణీశునకు వేంగీశ్వరుడనియు వ్యవహారమున సకల జనాంగీకారములయిన పేరు లుండెను. కర్ణాట దేశమునకు కుంతల రాజ్యమనియు రట్టపాడియనియు నా విధముగ వ్యవహార నామము లుండెను. కుంతలమను నామము శాత వాహనుల నాటినుండి వచ్చిన పేరు. కర్ణాటదేశము రాష్ట్ర కూటుల పాలనమున ఇంచుమించుగా ఇన్నూట యేబది యేండ్లు ప్రసిద్ధికి వచ్చుటచేత, దానికి రాష్ట్రకూటశబ్ద తద్భవ మైన రట్టపాడి పేరయ్యెను. కర్ణాట దేశమును మొదట వాతాపి, లేక బాదామి చాళుక్యులును, తరువాత రాష్ట్ర కూటులు, పిమ్మట వారిని కూలద్రోసి కళ్యాణ చాళుక్యులును పరిపాలించిరి. కళ్యాణ చాళుక్యులను కొందరు చరిత్ర కారులు పశ్చిమ చాళుక్యులని వ్యవహరింతురు. అది సాబ గయిన పేరుగాదు. వారిని కుంతల చాళుక్యులనుట గాని, కళ్యాణ చాళుక్యు లనుట గాని యొప్పును. కాంచీ, కావేరీ ప్రాంతములయిన ద్రవిడభూమిని చక్రవర్తి పదలాంఛన ముతో రాజచోళ వంశ మాకాలమున పరిపాలించెను. ద్రవిడ దేశమునకానాడు చోళరాజ్యమనిపేరు ప్రసిద్ధికి వచ్చెను.

రాజరాజ నరేంద్రునికి పూర్వము ఏబది యేండ్లుగా, అంధ్రదేశ మేరీతి నుండెనో ఎఱుగు టావశ్యకము. శ. ౮౬౭ సంవత్సరపుష్యమాసమున (నవంబరు, ౯౪౫) రాజ భీముడని

పేరుగల ఇమ్మడి చాళుక్య భీముడు మరణించెను. ఆతని కగ్రమహిషియైన అంకిదేవియందు దానార్ణవుడును, ప్రియ వల్లభియైన లోకమహాదేవియందు అమ్మరాజ విజయాదిత్యు డును పుట్టిరి. వీరిద్దరుగాక నృపకాముడను మూడవ కుమా రుడుగూడ కల్గెను. ఆతని జనని అంకిమహాదేవియో లోక మహాదేవియో తెలియరాదు. అంకిమహాదేవి కళింగ భూపా లుని తనయ. ఆమె జనకుడు ప్రాయశః మొదటి వజ్రహస్త దేవుడు కాదగును. రాజభీముని మరణానంతరము జన సంప్రార్థనమున అమ్మరాజు, రాజమహేంద్రుడను బిరుద ముతో, విజయాదిత్యుడను అభిషేకనామముతో వేంగీ మహీరాజ్యమునకు పట్టముగట్టు కొనెను. అమ్మరాజ విజయాదిత్యుడు పట్టాభిషేకము నాటికి పండ్రెండేండ్ల వయసు వాడు. రాజమహేంద్రుని పట్టాభిషేకము శ. ౮౬౭ నకు సరియైన విశ్వావసు సంవత్సర మార్గశిర కృష్ణ త్రయోదశీ శుక్రవారము (డిశంబరు ౫, ౯౪౫) నాడు జరిగెను. అగ్రజు డగు దానార్ణవునికిని, యాతని వర్గమువారికిని, అమ్మ రాజరాజమహేంద్రుని పట్టాభిషేకము సమ్మతము గాకుం డెను. ఆనాటి యాస్థాన కవులు, శాసన కావ్యకర్తలు, రాజభీముని దశరథునితోడను, దానార్ణవ అమ్మ రాజేంద్రు లను రామ భరతులతోడను పోల్చుట చూడ రామాయణ కథవంటిది యొకటి యానాడు రాజమహేంద్రవరమున నడచి యుండెనా యని సంశయము దోచును. అంతటనుండి అమ్మ రాజ దానార్ణవుల నడుమ భ్రాతృప్రేమ నశించి వైరా నలము బుట్టెను. అమ్మరాజ విజయాదిత్యుని పదచ్యుతుని

జేసి రాజ్యలక్ష్మిని బలాత్కారముగ గ్రహింపవలెనని దానార్ణవుడు సంకల్పించుకొనెను. ఆవేళకు అమ్మరాజ రాజమహేంద్రునకు మరియొక ప్రబల శత్రు వేర్పడెను. అతడు యుద్ధమల్లుని యగ్రతనూజుడైన బాడపమహారాజు. వేంగి మహీరాజ్యమును జయించి లాగుకొనుట కతడు రాష్ట్రకూటకుల స్వామియగు ముమ్మడి కృష్ణభూపతి నాశ్ర యించెను. ముమ్మడి కృష్ణభూపతికి కన్నరదేవుడను ప్రాకృత నామము ప్రఖ్యాతమై యుండెను. వేంగీశ్వరులకు, రాష్ట్ర కూట చక్రేశ్వరులు కులవైరులు. ఆ కులవైరము రాష్ట్ర కూట రాజ్యస్థాపనముతో మొలకెత్తి వేళ్లు పాతుకొని ప్రమానయి మహా వృక్షమయ్యెను. యుద్ధమల్లుడు మొదటి చాళుక్యభీమునికి పినతండ్రి మనుమడు, ఆతని వంశము రాజ చాళుక్య కులమున వెలసిన రెండవశాఖ.

తనకు మిత్రుడై యుండగలడను తలంపుతో, బాడ పునికి సహాయమొసర్చి యాతని వేంగీశ్వరుని చేయ నుద్దే శించి కన్నర భూపాలు డొకటి రెండుతడవలు ఆంధ్రదేశము మీదికి దండెత్తివచ్చెను. కుటిలవర్తను లయిన సామంత రాజలోకమును వశపఱచుకొని దానార్ణవుడు అమ్మరాజ విజయాదిత్యుని పదచ్యుతిని చేయదలచెను. కృష్ణానదికి దక్షిణ భాగమును బాడపుడు కొంతకాల మాక్రమించు కొని వేంగీశ్వర బిరుదముతో పట్టముకట్టుకొనెను. కన్నర దేవుడు కళింగమును ప్రవేశించి, ఆంధ్రదేశము మీదికిదండెత్తి వచ్చిన వేళ నాతని నెదుర్కొనుటకు అమ్మరాజు కళింగము నకు బోయినపుడు, దానార్ణవుడు వేంగీ సింహాసనము నాక్ర

మించుకొనెను. ఆవిధముగా దాయాదులు, అన్నయు, కుల వైరులు, కుటిల సామంతరాజలోకమును, నలుగురు నాలుగు వైపులను చెలరేగియుండ, అమ్మరాజు అసమాన శౌర్య ప్రతాపములతో శత్రువులనెల్ల సంహరించి ఇరువదియైదేండ్లు అరిరాజభయంకరుడై ఆంధ్రభూమినేలెను. చివరకు దానార్ణవునితోడి కడపటి యుద్ధమునందు మరణించెను. అనంతరము దానార్ణవుడు సర్వలోకాశ్రయ శ్రీవిష్ణువర్ధనమహారాజను అభిషిక్త నామముతో వేంగిమహీరాజ్యమునకు బట్టముగట్టుకొనెను. అన్నదమ్ములకలహము కారణముగా, చాళుక్య కులమున జ్యేష్ఠ శాఖవారు బలహీనులయిరి. చివరకు దానార్ణవుని యనంతరమును రాజ్యమును గూడ గోల్పోయిరి.

దానార్ణవునికి అంతట బాదపునితో పోరు సంఘటిల్లెను. బాదపునికి మహాబలవంతుడును ప్రచండ పరాక్రమశాలియు, మహామాండలిక రాజన్యుడు నగు జటాచోడ భీముడు తోడయ్యెను. జటాచోడ భీముడు తెనుగు చోడ వంశమున బుట్టినవాడు. అతని తోబుట్టువు బాదప మహారాజుకు పట్టమహిషియని తోచును. జటాచోడు డొకచోట 'స్వభగినీపద మాంధ్రమండల'మని చెప్పుకొనిన దీయూహకు గారణము. దానార్ణవునికి తల్లివంకబంధువులైన కళింగగంగభూపతులు, మొదటి కామార్ణవుడును, శ. ౮౬౪-౮౯౯(=౯౪౨-౯౭౭) అతని సోదరుడు వినయాదిత్యుడును శ. ౮౯౯ ౯౦౨( ౯౭౭-౯౮౦)తోడ్పడ వచ్చియుందురు. జటాచోడభీమునితో జరిగిన ఘోరసంగ్రామములందు, వారిరువురును గూడ మరణించి దానార్ణవునితోపా ,టా

తని తమ్ముని నృపకాముని గూడ జటాచోడభీము డ్రోడించి చంపెను. దానార్ణవుని మరణము శ. ౮౯౪ కు సరియైన అంగీరస సంవత్సరాంతములోపల (జనవరి ఫిబ్రవరి ౯౭౩) జరిగియుండినట్లు తోచును. దానార్ణవు డారీతిగా తమ్ముని మరణానంతరము మూడేండ్లుమాత్రము రాజ్యపాలన మొనర్పగలిగెను.

బాదపుడుకూడ మరణించుటచేత నది మంచితరుణముగా నెంచి 'స్వభగినీ పదమైన' యంధ్రమండలమును జటాచోడుడు వశపఱచుకొని వేంగీశ్వరుడయ్యెను. ఆవిధముగ చిన్నశాఖకు జెందిన బాదపుని సంతతికిగాని, యాతని సోదరుడు తాళరాజ విష్ణువర్ధనుని సంతతికిగాని, రాజ్యము చెందకుండ జటాచోడ భీము డపహరించెను. ఆవిధముగా జ్యేష్ఠశాఖకు జెందిన దానార్ణవుని సంతతివారికి నయితము వేంగీ రాజ్యము లేకుండపోయెను. రాజచాళుక్య వంశమునకు కులక్రమాగత సత్త్వమైన వేంగీ మహీమహారాజ్యమొక దుష్టమహామండలికుని వశమయ్యెను. దానార్ణవుని సంతతివారి పక్షము బూని తలపడిన వారినందఱిని జటాచోడ భీము డ్రోడించి సంహరించెను.

ఆ విధముగా రిపుక్షయము గావించి జటాచోడ భీముడించుమించుగా శ. ౮౯౫ కు సరియై శ్రీముఖ చైత్రము నుండి ఆంధ్రదేశమును నిర్వక్రపరాక్రమముతో దుర్నిరీక్ష తేజోమూర్తియై, మధ్యందినమార్తాండునివలె పరిపాలించెను. కళింగదేశము మొదలుకొని కాంచీపురమండలమువఱకు

వ్యాపించిన దేశమునంతయు నతడు జయించెను. కాంచీ పురమున తన జయస్తంభమును నాటెను. ఎదిరించిన రాజన్యుల నదిమి, కప్పములు కానుకలు గొని సార్వభౌమ పదలాంఛనుడై వేంగీశ్వరుడై రాజ చాళుక్య వంశజు లట్లు రాజ్యమేలెను. రాజ చాళుక్య కులమున కాతడు ద్రోహము చేసెను. అనాథయయిన తన సోదరిరాజ్యము నపహరించి తానే పట్టము గట్టుకొనెను. అంతటి క్రూరకర్ముడగుట వలన గాబోలు తరువాతి వా రాతని రావణునితో బోల్చిరి. ఆవిధముగా జటాచోడ భీము డిరువది యేడేండ్లు ఆంధ్రభూమి నేలెను. తరువాతి కాలమువారు జటాచోడ భీముని రాజ్యకాలము అరాజక కాలమని తమ శాసన కావ్యములం దుదహరించిరి. జుగుప్సతో నాతని పేరయిన నుచ్చరింపకపోయిరి. "దానార్ణవుని యనంతరము దైవ దుశ్చేష్టత వలన ఆంధ్రదేశ మిరువది యేడు సంవత్సరము లనాయకమై దుఃఖించెననిరి. ఆంధ్రదేశము మాత్రమే కాదు అనాయకమై కళింగము గూడ క్షోభించె ననిరి. "అనురూపుడైన నాయకుని పతిగా బడయుటకొఱకు తప మొనరించిన వధువు విధమున ఆంధ్రభూమి ఇరువై యేడు సంవత్సరములు తప మొనరించెను" అని యారీతిగా తరువాతి కాలము వారు తమ శాసనములందు చెప్పుకొనిరి. మరియు, "అంతట దానార్ణవుని కుమారుడు, షోడశకళోపేతుడు, చాళుక్య చంద్రుడని పేరుగల శక్తివర్మ యుదయించి, తన మృదువైన కరములతో పృథివియొక్క తాప ముపశమింప జేసెను." అని కూడ నుడివిరి.

దానవరేంద్రుడు విద్యాకలాప చతురుడు. చతుష్షష్టి కళాభిజ్ఞుడు. ధీనిధి యతడు. రాజనారాయణ బిరుదాంచితుడు. కర్ణుని దాన మహిమను మరపింప జేసిన మహాదాన నిరతు డతడు. యుద్ధరంగములం దగ్రగామి. ప్రధాని, వీరాగ్రేసరు డతడు. దానార్ణవునికి ఆర్యామహాదేవియందు శక్తివర్మ విమలాదిత్యు లను ఇరువురు కుమారు లుదయించిరి. శక్తివర్మకు చాళుక్య చంద్రుడనియు, చాళుక్య నారాయణు డనియు బిరుదములు. తండ్రివలె నాతడును సర్వలోకాశ్రయ శ్రీవిష్ణువర్ధన మహారాజాధిరాజను పేరుతో పట్టాభిషిక్తుడై పండ్రెండు సంవత్సరము లీ ధరామండలమును బాలించెను.

శక్తివర్మ ఇంద్రుని బోలిన శక్తి శౌర్య ప్రభావ యుతుడు. చిన్ననాటనే యాత డొకప్పుడు 'ద్రమిళాహవము' నందు మదించిన ఏనుగుల బలమును సింహము వలె విక్రమించి సంహరించెను. ద్రమిళాహవమని యొక చోటను మరియొకచోట చోలికరణమని తెలుపబడినది. యా రెండు యుద్ధముల నొక్క యుద్ధమునే నుదహరించుచున్నవి. ద్రమిళాహవ మన్నను, చోలికరణ మన్నను, చోళులతో పోరాడిన సంగ్రామము మాత్రము గాదు. ద్రవిడులైన చోళులకు సహాయార్థముగా నేగి పోరాడిన యొక మహా సంగ్రామ మది. అతడు శక్తివంతుడై, పోయిన పైతృక మహారాజ్యమును మరల సంపాదించుటకు, మహోద్యోగి యయ్యెను. అతని ప్రయత్నములను భగ్నము చేయు తలంపుతో జటాచోడ భీము డనేక చారులను బంపి విఫల మనోరథుడయ్యెను. శక్తివర్మ క్రమక్రమముగా బలవీర్య

సంపన్ను డగుట గాంచి, జటాచోళుడు యుద్ధసన్నద్ధు డయ్యెను. ఆనాడు జరిగిన ఘోర సంగ్రామమున శక్తివర్మకు సాహాయ్యముగా చోళచక్రవర్తి రాజకేసరివర్మ రాజ రాజ సైన్య మంపెను. ఆ యుద్ధ మెక్కడ జరిగెనో తెలియదు. కాని కృష్ణా గోదావరీ నదుల మధ్య నున్న దేశమున నెక్కడనో జరిగియుండును. రణ ప్రతినిధి యని పేరొందిన జటాచోడుడు శక్తివర్మతో పోరాడి పరాజితుడై చివరకు ఆహవరంగమున, పెనుగాలివలన కూకటివేళ్లతో గూడ మొదలంట గూలిన మహావృక్షమువలె గూలెను. అంతట వేంగీమహీమహారాజ్యము శక్తివర్మ వశమయ్యెను. అది శ. ౯౨౧ కు సరియైన వికారి సంవత్సరము (౯౯౯) సగము గడచిన తరువాత జరిగెనని యూహింపవచ్చును.

జటాచోడ భీముని ఇరువది యేడేండ్ల కాలమును రాజ చాళుక్య వంశజలు అరాజక కాలమని నుడివిరి. తమ రాజ్యలక్ష్మి పరాధీన మగుట మాత్రమేగాక, యొక సామాన్య ద్రోహి మాండలికుని వశమగుట శక్తివర్మఆదిగా తరువాతి చాళుక్య భూపతులకు తలపను గూడ రోత కలిగించెను. దైవ దుశ్చేష్టితమువలన ఆంధ్రదేశము చాళుక్య వంశజులను ఆ యిరువది యేండ్లకాలము వేంగీశ్వరులుగా బడయు భాగ్యము నోచుకొని యుండలేదని వారి యభిప్రాయము. అందువలన వేంగీ మహీరాజ్య మనాయక మయ్యెనని విలపించిరి.

వేంగీ మహీ మహారాజ్యమును మరల సంపాదించు కొనుటకు శక్తివర్మ చోళ చక్రవర్తి రాజ రాజు నాశ్ర

యించెననియు, నాతడు వేంగిపై దండెత్తివచ్చి, వేంగి దేశ మును బలాత్కారముగ నాక్రమించుకొన్న శత్రువులను జయించి, ఎదిరించిన వారిని అదిమి, శక్తివర్మను వేంగీ సింహాసనముపై గూర్చుండబెట్టి, కళింగముమీదికి సయి తము దండయాత్ర వెడలి వేంగీ కళింగ భూపతులను తనకు ఆజ్ఞానువర్తనులను జేసి వచ్చెనని నిరాధారములయిన వ్రాతలను, చోళ పక్షపాతముచేతనైన నేమి, చరిత్ర రచన కాధారము లయిన నాటి శాసనకావ్యాదులను సమగ్ర ముగా చూడక పోవుటచేత నేమి, దురభిప్రాయమును ముందుగా మనసున బెట్టుకొని కొందరు చరిత్ర పరిశోధకులు వ్రాయుచుందురు. వారి వ్రాతలందు సత్యము కానరాదు. శక్తివర్మ స్వబాహువీర్యముతో స్వప్రతాపముతో వేంగీ రాజ్యమును జయించుకొనెను. రాజరాజు సైన్యముల నంపి సాయపడియుండవచ్చును. అంతమాత్రమున చోళ శాసన ములలోని దంభవాక్యములకు విపరీతార్థములు చెప్పి సత్య మును గప్పిపుచ్చరాదు. ఆనాటి ఆంధ్ర ద్రవిడ కర్ణాట రాజ్యముల చరిత్ర కూలంకషముగ దెలిసిన నాడు చోళ చక్రవర్తి వేంగీదేశమును జయించిన వృత్తాంతమును శక్తివర్మను సింహాసన మెక్కించిన వృత్తాంతమును నిరా ధారములు నసత్యము లని దెలియును. రాజ రాజు ఎక్క డను తాను వేంగీరాజ్యస్థాపకుడని చెప్పుకొనలేదు. వేంగి కళింగములను జయించితినని చెప్పుకొన్న మాట కేవలము కీర్తి మాత్రా కరప్రయోజనార్థము కాని వేఱొండు గాదని చరిత్రజ్ఞులకు తెలియకపోదు.

శక్తివర్మ పరాక్రమశాలి. రాజనీతియందతి చతురుడు. శక్తిత్రయసంపన్నుడు. అట్టివాడు గావుననే, తనరాజ్యమున కొకవైపునుండి దాయాదులును, మరియొక వంకనుండి ద్రోహి సామంతులును, ఇంకొకప్రక్కనుండి దాయాదులకు సాహాయ్యము చేయవచ్చిన కర్ణాటచాళుక్యసేనానుల దాడులును తనకు విశేషముగ క్లేశము కలిగించుచుండినను, వేంగీ మహారాజ్య సింహాసనముపై గూర్చుండి స్థిరముగ, రిపురాజ భయంకరుడై పండ్రెండేండ్లు రాజ్యపాలనముచేయగలిగెను. దాయాదులు ప్రాయశః బాడపునియొక్కయు నాతని తమ్ముడు తాళరాజయొక్కయు సంతానము కాదగును. అత్తిలినాండు విషయమున జేరిన పభుబట్టు గ్రామణి (గ్రామాధికారి) స్వామి ద్రోహియయ్యెను. అయూరనున్న సలికేశ్వరనామ శివాలయమునకు స్థానాధిపతియైన బాల సోమపండితుడను శివాచార్యుని ప్రేరణమున నాగ్రామణి స్వామిద్రోహముచేసెను. శక్తివర్మ యాతని నంతట గ్రామణి స్వామిత్వమునుండి తొలగించి, యాస్వామిత్వమును తనపట్ల స్వామిభక్తి పరాయణుడై, కృతక్లేశియైన దాదిభీమునకు పభుబట్టున కొంతభూమితోపాటు దత్తముచేసెను. దాదిభీముని తండ్రిపేరు పాంగు; తల్లిపేరు దారకాంబ. పభుబట్టు గ్రామణి గావించిన స్వామిద్రోహము ఎట్టిదో తెలియరాదు. అయినను అతడు శక్తివర్మ దాయాదులకు సాహాయ్యమొనరించి యా చాళుక్యచంద్రుని పదచ్యుతుని చేయుటకు పన్నాగములు పన్నినవారిలో నొకడని యూహింపవచ్చును. కర్ణాట దండ నాయకు డొకడు, బయలునంబి యను బ్రాహ్మణచమూపతి

వేఁగీదేశమునకు వచ్చి, [illegible] లను గెల్చి [illegible] చోళులను వచ్చెను. కాని శక్తివర్మ గాదిలోని వేఁగీ [illegible] శ. ౯౩౩ [illegible].

రాజ్యతంత్రము [illegible] లేదు. అచటను గాక [illegible] శత్రువులతో [illegible] పట్టాభిషిక్తుఁడయ్యెను. రాజ్యపాలనాయని పదునాలుగేండ్లు. మొదటను జ్యేష్ఠ యువరాజు విమలాదిత్యుఁడు వేఁగీనాటి సామ్రాజ్యమునకు పట్టముగట్టుకొనెను. విమలాదిత్యుని పట్టాభిషేకము శ. ౯౩౩ న గతించైన విరోధికృత్తు సంవత్సర వృషభమాసమున, అనగా చాంద్రమాన అమాంత జ్యేష్ఠమాసశుక్ల పంచమీ గురువారమునాఁడు (౧౦ మే ౧౦౧౧) పుష్యమీనక్షత్రయుక్త సింహలగ్నమున ఉదయా[illegible] గంటల కించుమించుగా, రవిచంద్రులు లాభస్థానస్థితులైయుండిన వేళ, జరిగెను.

పట్టాభిషేకమునకు బూర్వము విమలాదిత్యుఁ డెవరినో శత్రువులనోడించి వారిని దేశమునుండి వెడలఁగొట్టవల్సి తెను. "మహీమండల సామ్రాజ్యం విజిత్య విజయాదిత్యాన్" అని విమలాదిత్యుని వేఁగీ సామ్రాజ్యమును సంపాదించుకొనిన విధానమును కోరుమిల్లి శాసనవాక్యము మనువుమన్నది. విమలాదిత్యుని శత్రువులు దాయాదులై యుండుదు. శక్తివర్మకు సంతానముండెనేమో తెలియుదు. లేదని యూహించుటకు అవకాశమున్నది. 'శత్రువు

లాతని ప్రసంగ ప్రశస్తి [illegible] వారేవారని. వారి గోత్రములు, గుణములు, అంతఃపురములు. వేములవాడ [illegible] దేశాంతరగతులైనారు. అని చాళుక్య రణాస్తిపూండి శాసనము తెలుపుచున్నది. 'ముడల వరె పై కెరటమాన్న అతని ప్రతాపాగ్నివలన [illegible] [illegible] [illegible] గొలిచి [illegible] యుండి దేశాంతరగతులైనారు ; [illegible] [illegible] [illegible] సంపాదించి రాజ్యము అనుభవించెను.' అని చెప్పిన [illegible] మిల్లి శాసనకావ్యమున మరల చెప్పెను. [illegible] దాయాదులవల విధ్వంసయము. వారిలో రాజపుత్రుల రాజుల [illegible] నాయాదినేలము [illegible] ఉంచి, విమలాదిత్యుడు బిరుదాంక భీముడని ప్రసిద్ధినామ్ము డయ్యెను.

విమలాదిత్యునికి బిరుదాంక భీముడనియు, ముమ్మడి భీముడనియు, శ్రీభువనాంకుశు డనియు భూమహేంద్రు డనియు, వీర మకరధ్వజు డనియు, చాళుక్యమార్తాండు డనియు ద్వితీయ నామములును, బిరుదములును గలవు. విమలాదిత్యుని వంశకర్తగా పలుమారు చెప్పినట్లు రణాస్తిపూండి శాసనకావ్యమున ప్రశంసచేసియున్నాడు. ఒకచోట వతని 'గోత్ర నిస్తారకు'డని, వంశక్షయముగాకుండ రక్షించిన వాడని తెలిపినాడు. మరియొక సందర్భమున, భూమహేం

ద్రుడు, కులపర్వతములను భేదించిన మహేంద్రునికన్న నధికు డని తెలుపుచు గోత్రశబ్దము నర్థాలంకారమున ప్రయోగించి, 'గోత్రైక నిస్తారకు'డని యాతడొక్కడే వంశము నిలుపజాలిన వాడని ప్రస్తుతించెను. ఇంకొక చోట రాజచాళుక్య కులము నకు వంశకర్తలైనవారిని పేర్కొనుచు, భరత, చాళుక్య విజయాదిత్య, సత్యాశ్రితావల్లభేంద్రులను పేర్కొనుచు, వారితో తుల్యుడు సర్వలోకాశ్రయ శ్రీముమ్మడి భీమమహా రాజని నుతించినాడు. ఆదిని, మొదటి చాళుక్యభీముడు, తరు వాత రెండవచాళుక్య భీముడును, పిమ్మట ముమ్మడి భీమ నామాంకితుడయిన విమలాదిత్యుడును వంశకర్తలై వెలసి యుండిరి. బేతన భట్టాయభిప్రాయమును మనసునందుంచు కొని, ముమ్మడిభీముడు వంశకర్తయై అన్వర్థకనామ్ముడయ్యెనని ప్రశంస చేసినాడు. పట్టాభిషేకమును వర్ణించుచు 'సత్యా శ్రయవంశవర్ధను' డై విమలాదిత్యుడు ప్రసిద్ధుడయ్యెనని తెలిపినాడు. ఏవం విధములైన వర్ణనలను పరిశీలించినపుడు జ్యేష్ఠవంశమున విమలాదిత్యు డొక్కడే పుత్రవంతుడై మిగిలియుండెననియు విశదమగును.

రణస్థిపూండి శాసనము విమలాదిత్యుని కాలమునాటి చరిత్రాంశములను అర్థాలంకార శోభితమైన కవనమందు నిగూఢమయ్యును ప్రకాశమగునట్లు దెలుపుచున్నది. 'విమలా దిత్యుడు శత్రువుల యేనుగుల కుంభస్థలములను బ్రద్దలుగొట్టి వారి గజసైన్యములను చీకాకుపఱచి, జయముగొని చిరయ శమును సంపాదించినాడు. అతని పరాక్రమ ధాటికి నిలువ జాలక వెన్నిచ్చి పాటిన శత్రువుల గృహముల మేడలు,

అందలి సాలభంజికలు బూజుపట్టియుండెను. దుస్సాధనాధికము లయిన గజేంద్రసంఘములతో తనమీదకు సింహామను పేరుగలరాజు దండెత్తిరాగా, యుద్ధమం దాతని సేన నిశ్శేషము గావించి, బలవంతుడైన యారాజు మదమడంచి, తన పరాక్రమముచేత నాతని పరిహసించి, త్రిభువనాంకుశుడని అన్వర్థనామ్ముడయ్యెను. బేతన భట్టు పేర్కొనిన 'బంహిష్ఠ సింహాము' కర్ణాట చాళుక్య భూపాలుడు. సింహానృపతియని పేరుగల జగదేకమల్ల ఇమ్మడి జయసింహవల్లభ మహారాజు. ఆతడు శ. ౯౩౬ మొదలుకొని శ. ౯౬౫ వఱకు (౧౦౧౪-౧౦౪౩) ఇంచుమించుగా ముప్పది సంవత్సరములు పరిపాలించెను. ఆతడు విమలాదిత్యునికి సమకాలికుడు. జగదేకమల్లునితోడి దారుణయుద్ధము శ. ౯౩౭-౯౪౦ సంవత్సరముల నడుమ (౧౦౧౭-౧౦౧౯ మధ్య) నెప్పుడో జరిగెను.

జగదేకమల్లుని యోడించి పరాభవించి వెనుకకు పంపిన పిదప, సార్వభౌమధరణీశ్వరులు, విమలాదిత్యునకు మదపుటేనుగులను పెక్కింటిని ఉపాయనముగా గొనివచ్చి కానుకలిచ్చిరి. సార్వభౌమ ధరణీశ్వరులనుటచేత నా భూపాలురు ఉత్తర దేశాధీశులు కావలయును. ఆకాలమున కుంతల చాళుక్యులకు కులవైరులైన మాళవాధిపతులు, పరమారులు. బాల్యమందు సింహాసన మెక్కిన భోజుడు (క్రీ. శ. ౧౦౧౦-౧౦౬౩) వేంగీశ్వరునకు సమకాలికుడు. కుంతల చాళుక్యులతోడి వైరము సాధించుతలంపున భోజరాజు విమలాదిత్యునితోడి మైత్రినివాంఛించి మదపుటేనుగుల నుపాయనముగా నంపించియుండును. భోజరాజే స్వయముగావచ్చి

నట్లు చేతనభట్టు సూచించియున్నాడు. మరియు విమలాదిత్యుడు తన అశ్వదళములను బంపి శత్రుభూములపై దాడి చేయించె ననియు, నాదాడులందు మరణించిన శత్రువుల శిరములను గొనివచ్చి శూలములకు గ్రుచ్చి, రాజమహేంద్రవరమున రాజప్రాసాద ప్రాంగణమున పాతించెననియు చేతనభట్టు నుడువుచున్నాడు. కాని యాశత్రువులెవ్వరో తెలుపడు.

మరియు చేతనభట్టు విమలాదిత్యు నీవిధముగా ప్రశంసించినాడు. "అతడు సౌరాష్ట్రికులను తన నిశితమైన పరుశుధారచే ఖండించెను. శక లాట గుర్జరులను తన శౌర్య సంపదచే విగతధైర్యులను జేసెను. అతని వీరవిహార సుకృతములకు ఫలముగా ననేకులు వీరస్వర్గము నొందిరి." ఈ వాక్యములందు ఆకాలపు చరిత్ర నిగూఢమైయున్నది. సౌరాష్ట్రి, శక, లాట, గుర్జరులు, నేడు కథియవాడ సురాష్ట్రి ములని బిలువబడుచున్న ప్రాంతముల నేలుచుండిన సామంత నృపాలురు. గుర్జరులనగా అన్హిల్వాడ చౌళుక్యులు. వారందరు రాష్ట్రకూట సామ్రాజ్యమున రాజన్యులుగానుండి కుంతల చాళుక్య రాజ్యస్థాపనముజరిగిన తరువాత స్వతంత్రులగుటకు ప్రయత్నించిరి. అన్హిల్వాడ నగరమును రాజధానిగ జేసికొని మూలరాజు వంశకర్త యగుచు చౌళుక్యరాజ్యమును స్థాపించెను. లాటదేశమునం దాతని దాయాది కుంతలేశ్వరునకు సామంతుడై యుండి మూలరాజుకు విరోధియై ప్రబలియుండెను. ఉత్తరమున మాలవాధీశులు, దక్షిణమున కుంతల చాళుక్యులును తమతమ సామ్రాజ్య విస్తరణమునకై పోరాడుచుండ, బలవంతులైనవారిచే అదుమబడుచు శకలాట

సౌరాష్ట్రులు ఒకప్పుడు కుంతలచాళుక్యులకును మరియొక ప్పుడు పరమారులకు నరిగాపులై వర్తించుచుండిరి. విమ లాదిత్యుని కాలమునాడు సౌరాష్ట్రాదులు స్వాతంత్ర్యము నకై పెనగులాడుచు మాలవాధీశునకు క్లేశములు కల్గించి యుండురు. పరమారభోజునికి సాహాయ్యమంపి విమలా దిత్యుడు తనదండనాయకులద్వారా కార్యఖడ్గముల నెఱపెను. కొందరి యుద్ధమున నోడించియు, గొందరిని నయమున, కొందరిని భయమున బెదిరించి, తనరాజనీతి కౌశలమును శౌర్యసంపదను బ్రకటించి వశంవదులను జేసికొని, భోజరాజు నకు సాహాయ్య మొనర్చియుండును.

ఇంక నతిమనోహరముగ, శబ్దాలంకార అర్థాలం కార శోభితము లయిన పద్యరచనయందు బేతనభట్టు విమలా దిత్యుని శౌర్యసంపదను, రాజనీతిజ్ఞతను బ్రస్తుతించి యున్నాడు. అతడు వీరమకరధ్వజుడు. మకరధ్వజుడు విగ్రహ మును మాన్పినరీతి భూపతులమధ్య యుద్ధములను మాన్పి విమలాదిత్యుడు వీరమరకధ్వజుడని పేరొందెను. అహితు లయిన వారివలన గలుగు దేశోపద్రవమను చీకటిని, సూర్యుని వలె ప్రకాశించి పాఱద్రోలెను. అతడు రాజకలాధరుడు. ఆతనికి ప్రియాయుధము పరశురామునికివలె గండ్రగొడ్డలి. అతడు సుందరుడు, లావణ్యమూర్తి. యజ్ఞయాగాదులను బోషించిన ధార్మికప్రభువతడు. నందనవృక్షమువలె తన్నా శ్రయించిన 'సమత్కవి సహస్రము'లకు అభిలషితార్థ ఫల ముల నొసగినవాడు. ఇంద్రునితో సమాన వైభవము గల వాడు. అతడు చంద్రవంశవిస్తారకుడు. వైరిభూపతు లనేకులను

72/133

# వేంగీ చాళుక్య వంశము

౧౨. కలివిష్ణువర్ధనుడు (శ. ౭౯౯-౭౭౦)

- రాష్ట్రకూట రాజతనయ శీలమహాదేవివలన
  - ౧౩. గుణగవిజయాదిత్యుడు
  - యువరాజ విక్రమాదిత్యుడు
    - ద్రోహార్జునుడు, జగుదామభీముడు ౧౪. మొదటి చాళుక్యభీముడు శ. ౮౧౪-౮౪౩
      - ౧౫. కొల్లభిగండ, కలియుర్తృంక (ఐదవ) విజయాదిత్యుడు శ. ౮౪౩
        - వేండాంబవలన
          - ౧౬. అమ్మరాజ-విష్ణువర్ధనుడు రాజమహేంద్రుడు శ. ౮౪౩-౮౪౯
          - ౨౨. గండమహేంద్రుడు ఇమ్మడి చాళుక్యభీముడు శ. ౮౫౭-౮౬౯
      - ౧౯. విక్రమాదిత్యుడు శ. ౮౪౯-౮౫౦
  - యుద్ధమల్లుడు లేక మల్లరాజు
    - ౧౮. తాడపుడు శ. ౮౪౯
      - ౨౧. యుద్ధమల్లుడు శ. ౮౫౦-౮౫౭
        - ౨౪. బాడపుడు (విజయాదిత్యుడు)
        - తాళరాజ (విష్ణువర్ధనడు)
- హైహయరాజకన్యవలన
  - నృపకాముడు

౧౯. కంఠిక బేతరాజు

౨౦. భీమరాజు

అంకిదేవివలన

౨౪. దానార్ణవుడు (రాజనారాయణుడు) శ. ౮౯౨-౮౯౫

ఆర్యామహాదేవివలన

- చాళుక్యచంద్ర, చాళుక నారాయణ, మొదటి శక్తివర్మ ౨౬. శ. ౯౨౧-౯౩౩
- భూపమహేంద్ర, ముమ్మడిభీమ బిరుదంకభీమ, త్రిభువనాంకుశ ౨౭. విమలాదిత్యుడు శ. ౯౩౩-౯౪౦
  - కుందవాదేవివలన
    - ౨౮. రాజరాజనరేంద్రుడు శ. ౯౪౦-౯౮౩
      - అమ్మంగదేవివలన
        - ౩౧. రాజేంద్రచోడుడు కులోత్తుంగ చోళదేవుడు శ. ౯౯౨-౧౦౪౦.
        - కుందవాంబ
  - మేడాంబవలన
    - ౨౯. వీరవిజయాదిత్యుడు మాలవమహాదేవి శ. ౯౮౩-౯౯౭
      - ౩౦. ఇమ్మడి శక్తివర్మ సత్యాశ్రయదేవుడు శ. ౯౮౩-౯౮౪

లోకమహా విదలన

౨౩. అమ్మరాజ విజయాదిత్య రాజమహేంద్రుడు శ.౮౬౭-౮౯౨

నృపకాముడు

బలిమివాటించి యదిమి గప్పములుగొన్న సార్వభౌము డతడు. చక్రవర్తిపదవికి సముచితమైన యనేక ధవల ఛత్రముల ఛాయచే గప్పబడిన మహాసామ్రాజ్యమును సంపాదించినవాడతడు. అతడు సర్వలోకాశ్రయ శ్రీవిష్ణువర్ధన మహారాజాధిరాజను అభిషేకనామముతో వేంగీ సింహాసనమధిష్ఠించెను. అతడు పరమభట్టారకుడు, పరమబ్రహ్మణ్యుడు, పరమమాహేశ్వరుడు. అతడు రాజమార్తాండుడు, రవితేజసంపన్నుడు. భీమపరాక్రము డతడు.

విమలాదిత్యుడు చోళకులమను క్షీరసముద్రమున లక్ష్మివలె బుట్టిన కుందవాంబను వివాహమాడెను. అమె చోళచక్రవర్తియగు రాజకేసరివర్మ రాజరాజకు ప్రియాత్మజ. గంగైకొండచోళుడని, మధురాంతక దేవుడని ప్రఖ్యాతిగాంచిన రాజేంద్రచోళునికి అమెగారాబు చెల్లెలు. ఆపుణ్యదంపతులకు జనించిన యేకైకపుత్రుడు, రతిరాజవిభవుడు రాజరాజదేవుడు. చంద్రవంశమున కలంకారమైన వాడతడు. చాళుక్యవంశతిలకు డతడు. అతడు పరగండ భైరవాంకిత శోభితుడు.

# ద్వి తీ య ప్ర క ర ణ ము

ఇంచు మించుగ నీ కాలమందే, పదియవ శతాబ్దపు కడపటి పాతికేండ్లలోపల, వేంగీదేశమున జరిగిన సంఘటనల వంటివి కుంతలదేశమున గూడ సంభవించెను. అచ్చటి దేశ పరిస్థితులు రాజవంశముల దృష్టాదృష్టములు వేంగీ దేశమం దుండిన రీతిగనే యుండెను. రాష్ట్రకూటులలో కన్నర దేవుడు (ముమ్మడి కృష్ణభూపతి) మహాబల పరాక్రమ సంపన్నుడు. అతడు శ. ౮౬౧ మొదలుకొని శ. ౮౮౯ వఱకు, (౯౩౯ — ౯౬౭) ఇంచు మించుగా నిరువది యెనిమి దేండ్లు చక్రవర్తి పదలాంఛనుడై, దక్షిణాపథములోని పశ్చిమార్ధ భాగమును నర్మదా కావేరీ మధ్యస్థ భూమండలమును పరిపాలించెను. అమ్మరాజ విజయాదిత్యున కాతడు సమకాలికుడు. కన్నరదేవుడు తన్నెదిరించిన భూపాలుర నెల్లర జయించి రాష్ట్రకూట సామ్రాజ్యమును విస్తరింప జేయగల్గెను గాని, ప్రచండ ప్రతాపుడయిన అమ్మరాజ విజయాదిత్యుని పట్ల యాతని పరాక్రమము వక్రత్వము నొందెను. అమ్మరాజ విజయాదిత్యుడు కన్నరదేవుని ఒకటి రెండు తడవ లోడించి తఱిమి వైచెను. కన్నరదేవుడు మరణించునాటికి రాష్ట్రకూట సామ్రాజ్యము మహోచ్ఛదశయం దుండెను. మూడవ గోవిందరాజు కాలమునాడు గూడ (శ. ౭౧౫- ౭౩౫ ౭౮౩ - ౮౧౪) రాష్ట్రకూట సామ్రాజ్యమంతగా విస్తరించి యుండలేదు. కాని యా యుచ్ఛస్థితి కన్నరదేవుని

మరణానంతర మొక పది సంవత్సరములయిన గడువకుండ అంతరించెను. కన్నరదేవుడు శ. ౮౮౯ కు సరియైన ప్రభవ సంవత్సరాంతమున (౯౬౭) నెప్పుడో మరణించెను. పిమ్మట నాతని తమ్ముడు నిత్యవర్ష ఖొట్టిగదేవుడు సింహాసన మధిష్ఠించెను.

కన్నరదేవునివలన పరాజయము నొంది, అదిమి వేయబడిన మాలవదేశాధీశులగు పరమారులును, చేది దేశపు కలచుర్యులు మొదలయిన భూపాలు రందరును, మరల స్వతంత్రులయి విజృంభించుటకు తరుణమునకై వేచి యుండిరి. వీరాగ్రేసరుడయిన కన్నర భూపతి మరణ మందరికి సమ్మోదమును గూర్చెను. ఆతని మరణవార్త విన్నంతనే పరమార శ్రీహర్షదేవుడు ప్రాత పగను దీర్చుకొనుటకు ప్రతీకారము సేయదలచి రాష్ట్రకూట రాజధాని మాన్యఖేట ముపై దండెత్తి వచ్చెను. ఖొట్టిగదేవుడు సంగ్రామ రంగమున శ్రీహర్షుని నెదుర్కొన జాలక పోయెను. శ్రీహర్షుడు రాష్ట్రకుల స్వామిని జయించిన విజయోత్సాహముతో మాన్యఖేటమును ముట్టడించి, స్వాధీన పఱచుకొని, దోచుకొని తగులబెట్టెను. నిత్యవర్షుని సకల వస్తుచయమును * కొల్లగొని నిజ రాజధానికి మరలి పోయెను. ఆవృత్తాంతము శ. ౮౯౪ కు సరియైన ఆంగీరససంవత్సరమున (౯౭౨)

* తస్మాదభూదరిన కేశ్వరసంఘసేవాగర్జద్గజేంద్ర రవ సుందరతూర్యనాదః శ్రీహర్షదేవ ఇతి ఖొట్టిగదేవలక్ష్మీం జగ్రాహయోయుధినగాదసమప్రతాపః.
(ఉదయపుర ప్రశస్తి: ఎ. ఇం.. సం. ౧. పుట ౨౩౫. శ్లో. ౧౨)

జరిగెను. మాన్యఖేట దహనముతో రాష్ట్రకూట సామ్రాజ్యము కూలిపోవ నారంభించెను. దాని కితర సంఘటనలు గూడ తోడ్పడెను. ఖొట్టిదేవు డపజయ మొందిన కొద్ది దినములకే మరణించెను. అంత నాతని తమ్ముడు, నిరుపమదేవుని కుమారుడు, ఇమ్మడి కర్కరాజనువాడు రాష్ట్రకూట సింహాసన మధిష్ఠించి, యెట్టులో పదునెనిమిది మాసములు రాజ్యము చేయగల్గెను. అతని కాలమున కుంతల చాళుక్య సామ్రాజ్య స్థాతయైన ఆహవమల్ల ఇమ్మడి తైలపదేవుడు విజృంభింపసాగెను. శ. ౮౯౫ కు సరియైన శ్రీముఖసంవత్సరారంభమున (౯౭౩) ఇమ్మడి తైలపదేవుడు ఇమ్మడి కర్కరాజును మాన్యఖేటమునుండి వెడలగొట్టి చాళుక్య రాజ్యలక్ష్మిని కుంతలదేశ సింహపీఠముపై సుస్థిరముగ నిలిపెను.

ఇమ్మడి కర్కరాజు చచ్చిన తరువాతకూడ, పశ్చిమ గంగులు రాష్ట్రకూటులయెడ నత్యంత స్వామిభక్తి పరాయణులయి వర్తించిరి. పశ్చిమ గంగ నృపతి, పెర్మడి (పరమర్ది) మారసింహుడు, ఇమ్మడి తైలపదేవుని లెక్కసేయక, కన్నరదేవుని పౌత్రు నొకని, నాల్గవ ఇంద్రరాజును రాష్ట్రకూట చక్రేశ్వరునిగా నభిషేకించి రాజ్య పరిపాలనము సాగించెను. ఆవిధముగా నొకయేడు గడచెను. ఇంద్రరాజు దౌర్భాగ్యవశమున శ. ౮౯౬ కు సరియైన భావసంవత్సరాషాఢమున పెర్మడి మారసింహుడు మరణించెను. అతని స్థానమును పంచలు డాక్రమించెను. గంగవాడి సింహాసనమును మారసింహుని తరువాత నెక్కినవా డతడు.

గారసింహునివంటి వీరుడు గాడు పంచలుడు. తైలపదేవుని క్కరించి, రాష్ట్రకూటుల యధికారమును నిలుపజాలిన క్షుడునుగాకపోయె నతడు. తైలపు డంతట యుద్ధరంగమున ంచలు నెదుర్కొని యోడించి చంపెను. ఇంద్రరాజును ంహరించి రాష్ట్రకూట కులమున వంశాంకురము గూడ కుండ సమూలము నిర్మూలించెను. ఇంద్రరాజు చావు తైలపుని కుంతలచాళుక్యరాజ్యస్థాపనానంతరము జరిగెను.

ఇంచుమించుగా నా కాలమున మాలవాధీశ్వరుడు శ్రీ హర్షుడుకూడ మరణించెను. మాన్యఖేటమును దగ్ధము గావించిన ఆనందము నాతడు చిరకాల మనుభవింపలేదు. శ్రీహర్షుని కిద్దరు కుమారులు. వారిలో జ్యేష్ఠుడు ముంజ దేవుడని మారుపేరు గల ఇమ్మడి వాక్పతిరాజు. ఆతనికి అమోఘవర్షుడనియు శ్రీవల్లభుడనియు, పృథ్వీవల్లభుడనియు గూడ పేళ్లు గలవు. వాక్పతి–ముంజరాజుకు తమ్ముడు సింధు రాజు. ఆతనికి కుమారనారాయణు డనియు, నవసాహసాంకు డనియు బిరుదములు. శ్రీహర్షుని యనంతరము వాక్పతిరాజు ధారాపట్టణమున బట్టము గట్టుకొనెను. కవిత్వమన్నను కవితాగోష్ఠి యన్నను ఎంత యభిరుచియో సంగ్రామకేళి యన్న వాక్పతి కంతప్రీతి. రాష్ట్రకూట రాజ్యలక్ష్మిని వశ పఱచుకొనిన కారణమున ధారానగరాధీశ్వరులకు కుంతల చాళుక్యులతో వైర మేర్పడియెను. వాక్పతిరాజు తన రాజ్య కాలమంతయు, కుంతల చాళుక్య భూపతులతోడి పోరాట ముందు గడపెను. జయశ్రీ ఎల్లవేళల నొక్కరినే వరియించని కారణమున వాక్పతిరాజు పదునారుసార్లు తైలపదేవుని

మీదికి దండెత్తి పోయెను. ప్రబంధచింతామణి కారుడగు మేరుతుంగు డొకచోట నావిషయమును సవిస్తరముగా జెప్పెను. వాక్పతిరాజు కడపటిసారి పదునేడవ పర్యాయము నూర్మడి తైలపునిమీదికి, మంత్రి రుద్రాదిత్యుడు వలదని వారించినను జెవిని పెట్టక, యుద్ధమునకు బోయెను. ఆ దండ యాత్రయందు ద్రమత్తుడై గోదావరిని దాటి కుంతల రాజ్యమును బ్రవేశించి యుద్ధమునకు దలపడెను. కర్ణాట మాలవ సైన్యములకు ఘోర సంగ్రామ మయ్యెను. తైలపదేవుడు వాక్పతి ముంజరాజు నోడించి, జీవగ్రాహముగా బట్టుకొని తనరాజధానికి దీసికొనిపోయి చెఱయం దుంచెను. చెఱనుండి తప్పించుకొని పాఱిపోవుటకు వాక్పతి రా జెన్నో ప్రయత్నములు గావించి విఫలమనోరథుడయ్యెను. ఒకసారి పట్టు పడినపు డాతని తైలపదేవుడు శిక్షింపక మన్నించెను. కడసారి గావించిన ప్రయత్నమున బట్టువడినపుడు తైలపదేవుడు కోపావేశపరవశుడై వాక్పతిరాజును పరిభవించి, యొక వృక్షశాఖాగ్రమున ఉరి తీయించి చంపెను. ఆ వృత్తాంతము శ. ౯౧౭ మన్మథ సంవత్సరమున (౯౯౫) జరిగియుండును.

తైలపదేవుడు శ. ౯౧౯ (౯౯౭) సంవత్సరమున నెపుడో మరణించెను. అతని రాజ్యకాలమంతయు (శ. ౮౯౫-౯౧౯) ఒక వంక మాలవాధీశ్వరునితోడను, మరియొక ప్రక్క చోళులతోడను యుద్ధములతో గడచిపోయెను. కాని యాతడు మరణించుటకుబూర్వము చాళుక్యరాజ్యము కుంతలమున మరల సుస్థిరముగ బాదుకొనెను. తైలపదేవుని యనంతర మాతని తనయుడు సత్యాశ్రయుడు సింహాసన మధి

ష్ఠించెను. ఆతనికి అకలంకచరితుడనియు, ఇఱివ బెడంగు డనియు బిరుదులు. సత్యాశ్రయునకు సత్తిగ యనియు, సత్తిమ యనియు కర్ణాటదేశమున వ్యవహార ముండెను. సత్యాశ్రయుడు శ. ౯౧౯ మొదలుకొని ౯౩౧ సంవత్సరముల నడుమ (౯౯౭—౧౦౦౯) పండ్రెండు సంవత్సరములు పాలించెను. ఆతనికాలమున దక్షిణమునుండి గంగవాడి మీఁదికిని, నోలంబవాడి మీఁదికిని, చోళులు దండయాత్రలు పరంపరగ సాగింప నారంభించిరి. సత్యాశ్రయుని కాలమంతయు చోళులతోడి యుద్ధములతో గడచిపోయెను. సత్యాశ్రయునకు రాజకేసరివర్మ రాజరాజు సమకాలికుడు. వాక్పతి ముంజరాజునకు వాటిల్లిన దుర్మరణము కారణముగా మాలవాధీశుడు సత్యాశ్రయుని కాలమున కర్ణాటభూపతితో మరల వైరమును దలపెట్టలేక పోయెను. వాక్పతి రాజానంతర మాతని యనుజన్ముడు సింధురాజు రాజ్యాభిషిక్తుడయ్యెను. ప్రశాంతముగ నాతని రాజ్యకాలము కవుల గోష్ఠితో పది పండ్రేండ్లును గడచిపోయెను. అట్లగుటవలన సత్యాశ్రయుని క్లేశమంతయు చోళులతోడను, వారి కాప్తులైన వేంగీశ్వరునితోడను యుద్ధములవలన కలుగుచుండెను. సత్యాశ్రయునికి ఆంధ్రదేశము నేలుచుండిన శక్తివర్మ సమకాలికుడు. చోళ రాజరాజుచేసిన దండయాత్రలవలన సత్యాశ్రయుడు గంగవాడి రాజ్యమును గోలుపోయెను. నోలంబవాడిలో దక్షిణ భాగముగూడ యానాడు చోళసామ్రాజ్యమున కలిసిపోయెను. ఇప్పటి మైసూరు సంస్థానములోని దక్షిణ భాగమునకు పూర్వము గంగవాడి యని పేరు.

ఉత్తర ఆర్కాడు సేలం జిల్లాలలోని కొంత భాగమును మైసూరు రాజ్యములోని కోలారు జిల్లాయును ఆనాడు నొలంబవాడి రాజ్యభాగములై యుండెను. చోళసామ్రాజ్య ముత్తరమున విస్తరించుచుండ, కర్ణాట చాళుక్య రాజ్యము దక్షిణమున సన్నగిలిపోయెను. వేంగీశ్వరుడు చోళరాజునకు బంధువును మిత్రుడును గావున, నాతని పదచ్యుతుని జేసి చోళులకు కొంత ప్రాపు తగ్గింపదలచి సత్యాశ్రయుడు శక్తివర్మపై తిరుగబడి యాతని రాజ్యమును లాగుకొను టతని దాయాదులను ప్రేరేపించెను. ఆప్రయత్నమున వేంగీశ్వరుని దాయాదులకు సహాయార్థము గాబోలు బయలునంబియను బ్రాహ్మణ చమూపతిని ఆంధ్రదేశముపై దాడిచేయ నంపెను. బయలునంబి దండయాత్ర నిష్ఫలమయ్యెను. శక్తివర్మ కుంతల దండనాథులను దాయాదులను గూడ సంహరించెను.

సత్యాశ్రయుని కాలమున కుంతల చాళుక్యుల బలము క్షీణించెను. అయినను సత్యాశ్రయుడు తనదేశమును సంక్షోభింపజేసిన చోళ రాజరాజు నోడించెను. ఆతని కర్ణాట భూమి నుండి తఱిమివైచి నాతని సైన్యములను చీకాకుపఱచి వారి వస్తుసంచయమునెల్ల నపహరింపగల్గెను. అది శ.౯౨౯ (౧౦౦౭) ప్లవంగ సంవత్సరమున తావరఘట్ట యుద్ధమున జరిగెను. అటు తరువాత నాలుగైదేండ్ల వఱకు చోళులు కుంతలముపై మరల దండెత్తి రాజాలరైరి. గంగవాడి రాజ్యమును పోగొట్టుకొనినను కుంతలమునుండి మాత్రము చోళులను పూర్తిగా సత్యాశ్రయుడు తఱిమివేయగల్గెను.

సత్యాశ్రయుని యనంతర మాతమ్ముని కుమారుడు త్రిభువనమల్ల విక్రమాదిత్యుడు కర్ణాట భూమీశుడయ్యెను. విక్రమాదిత్య నామ్నులలో నత డయిదవవాడు. అతడు శ. ౯౩౧ మొదలుకొని ౯౩౪ వఱకు (౧౦౦౯—౧౦౧౩) వఱకు ఇంచుమించుగా నాలుగేండ్లు పాలించెను. అతని కాలమున మరల నుత్తరమున మాలవ దేశాధీశులతోడి యుద్ధములు ప్రారంభ మయ్యెను. సింధురాజు మరణించిన వెనుక, నాతని తనయుడు భోజరాజు ధారాపురాధీశ్వరుడయ్యెను. ఆవృత్తాంతము శ. ౯౩౨ (౧౦౧౦) సంవత్సరమున జరిగియుండినట్లు తోచును. అప్పటికి భోజుడు బాలుడు: కాని సాహస శౌర్యములు గలవాడు. భోజు డించుమించుగా ఏబదిరెండుసంవత్సరములు పరివాలించి శ.౯౮౫సంవత్సరమున (౧౦౬౨ - ౬౩) మరణించెను. తన పెదతండ్రి వాక్పతి ముంజరాజు ఇమ్మడి తైలపదేవునిచేత పరిభవింపబడి, దుర్మరణము నొందిన విషాద సంఘటన మాతని చిత్తము కలవరపెట్టెను. సింహాసనస్థుడయినది మొదలు భోజుడు కుంతల చాళుక్య భూపతిపై ప్రతిక్రియ గావించి పగ దీర్చుకొనవలయువని సంకల్పించుకొనెను. ఐదవ విక్రమాదిత్యుని కాలమున నాతడు పెక్కుమంది భూపాలుర సాహాయ్యమును గూర్చుకొని కుంతలమీదికి దండెత్తివచ్చెను. త్రిభువనమల్లు విక్రమాదిత్యు డానాడు సంఘటిల్లిన ఘోరసంగ్రామమున మరణించెను. విమలాదిత్యుని రణస్థిపూండి శాసనమున పేర్కొవబడిన సార్వభౌమ ధరణీశ్వరుడీ పరమార భోజ నృపతి గావచ్చును. త్రిభువనమల్ల విక్రమాదిత్యుని బరిమార్చుటకు

విమలాదిత్యుడు భోజునికి సాయపడియుండె ననుటకు రణస్థి పూండి శాసనము ప్రమాణము. సౌరాష్ట్రులు ప్రాయశః త్రిభువనమల్ల విక్రమాదిత్యునికి సామంతులు గావచ్చును. శక లాట గుర్జరులు భోజునికి మొదట శత్రువులై యుండి విమలాదిత్యుని శౌర్యఖడ్గ నైపుణ్యమువలన లోబడి యుండిరని యూహింపవచ్చును. త్రిభువనమల్లుని మరణానంతర మాతని యనుజుడు అయ్యణదేవుడు భోజుని వలన తన యన్నకు కలిగిన పరాభవమునకు ప్రతిక్రియ చేయ దలపెట్టి యుండును. అయ్యణదేవు డొక సంవత్సరము మాత్రమే పరిపాలించి మరణించెను. ఆతడు భోజునివలన నోడింపబడి వాక్పతి ముంజరాజువలె సంహరింపబడినట్లూహింపవచ్చును. భోజుడు తలపెట్టిసాధించిన ప్రతిక్రియకు విమలాదిత్యు డత్యధిక సహాయముచేసినట్లు తోచును.

అయ్యణదేవుని యనంతరమాతని తమ్ముడు జగదేకమల్ల ఇమ్మడి జయసింహుడు కుంతలచాళుక్య చక్రేశ్వరు డయ్యెను. ఆతడగ్రజు లిద్దరికంటెనదృష్టవంతుడు, ప్రతాపము గలవాడు, ప్రజ్ఞావంతుడు, దక్షుడు. శౌర్యసంపద విశేషముగ గలవాడు, కాని యాతనిరాజ్యారంభకాలమున కర్ణాటదేశమున విపరీతములు జరిగెను. ఆతని పరిపాలనము శ. ౯౩౬ కు సరియైన ఆనంద సంవత్సరమున (౧౦౧౪) ప్రారంభమయ్యెను. అదిమొదలుగా నాత డిరువదియెనిమిదేండ్లు కర్ణాటరాజ్యమును బరిపాలించెను.

జగదేకమల్లుని కాలమున చోళుల యభ్యుదయము దినదినాభివృద్ధి గాంచెను. గంగైకొండచోళుడని ప్రఖ్యాతి

గన్న రాజేంద్రచోళు డాతనికి సమకాలికుడు, విరోధి. ఒక వంక చోళులతోడను మరియొకప్రక్క పరమారభోజుని తోడను పోరాడుచుండినను జగదేకమల్లుడు సమర్థతతో కుంతలరాజ్యలక్ష్మిని సంరక్షించెను. సింహాసన మధిష్ఠించిన కొంతకాలమునకు జయసింహుడు విమలాదిత్యునిపై ప్రతిక్రియచేయబూని దండెత్తిపోయెను. జయసింహునకు సింహభూపతియనిగూడ పేరుండెను. కర్ణాటశాసనములందు పెక్కుచోట్ల అతడు సింహభూపతియనియే పేర్కొనబడినాడు. వేంగీదేశదండయాత్ర శ. ౯౪౦ కు సరియైన కాలయుక్తి సంవత్సరముననో (౧౦౧౮) ఇంచుకతర్వాతనో జరిగినట్లూహింపవచ్చును. బేతనభట్టు తెలిపినరీతి విమలాదిత్యుడు దుస్సాధనాధి విరోధి గజేంద్రసంఘములను ఘోరసంగ్రామమునందు రణకేళీదర్పితుడయి, ఛేదించి, కూల్చి, త్రిభువనాంకుశుడను అన్వర్థనామమును బడసెను. బలిష్ఠుడైన సింహభూపతి పరాక్రమమును పరిహసించి, మరల నింకెప్పుడును అతడు వేంగిపై కయ్యమునకు రాకుండ యోడించెను.

జగదేకమల్లుడు వేంగిపై దండయాత్ర చేసినవేళ భోజుడు విమలాదిత్యునికి సాహాయ్యము జేసియుండును. మాలవకర్ణాటకభూపతుల నడుమ వైరానల మనేకకారణములవలన ప్రవర్ధమానముగ ప్రజ్వరిల్లుచుండెను. భోజుడు కర్ణాటభూపతిని యోడించితినని గర్వముగ నొకప్పుడు చెప్పుకొనెను. విక్రమశకము ౧౦౭౬ సంవత్సరమునాటి శాసనమునందు భోజుడు తన కొంకణదండయాత్రను, జయసింహుని నోడించిన వృత్తాంతమును దెలిపియున్నాడు. కొంకణ

దిగ్విజయయాత్ర జరిగిన నొక సంవత్సరమునకు తద్విజయ సూచకముగ 'కొంకణ విజయ పర్వణి' వేళ, "స్నాన మాచరించి, చరాచరగురువును భగవంతుండునగు భవానీ పతి నర్చించి" బ్రాహ్మణులకు అగ్రహారములను, సర్వకర పరిహారముగ ధారవోసెను. అట్లు దానమిచ్చిన వేళనుబట్టి భోజుని కొంకణ విజయ దండయాత్ర శ. ౯౪౦ కు సరియైన కాలయుక్తి సంవత్సర మాఘమాసమున (జనవరి,౧౦౧౯) జరిగియుండెనని యూహింపవచ్చును †. భోజుని కాలమంతయు నించుమించుగా, జగదేకమల్లునితోడను, అతని తరువాత సింహాసన మెక్కిన త్రైలోక్యమల్ల-ఆహవమల్ల-సోమేశ్వరుని తోడను పోరాటములతో గడచిపోయెను. జయలక్ష్మి యొక ప్పుడు భోజుని వరించుచుండెను. మరియొకప్పుడు కర్ణాట భూపతుల వశమగుచుండెను. కర్ణాట మాలవ భూపతుల వైరానలము, భోజునిమరణముతోగాని చల్లారలేదు. భోజుడు చివరకు వార్ధక్యదశయందు త్రైలోక్యమల్లుని పరాక్రమధాటి కాగలేకపోయెను. పరాజయము వెనుక పరాజయమాతని వెంబడించెను. రాజధాని యగుధారానగరమును విడిచిపాటి పోవలసివచ్చెను.ధారానగరమును బ్రవేశించిదానిని త్రైలోక్య మల్లుడు విధ్వస్తము గావించెను. రాజధాని శత్రుహస్త గతమైనదను వార్త చెవిసోకినంతట భోజుడు ప్రాణములను విడిచెను. ఆ వృత్తాంతము శ. ౯౮౫ (౧౦౬౩) సంవత్సర మున జరిగెను.

† భోజుని బన్సవారా శాసనము. ఎ. ఇం. సం. ౧౧. పుట ౧౮౧.

ద్రవిడదేశమున, చోళమండలమనియు తుండీరమండలమనియు పేరులు గల, రెండు విషయములుండెను. నేటి తంజావూరు, తిరుచ్చిరాపల్లి జిల్లాలును, సేలంజిల్లా దక్షిణభాగములో గొంతయును గలిసి పూర్వకాలమున చోళమండలమను పేరున బరగియుండెను. అట్టి చోళమండలమునకు తంజావూరు రాజధానిగా నుండెను. తుండీరమండలమునకు కాంచీపురమండలమనిగూడ పేరుండెను. నేటి చెంగల్పట్టు జిల్లాయును, దక్షిణార్కాటు జిల్లాయును, ఉత్తరార్కాడు జిల్లాలోని తూర్పుభాగమును గలసి యీనాడు కాంచీపుర మండలమని పిలువబడుచుండెను. కాంచీపుర మా మండలమునకు రాజధానిగా నుండెను. చోళమండలజుల రాజ్యపాలనమున సకల ద్రావిడదేశమును జేరియుండెను. చోళ భూపతులకొకప్పుడు తంజపురి లేక తంజనగరము అని బిలువబడుచుండిన తంజావూరును, మరియొకప్పుడు కాంచీపురమును రాజధానులుగా నుండెను. చోళ రాజరాజ చక్రవర్తి యనంతరము గంగయికొండ చోళపురము రాజధాని యయ్యెను. అయ్యది తంజావూరున కుత్తరముగా, తిరుచ్చిరాపల్లి జిల్లా, ఉడయర్పాలయం తాలూకాయందించుమించుగా, డెబ్బదిమైళ్ల దూరముననున్నది. గంగయికొండ చోళపురము దైవఘటనవలన నేడు రూపుమాసి, కుగ్రామమై దీనదశయందున్నది.

కర్ణాటాంధ్రదేశములవలె చోళరాజ్యముగూడ క్రీస్తుశకపు పదియవ శతాబ్దపు కడపటిపాదకాలమున, కడగండ్లపాలయ్యెను. పరకేసరివర్మ పరాంతకదేవుని యంత్యదశ

యందు రాష్ట్రకూటచక్రేశ్వరుడు మూడవ కృష్ణభూపతి చోళరాజ్యముపై దండెత్తివచ్చెను. అతని నెదిరింపబోయిన పరాంతకదేవుని పెద్దకుమారుడు, రాజాదిత్యుడనువాడు, యుద్ధమున నోడిపోయి వీరస్వర్గము నొందెను. అయ్యది శ. ౮౭౧ వ సంవత్సరమున (౯౪౯-౫౦) జరిగెను. కన్నరదేవుడంతట విజిగీషుడై కాంచీపురమండలమునంతయు జయించి తన సామ్రాజ్యమున గలుపుకొనెను. ఆ రాజ్యమును పాలించుటకు తన సామంతుడైన విక్రమాదిత్య చంద్రాదిత్యుడను వైదుంబరాజన్యునో ఆతని తనయుని తిరువయ్యనో కాంచీపురమందునిలిపెను. కన్నరదేవు డా ధాటిని తంజాపురమును గూడ ముట్టడించి పట్టుకొనెను. ఆనాడు, శ. ౮౭౨-౮౭౬ ( ౯౫౦-౯౫౪) సంవత్సరములమధ్య పరాంతకదేవుని ముగ్గురు కుమారులును, రాజాదిత్య, గండరాదిత్య, అరింజయులను వారలు, వరుసగా యుద్ధరంగమునందో, ద్రోహకార్యముల ఫలముగనో, రాష్ట్రకూటులతోడను, వారి సామంతరాజన్యులయిన పశ్చిమగంగ, నొడంబ, పల్లవ వైదుంబులతోడను పోరాడుచు తండ్రియెదుటనే మరణించిరి. పిమ్మట అరింజయుని కుమారుడు సుందర చోళుడు చోళ సింహాసనము నధిష్ఠించెను. ఆనాడుమొదలుకొని, కన్నర భూపాలుడు జయించిన రాష్ట్రకూట సామ్రాజ్యమంతరించి పోవువఱకు శ. ౮౯౬( _ ౯౭౪)చోళరాజ్య మించుమించుగా నిరువదియేండ్లు పడరాని యిడుముల ననుభవించెను. సుందరచోళుడు, నొళంబ పల్లవ, గంగ, వైదుంబ రాజన్యుల నెదిరించి కాంచీపురమండలమును మఱల జయింపజాలక

పోయెను. అతడు శ. ౮౯౧( = ౯౬౯) సంవత్సరప్రాంతమున చనిపోయెను. అంతట చోళ సింహాసనమునకై రాజకుటుంబమున నంతఃకలహము లుద్భవించెను. సుందరచోళుని పెద్ద కుమారుడు ఇమ్మడి ఆదిత్యుడొకవంకను, ఆతని పినతండ్రి కుమారుడు మధురాంతక - ఉత్తమచోళుడొకవంకను రాజ్యలక్ష్మికై పెనగులాడిరి. ఆ సమయమున రాష్ట్రకూట సామంతుడగు ఇమ్మడి వీరమహేంద్రుడను నొడంబ పల్లవ రాజన్యుడు చోళరాజ్యముపై దాడివచ్చి, ఆక్రమించి ఆదిత్యుని జయించి, ఉత్తమచోళుని అదిమి, వారివలన గప్పములు గైకొనెను. మరల కాంచీపురము నాక్రమించుకొని, అతడు కాంచీపురాధీశ్వరుడని బిరుదు వహించెను. ఇమ్మడి వీర మహేంద్రునకు నొళంబాధిరాజనికూడ పేరుండెను. రాష్ట్రకూట సామ్రాజ్యము భగ్నమయిపోవుచుండుటయు, ఇమ్మడి తైలపుడు కర్ణాటదేశమున కుంతల చాళుక్యరాజ్యలక్ష్మిని పునరుద్ధారణ ప్రయత్నములందు నిమగ్నుడై యుండుటయు గాంచి ఆదిత్యకరికాలదేవుడు తన చోళరాజ్యమును నొళంబ పల్లవాధీశ్వరుని యధీనమునుండి విడిపింప బూనుకొనెను. కాని యాతని ప్రయత్నములు సఫలత నొందలేదు. ఒకవంక దాయాదియైన యుత్తమచోళునితోడను, మరియొక ప్రక్కను నొళంబాధిరాజ వైదుంబరాజన్యులతోడను పోరాడుచు, నతి స్వల్పకాలము మాత్రమే రాజ్యమొనరించి, ఆదిత్యుడు శ. ౮౯౬( = ౯౭౪) నందు మరణించెను.

ఆదిత్యదేవుని యనంతర మాతనికి సంతతిలేనికారణమున రాజ్యలక్ష్మి యాతని తమ్ముడు అరుణ్మొలివర్మ రాజరాజుకు

సంక్రమింపవలసియుండెను. రాజరాజు పదస్థుడగుటకు జ్యేష్ఠ వంశజుడును జ్యేష్ఠుడు నగు మధురాంతక ఉత్తమచోళు డంగీకరింపలేదు. మరల రాజకుటుంబమున నంతఃకలహము తలయెత్తనుండెను. అట్టివేళ, చోళరాజ్యము మూడువైపులను గూడ పాండ్య, నొళంబపల్లవ, వైదుంబరాజన్యులు శత్రువులై ప్రబలియుండినవేళ, విపరీత దుస్థితియందుండెను. అట్టితఱి, దాయాదితో రాజ్యముకొఱకు పోరాడి వైరానలమును మరింత వృద్ధిబొందించుట నీతిగాదనియు, నది తనకును తన రాజ్యమునకును గూడ క్షేమంకరముగాదనియు, రాజరాజు నిశ్చయించుకొనెను. పెదతండ్రి కుమారు డుత్తమ చోళునితోడ మైత్రివాటించి, రాజ్యమును బూర్తిగా నాతనికి వదలిపెట్టెను. తాను యౌవరాజ్య పట్టాభిషేకము నొందుటకును, మధురాంతకుని యనంతరము సింహాసనస్థుడగుటకును రాజరాజు ఒడంబడెను. అదిమొదలుకొని పదునారేండ్లుత్తమచోళుడు కుటుంబకలహములు లేకుండ రాజ్యము చేయగల్గెను. ఆతడు శ. ౯౦౭ సంవత్సరారంభమున (౯౮౫) తనువు చాలించెను. రాజరాజంతట చోళమహీరాజ్యమున కభిషిక్తుడయ్యెను. అదిమొదలు చోళరాజ్యమునకు మహాభ్యుదయము ప్రారంభమయ్యెను.

మధురాంతక ఉత్తమచోళుని కాలమున నంధ్రదేశమున విపరీతపరిస్థితు లేర్పడియుండెను. వేంగీమహీరాజ్యమునకై, తమ్మ డమ్మరాజ విజయాదిత్యునితో బోరాడుచు తుదకు సంగ్రామరంగమున దానార్ణవు డతని జంపెను. పిమ్మట మూడేండ్లు మాత్రమతడు రాజ్యము నేలగల్గెను. జటాచోడ

భీమ, బాదపవిజయాదిత్యులతో బోరాడుచు రాజ్యలక్ష్మి తోపాటు దానార్ణవుడు తనప్రాణములను గూడ నాహవరంగమున గోల్పోయెను. ఆనాటి యుద్ధములందు బాదపమహారాజుకూడ మరణించెను. రాజచాళుక్యవంశమున కొకనికి దాయక్రమమున సంక్రమింపవలసిన వేంగీమహీమహారాజ్యమును జటాచోడభీముడాక్రమించుకొని వేంగీశ్వరుడయ్యెను. అతడు కళింగ గంగభూపతులను బలిమిని సంహరించి, కళింగమును తనసామ్రాజ్యమునందు గలుపుకొనెను. తన్నెదిరింపవచ్చిన నితరసామంత నృపుల నెల్లర నడచి విజిగీషుడై వేంగీమహీమహారాజ్యమును విస్తరింపజేసెను. కర్ణాటదేశమున సరిగా నాకాలమున ఆహవమల్ల నూర్మడి తైలపదేవుడు చాళుక్యరాజ్యమును స్థాపించినరీతి, జటాచోడ భీముడంధ్ర దేశమున తెనుగుచోడరాజవంశమును వేంగీసింహాసనముపై నిలువుటకు సర్వము సన్నాహపఱచెను.

మధురాంతక ఉత్తమచోళుని రాజ్యారంభకాలమున నొళంబాధిరాజు మరణించుటయు నేతత్కారణమున నొళంబరాజ్యము క్షీణించుటయును సంభవించెను. అంతట నొళంబులు క్షీణదశకురాగా, వారి యధికారమును వైదుంబులు వశపఱచుకొని కాంచీపురమండలమును పాలింపసాగిరి. అంతటితో తనివినొందక నావైదుంబరాజన్యుడు తనరాజ్యమును ఉత్తరముగా తెనుగుచోడుల రేనాటి, పొత్తపినాటి, పాకనాటి సీమలకును, దక్షిణముగా కాంచీపురమండలమం దంతటను విస్తరింపజేయసాగిరి. ఆనాటి వైదుంబరాజన్యుడు శివమహారాజలిరువయ్యగాని, యాతనితనయుడు ఇమ్మడి చంద్రాదిత్యు

డైన శందయ్యమహారాజుగాని, శందయ్య సోదరుడు శ్రీకంఠ మహారాజుగాని గావచ్చును. ఆవిధముగా ఆంధ్రదేశాధీశు డయిన చోళత్రినేత్ర బిరుదాంచితుడగు జటాచోడ భీముని తోడ వైదుంబరాజన్యులకు వైరము ప్రారంభమయ్యెను. మరియు చోళత్రినేత్రునకు వైదుంబునితోడి వైరమునకు గారణము లింకను గలవు. కువళాలపుర వరాధీశ్వరులమని చెప్పుకొనిన వైదుంబులు క్రమముగా పశ్చిమమున కోలారుమండలమునుండి తూర్పునకు, రాష్ట్రకూట చక్రేశ్వరుల కాలమున వ్యాపించిరి. క్రమముగా ననంతపురమండలమునకు నచ్చటినుండి చిత్తూరు కడపమండలములోనికి విస్తరింపసాగిరి. బాణరాజ్యసీమనాక్రమించుకొనిరి. బాణులసీమ నేటి కాళహస్తి మొదలుకొని పడమరగా వ్యాపించియుండెను. వైదుంబులకు బాణులంతట వశవర్తులయిరి. వైదుంబులకు పశ్చిమ గంగ, నొళంబపల్లవుల సాహాయ్యమేర్పడెను. వైదుంబుల పశ్చిమ గంగులకు దగ్గఱిచుట్టములు. అదిగాక పశ్చిమగంగ వంశము నుండి విడిపోయిన యొకశాఖవారే వైదుంబులుగానేర్పడిరి. నొళంబ రాజవంశజులు బలహీనులైనాడు వైదుంబులు బలవంతులైరి. వైదుంబులు విస్తరింపనారంభించిననాటనుండి, వారికి తెనుగుచోడులతో బద్ధవైర మేర్పడియెను. అది కులవైరముగ పరిణమించెను. చోళత్రినేత్రుడు వేంగీశ్వరుడగు నాటివఱకు తెనుగు చోడులు వేంగీశ్వరులకు సామంతులై వర్తించిరి. అప్పుడప్పుడు వేంగీ రాజచాళుక్యవంశముతో బంధుత్వమును గూడ కలుపుకొనియుండిరి. అట్టి పరిస్థితులుగుణగ విజయాదిత్యుని నాటనుండి యేర్పడుట ప్రారంభమయ్యెను.

పశ్చిమగంగ, నొళంబ, వైదుంబాదులు రాష్ట్రకూటుల కరిగాపులు. రాష్ట్రకూట వేంగీచాళుక్యులకు నడుమ చిరకాలము జాతివైరము ప్రబలియుండెను. రాజపరమేశ్వరులయిన రాజవంశముల కులవైరములు బంధుత్వములు కలిసిన కారణమున వారివారి సామంత రాజన్యవంశములకు కూడ ప్రాకెను. ఆరీతిగా తెనుగు చోడులును వైదుంబులును పరమశత్రువులైరి. అన్యోన్య రాజ్యాభిలాషులై ప్రాతవైరములను పోషించుచు ఒండొరులపై తఱచుగా యుద్ధములకు తలపడుచుండిరి. ఇన్ని వైరకారణములుండ, ఆంధ్ర కళింగ దేశములందు తన్నెదిరింపగల నరపతి యొకడు లేడను కారణముననేమి, తనరాజ్యము విస్తరింపజేయుతలంపుతోడనైననేమి, తన రాజ్యసీమలను దురాక్రమణ చేయదలంపుతో జొఱబడిన వైదుంబరాజన్యుని శిక్షించుటకైన నేమి, చోళత్రినేత్రుడు కాంచీపురమండలము మీదికి దండయాత్ర వెడలెను. వైదుంబరాజన్యుని సంహరించుటయు, నాతనిబలదర్పము నణచుటయు మధురాంతక ఉత్తమచోళునికి మిక్కిలిప్రీతికరమైన కార్యము. ఆనాటి వైదుంబరాజన్యుడు చోళధాత్రీనాథున కతిభయంకరుడై యుండుట దానికి కారణము. జటాచోడ భీముని ప్రతాపాలనమున వైదుంబరాజన్యుడోడి మరణించెను. ఆనాటికొక పదియేండ్లుగా సాగుచున్న వైదుంబరాజ్య వైభవము మంటగలసెను. జటాచోడభీముడంతట కాంచీపురమును జయించి, వైదుంబరాజ్యలక్ష్మి నపహరించి, యచ్చటి రాజసింహేశ్వరాలయమున తన జయస్తంభమును నాటెను. తన దిగ్విజయముల నన్నింటి నొక ప్రశస్తికావ్యముగ వ్రాయించి, యా

జయస్తంభముపై శిలాశాసనముగా వ్రాయించెను. ఆవృత్తాంతమంతయు నించుమించుగా శ. ౯౦౩ కు సరియైన వృష సంవత్సరమున (౯౮౧-౮౨) జరిగియుండిన ట్లూహింపవచ్చును†.

జటాచోడభీముని దిగ్విజయానంతరము రెండు మూడేండ్లలోపల మధురాంతక ఉత్తమ చోళుడు కాంచీపుర మండలమును జయించి, మరల తన చోళరాజ్యమున కలుపుకొనగల్గెను. తనయవసానదశను ఆభూపాలుడు కాంచీపురమునందు గడపి యుండెను. ఆతని యనంతరము రాజరాజు చోళ సింహాసన మధిష్ఠించెను. ఆతని రాజ్యారంభము శ. ౯౦౭ కు సరియైన పార్థివ సంవత్సరమున (క్రీ. శ. ౯౮౫) జరిగెను. ఆ వేళకు చోళరాజ్యము పెనుగాలికి జిక్కి మెట్టబట్టి యిసుకలో కూరుకొనిపోయిన ఓడ చందాన నుండెను. దాని నుద్ధరించగల దక్షుడు రాజరాజు అవతరించెను. అతడు మహోద్యోగి, ప్రచండ శౌర్యమూర్తి, పరాక్రమశాలి, అదృష్టవంతుడు.

రాజరాజుకు ముమ్మడిచోళుడని రెండవపేరు. కుల క్రమానుగతమైన రాజకేసరివర్మ బిరుదాంచితుడతడు. జాఱిన చోళ రాజవంశ గౌరవమును మరలసుప్రతిష్ఠితము జేసెను. సైన్యమును వృద్ధిపఱచెను. సమర్థులగు ఆహవ కార్యనిపుణులను దండనాథులుగా నియమించెను. ముందుగా పాండ్య కేరళ రాజ్యములపై దండెత్తి పలుమారు సంగ్రామ రంగ

† ఎ. ఇం. సం. ౨౧ పుటలు ౨౯-౩౪. ఆదే జ. ఎ. హెచ్. ఆర్. ఎస్. సం. ౧౦ పుటలందు: ౧౬-౬౦. పునర్విమర్శనతో నాచే ప్రకటించెను.

మున వారి పీచమడచి, తద్రాజ్యాధిపతులవలన మున్నుందు తనరాజ్యమున కెట్టి ముప్పును రాకుండ జేసివచ్చెను. పాండ్య చేర నృపతులవలన గప్పములు గొనెను. సింహళద్వీపమును జయించి చోళ సామ్రాజ్యమును విస్తరింపజేసెను. ఆవిధముగ దక్షిణ దిగ్విజయము ముగియునాటికి పదియేండ్లు పట్టెను. కాని యంతకు బూర్వ మాతనిదృష్టి ఉత్తరదేశముల మీాదికి బ్రసరించెను. గంగవాడిని నొళంబవాడి రాజ్యభాగమును జయించి తన సామ్రాజ్యమును తుంగభద్రాతటమువఱకు వ్యాపింపజేయ సంకల్పించెను. మొదట నొళంబవాడి రాజ్యములోని దక్షిణభాగమును జయించెను. పిమ్మట కర్ణాట రాజ్యాంతర్గతమైన గంగవాడిమీాద దండయాత్రలు జరిపెను, మొదటి దండయాత్ర యెపుడు జరిగెనో తెలియదు గాని కర్ణాటులకును చోళరాజరాజులకును వైరము ఇమ్మడి తైలప దేవుని కాలమున ప్రారంభమయ్యెను. ఆహావమల్ల ఇమ్మడి తైలపుడు జీవించి యున్నంతకాలము మాత్రము రాజరాజు గంగవాడిని జయింపజాలడయ్యెను. ఆహవమల్లునికి, ప్రాయశః జటాచోడభీము ప్రాపును సహాయమునుండినకతన చోళులు గంగవాడి రాజ్యమును జయింపజాలకపోయిరి. ఆనాడు రాజరాజెంతటి వీరుడో యంతకంటె యత్యధికమయిన బల పరాక్రమములు గల మేటివీరులు ఆహావమల్లు, జటాచోడ భీములు. వా రుభయులును జీవించి యున్నంతకాలము చోళ రాజ్యము విస్తరించలేదు. ఒకప్పుడు రాజగాజు గంగవాడి మీాదికి దండెత్తివచ్చెను. ఆనాడు రొద్దంవద్ద చోళ కర్ణాట భూపతులకు దారుణ సంగ్రామము జరిగెను. రాజరాజు

పూర్తిగ నోడిపోయి, నూరుమద గజములనుగూడ వదలిపెట్టి వెనుకకు మరలిపోయెను. రొద్ద మానాడు ప్రసిద్ధమైన మహా దుర్గము. అది అనంతపురము జిల్లాలో పెనుకొండకు, సూటిగా పడుమటిదిశను, పెన్ననదికి వలపలయొడ్డునవంపులో, పదునాలుగు మైళ్లదూరమున నున్నది. రొద్దం యుద్ధము శ. ౯౧౮ (౯౯౬) నకు సరియైన నందన సంవత్సరమున జరిగెను. రాజరాజు నోడించిన వృత్తాంతమును తైలపదేవుని సామంతుడొకడు శిలాశాసనమున వ్రాయించెను. †

ఇమ్మడి తైలపుడు శ. ౯౧౯ కు సరియైన హేవిలంబి సంవత్సర మార్గశిరమాసమున (నవంబరు ౯౯౭) మరణించెను. పిమ్మట నాతని అగ్రతనయుడైన ఇటివ బెడంగ సత్యాశ్రయుడు కుంతల చాళుక్య మహారాజ్యమున కభిషిక్తుడయ్యెను. అతడు తండ్రిని బోలిన శౌర్యపరాక్రమాదిగుణ సంపన్నుడు; కాని ఆనాటి దేశ కాలపరిస్థితులు, ముఖ్యముగ వేంగిదేశ పరిస్థితులు సత్యాశ్రయుని ఒంటరి వానిని జేసెను. ఇమ్మడి తైలపదేవునికి సాహాయ్యము చేసిన జటాచోడ భీమునివంటి వీరుడు, ఆ వేంగీశ్వరునివంటి మిత్రుడు సత్యాశ్రయునికి లేకపోయెను.

† పా. ఇ. ఇ., సం. ౯ భాగము ౧. పెం. ౭౭.

# తృతీయ ప్రకరణము

దానార్ణవునికి, యుద్ధరంగమున మరణించునాటికి, శక్తివర్మ, విమలాదిత్యులను ఇద్దరు తనయులుండిరి. అప్పటికి వారిరువురు బాలురై యుండిన కారణమున, అత్యధికప్రతాప మూర్తియైన జటాచోడభీముని ప్రతిఘటించి పైతృకరాజ్య మును బడయజాలరైరి. శక్తివర్మ కప్పటి కించుమించుగా ఆరేడు సంవత్సరములును విమలాదిత్యునకు నాలుగైదేండ్లు వయసునుండినట్లూహింపవచ్చును. ఆ రాజచాళుక్య జ్యేష్ఠ వంశజులలో నగ్రజుని వేంగీసింహాపీఠముపై గూర్చుండ బెట్టు టకు సామంత మండలిక లోకమునకుగాని, ప్రధానులకుగాని, ఆప్తవర్గమునకుగాని శక్తిచాలకుండెను. బాదపమహారాజు తాళరాజవిష్ణువర్ధనులు మరణించిన వెనుక జటాచోడభీముడు నామమాత్రముగ వారి సంతతివారికేమయిన సహాయ్య మొనర్చియుండును. కాని నిజమున కాతనికే ఆంధ్రభూమిని సార్వభౌమపదవితో నేలవలయునన్న అభిలాష కలిగెను. అత డప్రతిమాన పరాక్రమశాలియు, బలవంతుడు నగుట వలన, నాతనెవ్వరు నెదుర్కొనజాలరైరి. దుర్మతియై యాతడు తన సోదరి రాజ్యమును తానే యనుభవింపసాగెను. ఆతని రాజ్యపాలనము దానార్ణవుని యనంతర మారంభ మయ్యెను.

జటాచోడభీముడు తెనుగుచోడవంశ సంభూతుడు. ఆతని వంశ ప్రశస్తియు వీరకృత్యములును కాంచీపుర విజయ

స్తంభముమీద నున్న శాసనకావ్యమందు గలవు. అతని పూర్వులు రాజచాళుక్య వంశమునకు సామంతులు. బంధువులుకూడనై యుండిరి. వారు మండలిక శిఖామణులు; హిరణ్యరాష్ట్రమని బిలువబడుచుండిన రేనాటిక్రప్రభువులు. మహేశ్వరవరప్రసాదమున మహీరాజ్యమును అమరదుర్గా ప్రసాదమున సింహలాంఛనమును బడసిరి. అనేక శివాలయ, తటాకారామాదుల నిర్మించి యశఃకాయులైరి యాతని పూర్వులు. అట్టి తెనుగు చోడవంశమున వసుధాపతియైన చోళత్రినేత్రుడు పుట్టెను. యక్షేశ్వరప్రభృతులచే పూజింపబడుచున్న శ్రీభీమేశ్వర మహాదేవునికి సమానుడగుట చేత నాతడు చోళత్రినేత్రుడయ్యెను. కొల్లభిగండవిజయాదిత్యుని నాడు చోళత్రినేత్రుని పూర్వులకు రాజచాళుక్యవంశముతో బంధుత్వమేర్పడినట్లు గానవచ్చును. చోళత్రినేత్రుడు భీమావతారుడు; భీమపరాక్రముడతడు; మహాహవములను నడపుటయందు సమర్థుడు, రణకేలీదర్పుడతడు. అతడు పరమేశ్వరుడు, పరమభట్టారకుడు. "అతడు కృతయుగమున మాంధాతయై పుట్టెను. త్రేతాయుగమున రావణుడై జన్మించెను. ద్వాపరమున కురుకుల ధ్వంసియైన పాండు పృథాత్మజుడై యవతరించెను. కలియుగమందు శౌర్యాది ధర్మగుణనిధియై భీముడను పేరుతో ఆ చోళత్రినేత్రుడు జనించెను." దాన శౌర్యధర్మాది గుణములుగల చోళత్రినేత్రునివంటి భూపతి ముందుజన్మింపలేదు. భవిష్యత్కాలమున నింకపుట్టడు. అతడు రిపునృపాలవర్గమును సంహరించి పరచక్రభీముడని ప్రఖ్యాతి వహించెను. భగదత్త సమానుడతడు. ఇంద్రునివలె శత

క్రతువు లొనర్చిన ధన్యుడు. అతడు కరికాలచోడ బిరుదాం చితుడు. మాండలికశిఖామణి యతడు. గండభూరిశ్రవ, సంగ్రామవిజయ, అరసరాభరణ, సుకవిచింతామణి, కీర్తి దిలీప, సత్యావతార, సమరైకవీర, రణరంగమల్ల, పర గండరాక్షస, దీనకల్పద్రుమ, భూపాలమేరు, అచలితవీర్య, చతురంగ రాజవిద్యాధర, విక్రమధనంజయ, సౌజన్య ధవళ, దుష్టకాలానన, అసహాయ విక్రమ, ఆచారభగీరథ, కార్ముకరామ, అపురాణదధీచి, సూర్యకులవాస, రాజమకర ధ్వజ, విక్రాంతచక్రాయుధ, గోండళసాహస, చలరంగరామ, రణరంగమృగేంద్ర, త్యాగమహార్ణవ, నరలోకరుద్ర, ఇత్యాదు లాజటాచోడభీమ నృపాలుని బిరుదములు.

తెనుగు చోడులు, తమిళ చోళులును గూడ తొలుత చోళవాడి సీమనుండి విస్తరించిరి. ఉభయులును గూడ కరి కాలచోడుని వంశకర్తగా చెలువుకొనినారు. చోళవాడి తెలిం గాణములోనున్న మహబూబునగరు, లేక పానగల్లు పరగ ణాకు ఆదికాలమునాటి పేరనితోచును. పడుమటను దక్షిణ మునను చోళవాడికి భీమనదీ కృష్ణవేణీ నదులు సరిహద్దులు, తూర్పుదిక్కున దిండి నదియు, నుత్తరమున పర్వతశ్రేణులును వరుసగా సీమలు. జలసమృద్ధిగలిగి నానావిధ సస్యఫల సంప దలు గలిగిన పచ్చనిభూమి యాచోళవాడి. ఆప్రాంతమునుండి క్రీస్తుశకారంభకాలమునకు బూర్వ మనేక చోడక్షత్రియవంశ ములు శస్త్రజీవులై, పరభూముల విక్రమించి యాక్రమింప నిచ్ఛగలిగి కృష్ణ దాటి దక్షిణాభిముఖముగా వ్యాపించిరి. ఒక తెగవారు ఆంధ్రదేశమున హిరణ్యారాష్ట్రమున (నేటి కడప

మండలమును కర్నూలులోని దక్షిణభాగమును కలిసిన ఖండమున నిలిచిపోయి పాదుకొనిరి. వారినుండి చీలిపోయిన శాఖలు కమ్మరాష్ట్రమందును పాకనాటియందును క్రమముగా వ్యాపించిరి. మరియొక తెగవారు, కావేరీప్రాంతమువఱకు బోయి, తత్ప్రాంతమున రాజ్యము స్థాపించుకొని, యాసీమకు చోళమండలమని అన్వర్థనామమును గల్పించిరి. పిమ్మట కొంతకాలమునకు ద్రావిడదేశమునుండి తమిళచోళవంశ శాఖలు కొన్ని ఉత్తరముగా వ్యాపించి, పాకనాడు, కమ్మనాడులందు చిన్నచిన్న మాండలికరాజ్యముల నాక్రమించుకొని స్థిరముగ నిలచిపోయిరి. రేనాటి తెనుగుచోడులు మాత్రము దక్షిణమునకు వ్యాపించియుండలేదు. తెనుగు తమిళచోళు లుభయతెగలవారును సూర్యాన్వయులమనియు, కాశ్యపగోత్రులమనియు డెలుపుకొనిరి. ఇది యొక్కటి తక్క తెనుగు తమిళచోళులకు ఇతరసామ్యములు లేవు. తెనుగు చోడులు అమరదుర్గారాధకులు, సింహలాంఛనులు. తమిళ చోళులకు శార్దూలము లాంఛనము; ధ్వజముగూడ నదియ.

అట్టి తెనుగు చోడవంశమునబుట్టిన భీమమాండలిక శిఖామణి, చోళత్రిణేత్రుడు, శైశవమునాడు ముమ్మడి కృష్ణ భూపతి నెదిరించి, యాతని సైన్యమును నిర్జించెనట! శైశవ మనుటచేత నావీరకృత్యము చోళత్రిణేత్రుడు ఇంచుమించుగా పదిహేనుసంవత్సరములు లోపలి వయసువాడని యూహింప వచ్చును. ముమ్మడి కృష్ణభూపతితోడి యుద్ధమెప్పుడు తటస్థ మయ్యెనో తెలియదు; కాని యొకరీతిగా నూహింపవచ్చును. ముమ్మడి కృష్ణరాజు, బాదపునికి సహాయముచేయ తలంపుతో

# చోళరాజ వంశము

- పరకేసరివర్మ - వీరచోళ
  మొదటి పరాంతక దేవుడు
  శ. ౮౨౯-౮౭౬ (=క్రీ. శ. ౯౦౭-౯౫౪)
  - రాజాదిత్యుడు
  - అరింజయవర్మ
    (అరిందమవర్మ)
    - రాజకేసరివర్మ - ఇమ్మడిపరాంతకదేవుడు
      సుందరచోళుడు
      శ. ౮౭౬-౮౯౧ (=క్రీ. శ. ౯౫౪-౯౬౯)
      - పరకేసరివర్మ
        ఇమ్మడి ఆదిత్యుడు - కరికాలుడు
        శ. ౮౯౧-౮౯౭
        (క్రీ. శ. ౯౬౯-౯౭౫)
      - రాజకేసరివర్మ అరుణ్మొళివర్మ,
        మూర్మడిచోళ, నిత్యవినోద,
        చోళనారాయణ, ముమ్మిడిచోళ,
        రాజేంద్రవిద్యాధర,
  - గండరాదిత్యుడు
    - పరకేసరివర్మ
      మధురాంతకదేవ
      ఉత్తమచోళుడు
      శ. ౮౯౧-౯౦౭
      (క్రీ. శ. ౯౬౯-౯౮౫)

- రాజరాజదేవుడు
  శ. ౯౦౭–౯౩౪ (=క్రీ. శ. ౯౮౫–౧౦౧౩)
  - పరకేసరివర్మ
    గంగైకొండచోళ
    రాజేంద్రచోళుడు
    శ. ౯౩౪–౯౬౫
    - ..యరాజేంద్ర
      రాజాధిరాజు
      శ. ౯౪౦–౯౭౫
      (=౧౦౧౮–౧౦౫౩)
    - రాజేంద్రదేవుడు
      శ. ౯౭౪–౯౮౪
      (౧౦౫౨–౧౦౬౨)
    - వీరరాజేంద్రుడు
      శ. ౯౮౪–౯౯౧
      (=౧౦౬౨–౧౦౭౦)
  - కుందవాదేవి = విమలాదిత్యుడు
    - అమ్మంగదేవి = రాజరాజ విష్ణువర్ధనుడు
      రాజరాజనరేంద్రుడు
      - రాజేంద్రచోడదేవుడు
        కులోత్తుంగచోళదేవుడు
        శ. ౯౯౨–౧౦౪౦
        (=౧౦౭౦–౧౧౧౮)

72133

కళింగముమీదుగా నంధ్రదేశముమీదికి దండె త్తివచ్చెను. ఆనాడంధ్రజగతీపతి అమ్మరాజ విజయాదిత్యుడు. ఆదండ యాత్ర ఇమ్మడి అమ్మరాజు పదనొకండవ విజయరాజ్యవర్ష మున జరిగెను. అది శ. ౯౨౨ కు సరియైన రాక్షససంవత్స రమున చివరమాసములలో (జనవరి ౧౦౦౧) జరగియుండెను. కృష్ణభూపతిమీద కోపమున నాతని శిక్షించుటకు ఇమ్మడి అమ్మరాజు కళింగమునకు బోయెను. ఆవేళ జటాచోడ భీముడు, తన మేలికతో గలిసి కృష్ణభూపతిమీదికి యుద్ధము నకు బోయియుండును. ఆనాటి కళింగ సంగ్రామమున కన్నర దేవు డోడి వెన్నిచ్చిపాఱిపోయెను.

చోళత్రినేత్రుడు తన కాంచీపుర ప్రశస్తియందు 'అంధ్రమండము తనతోబుట్టువు రాజ్యమని (స్వభగినీపద మంధ్రమండల' మ్మనిదెలిపియున్నాడు. ఆవాక్యమున కీరీతిగా అర్థమూహింపవచ్చును. జటాచోడ భీముని తోడబుట్టువు, అమ్మరాజరాజమహేంద్రునికి దాయాదియు, విరోధియు నగు బాదపాధిరాజుకు దేవేరియై యుండవచ్చును. ఈయూహ సరియైనచో బాదపునితోడి చుట్టఱికము జటాచోడభీమునికి పూర్వోదాహృతమయిన కళింగయుద్ధానంతరము, శ. ౯౨౨ (౧౦౦౧) సంవత్సరము తరువాత, కలిసియుండును. బాదపుడు వేంగీచాళుక్యులలో చిన్నకోవకు జెందినవాడు. గుణగ విజయా దిత్యునికి స్వామిద్రోహముజేసిన మల్లరాజను యుద్ధమల్లుని ప్రపౌత్రుడు. బాలుని కంఠిక విజయాదిత్యుని చెఱయందుంచి, ఒక్కమాసము రాజ్యమేలిన తాడపుని పౌత్రుడు. ఏడేండ్లు రాజ్యమేలి, సత్యవాక్పరిపాలనాదక్షుడని ప్రఖ్యాతిగాంచిన

యుద్ధమల్లునిపుత్రుడు. కావున బాదపునికిగూడ వేంగీమహీ మహారాజ్యము పైతృకమైనదాయము. ఆంధ్రరాజ్యమును జయించి వేంగీశ్వరుడగుటకు, అమ్మరాజ విజయాదిత్యుని పదచ్యుతిని చేయుటకు బాదపుడు కన్నరదేవుని సాహాయ్య మభిలషించెను. ఆరాష్ట్రకూటకులస్వామి యొనర్చిన సాహాయ్యమున బాదపుడు అమ్మరాజ విజయాదిత్యుని యోడించి, కొంతకాలము వేంగీశ్వరుడుగా నభిషిక్తుడగుట సంభవించెను. అది యెప్పుడు జరిగెనో తెలియదు. ఆసంఘట్టనమందు జటాచోడ భీముడు బాదపునికి సహాయుడై నిలచి, యాతని వేంగీశ్వరునిగా నభిషేకించుటకు తోడ్పడి యుండును. ముమ్మడి కృష్ణరాజు శ. ౮౮౮ (౯౬౭) సంవత్సరమున మరణించెను. కావున బాదపుడు ఇమ్మడి అమ్మరాజు నోడించి సమస్తభువనాశ్రయ శ్రీవిజయాదిత్యుడనుపేరుతో వేంగికి పట్టముగట్టుకొన్న వృత్తాంతము తత్పూర్వము జరిగియుండును. బాదపు డావిధముగా ఆంధ్రధరణీశ్వరుడయ్యెను. ఆతడు పదచ్యుతుడైన వెనుక మరల రాజ్యమునకై దానార్ణవునితో బోరాడి ప్రాణములను గోల్పోయెను. బాదపునికి సంతానము లేని కారణమునగాబోలు, యాతని మహిమికి సంక్రమించిన ఆంధ్రరాజ్యమును జటాచోడభీముడు 'స్వభగినీపద మంధ్రమండల'మని దెలుపుచు, నంధ్రరాజ్యమును సంరక్షించు నధికారము తనతోడబుట్టువుదని తెలిపినాడు.

బాదపుని యనంతరము జటాచోడభీముడు తన సోదరి పక్షముబూని దానార్ణవుని, యాతనితమ్ముని నృపకాముని యెదిరించి పోరాడెను. అతడు వేంగీసామ్రాజ్యమును జయిం

చిన విధమంతయు, నాతని కాంచీపుర జయస్తంభముపై నున్న ప్రశస్తి దెలుపుచున్నది. జటాచోడభీముడు దానార్ణవ నృపకాముల నుభయుల నోడించి సంగ్రామరంగమున వారి సత్సకలసైన్యమును సంహరించి చంపెను. దానితో జటాచోడ భీముని ఎదిరించి పోరాడగలవాడు వేంగీచాళుక్యవంశమున ఆనాడులేకపోయెను. దానార్ణవ నృపకాములకు తోడ్పడ వచ్చిన కళింగభూపతులను గూడ నాతడు సంహరించెను. త్రికలింగాటవీరాజ్యమును జయించెను. రాజచాళుక్యవంశజు నొకని వేంగీశ్వరుని జేసి స్వామిభక్తిపరాయణుడై వర్తించుటకు మారుగా నతడే అంధ్రభూమిని పరిపాలింపసాగెను. దానార్ణవతనూజుడైన శక్తివర్మకు మారొడ్డి, వేంగీరాజ్యమాతని స్వాధీనముగానీయక నిరువదియేడు సంవత్సరములు చోళత్రినేత్రుడు అంధ్రభూమి నేలెను.

శక్తివర్మ తండ్రియు, పినతండ్రియు గతించిన నాట నుండి, వేంగీ మహీమహారాజ్యమును మరల జయించుటకై ఎడతెగక కృషిచేయుచు జటాచోడునితో బోరాడుచునేయుండెను. ఆతనికి సాహాయ్యము చేయవచ్చిన కళింగ భూపతి మొదటి కామార్ణవుడని యూహింపవచ్చును. అతడు మొదట వజ్రహస్తదేవుని కుమారుడు. ముప్పదియైదేండ్లాతడు (శ. ౮౬౪ - ౮౯౯) కళింగమును వేంగీశ్వరునికి సామంతుడై పరిపాలించెను. ఆతనికి వరుసగా రాజభీమ, అమ్మరాజ, విజయాదిత్య, దానార్ణవులు ముగ్వురును సమకాలికులు. శక్తివర్మకు పాయము జేయవచ్చినాడని క్రోధావేశమున చోళత్రినేత్రుడు కామార్ణవుని సంహరించెను. అంతటితో నాతని

కోపాగ్ని చల్లారలేదు. కామార్ణవుని వెనుక కళింగాధీశు డయిన యాతని తమ్ముని వినయాదిత్యుని గూడ జంపెను, ఆ కథయంతయు కాంచీపుర ప్రశస్తియందు గలదు. వినయాదిత్యుడు మూడు సంవత్సరములు మాత్రము రాజ్యముచేసి శ. ౯౦౨(=౯౮౦) న వీరస్వర్గము నొందెను. కళింగాధీశుల సాహాయ్యము తనకుపకారి గానందున శక్తివర్మ యితరులతో మైత్రి నెఱపెను. వారిలో ముఖ్యులు చోళులు.

తంజాపుర చోళభూపతులు కూడ వేంగీచాళుక్యులకు బంధువులయినట్లు గన్పింతురు. అరింజయవర్మ దేవేరి యొక్క తెకుందవాదేవి చాళుక్యభీముని తనయట. ఆ చాళుక్య భీమనామ్నుడు రెండవవాడు గావచ్చును. సుందరచోళుడు తనకుమార్తెకు కుందవాంబ యని పేరిడెను. ఆమె చోళ రాజరాజుకు సోదరి. రాజరాజు తన కూతుకు కుంద వాంబ యని పేరు పెట్టెను. ఆమె విమలాదిత్యుని యగ్ర మహిషియయ్యెను. కావున చిరకాలమునుండి తంజాపుర చోళులకును, వేంగీచాళుక్యులకు సంబంధ బాంధవ్యములు కలియుచుండి నట్లూహింపవచ్చును. శక్తివర్మ శైశమునాడు చోళులకు సహాయముచేయ బోయినట్లు గాన్పించును. శక్తివర్మ తన శైశవమునాడు "ద్రమిళాహవము" నందు గజసంఘములను, మృగరాజువలె శౌర్యముతో విక్రమించి ఖండించి, కీర్తిగనెను. ఆ చౌళికరణమందాతనికి బలమైన గాయములు తగిలెను. చివరకు జయలక్ష్మి యాతనినే వరించెను. ఆయుద్ధము చోళులతోగాక, చోళ పక్షమున బోరాడిన యుద్ధమనితోచును. పదునైదేండ్ల పర్యంతరము

శైశవము గావునను, తండ్రి మరణించు నాటికి శక్తివర్మ ఆరేండ్లవయసుగల వానినిగా నిర్ణయించితిమి గావునను, ఆతని శౌర్యము శోభించిన శైశవమునాటి 'ద్రమిళాహవము' చోళ మధురాంతక దేవుని చివర విజయరాజ్య సంవత్సరములందు జరిగియుండునని యూహింపవచ్చును. 'ద్రవిళాహవము'న శక్తి వర్మశౌర్యకృత్యములు కారణములుగా విజయముచేకూరి యుండెననుట నిస్సంశయము. ఉత్తమచోళ మధురాంతక దేవుడు తన కడపటి సంవత్సరములలో కాంచీపురమును జయించి, యామండలమున తనచోళరాజ్యమున గలుపుకొనెనని యీ వఱకు దెలిపియుంటిమి. ఆవృత్తాంతము జటాచోడభీముడు కాంచీపుర విజయముతో జయస్తంభము నాటిన ఒకటి రెండేండ్లు దాటినపిమ్మట జరిగియుండును. జటాచోడ భీముడు కాంచిపురమున శ.౯౦౪(౯౮౨-3) సంవత్సరమున జయస్తంభమునాటినట్లా శాసన ప్రశస్తియందు గలదు. కావున శక్తి వర్మ గెలిచిన ద్రమిళాహవము, ఉత్తమచోళ మధురాంతక దేవుడు కాంచీపురమును మరల జయించిననాడు జరిగి యుండును. 'ద్రమిళాహవము' మరియొకటిగూడగావచ్చును. ఆహవమల్ల ఇమ్మడి తైలపుడు నిల్గుండ శిలాశాసనమందు "చోడాంధ్రాధీశుల నోడించెనని వర్ణింపబడినాడు. *

---

* యస్యశ్రుత్యాభిధానం సకలరిపునృపానీక నిర్మూలనోత్థం
కింకర్తవ్యం, క్వయామః, క్వచవసతిరితి వ్యాకులాశ్చింతయంతి।
చోడాంధ్రాధీశ పాండ్యోత్కల మహీపతయో యేనచాంభోధిసీమా
క్షమారామాస్వీకృతా యోహసతి నృపగుణైరాదిరాజా న్నలాదీన్॥

ఆశాసనము శ. ౯౦౪ కు సరియైన చిత్రభాను సంవత్సర భాద్రపద బహుళ అమావాస్యనాటి సూర్యగ్రహణవేళ (౨౦ సెప్టెంబరు ౯౮౨) నొసగిన భూదానమును దెలుపుచున్నది. కావున "ద్రమిళాహవము" ఇంచుమించుగా నాడుచటి సంవత్సర మఉత్తమచోళ శక్తిశర్మలతో ఇమ్మడి తైలపుడు పోరాడినదిగావచ్చును. ఆనాటి యుద్ధకారణములు దురూహ్యములు. అయినను తైలపునకు నుత్తమచోళునితో సంఘటిల్లిన పోరులందు శక్తివర్మ బాల్యమునుండియు చోళ భూపతికి సాహాయ్యము చేసియుండెననుటకు సందియము లేదు. ఆనాటి ఆంధ్రాధీశుడు శక్తివర్మగాని జటాచోడభీముడు కాజాలడు. చోడాంధ్రాధీశుల పాటు పాండ్యోత్కల నరపతులనుగూడ తైలపదేవుడు జయించి నట్లా శాసనము తెలుపుచున్నది. ఉత్కలుడన్న కళింగ గంగభూపతి కావచ్చును; నిజముగా ఉత్కలుడన్న ఒడ్డెరాజు కాజాలడు. శక్తివర్మతో కలిసివచ్చి ఉత్తమచోళునకు సాహాయ్య మొనరించినది ఇమ్మడివజ్రహస్తదేవుడు, శ. ౯౦౨-౯౩౬, (౯౮౦ - ౧౦౧౪) కాదగును.

శక్తివర్మ వేంగీమహీరాజ్యమును జయించుటకు చేయుచుండిన ప్రయత్నములకు జటాచోడభీముడు బలవంతుడగుటచేత ప్రతిక్రియలు జరుపుచుండెను. శక్తివర్మధైర్య గాంభీర్య స్థైర్యములు కలిగి, రాజ్యతంత్రమున మాయోపాయములనేకములను పన్నెను. ఆతని యాస్థానకవియొకడు 'మృగాధివసతిం మాయాం, హరేః పౌరుషం' అని శక్తివర్మను ప్రశంస

జేసెను. చోడభీముడొకప్పుడు శక్తివర్మను జంపుటకు ఏక వీరు నొకనిబంపెను. ఆశ్చర్యమును గొలుపగల సాహసముతో తనబాహుబలమున నాతని శక్తివర్మ పరిమార్చెను. శక్తివర్మ క్రమక్రమముగా బలవంతుడై, విజయోపేతుడై, దాయాదులగు బద్దెమ,మహారాజాదుల, నుద్ధతులను, సంహరించెను. జటాచోడభీముడంపిన సైన్యములను,చరులను సంహరించుచు ఆహవకార్యములతో, శత్రుబలనిర్భేదన ప్రయత్నములతో జయాపజయములతో శక్తివర్మ మహోద్యోగియై మహోత్సాహియై, నిరాశజెందక, ఇరువదియేడు సంవత్సరములహోరాత్రములు పోరాడెను. తుదకు జయలక్ష్మిని బలవంతుడై గ్రహించెను. శక్తివర్మయొక్క మహాహవకార్య దీక్ష, అతని ధైర్యస్థైర్యములు, అతని యకుంఠిత శౌర్య ప్రతాపములు, నప్రతిమానములు. వర్ణనాతీతములైన గుణ విశేషములు. పరంపరగా నడచిన సమయుద్ధములకును వాటిల్లిన పరాజయములకును అతడు క్రుంగిపోలేదు. ఇరువది యేడేండ్లతడు పౌరుషముతో పోరు సాగించి, తుదకు జయ లక్ష్మిని గ్రహించినరీతి యత్యాశ్చర్యకరమైనది. అతడు సత్యాశ్రయపాలకేశివల్లభేంద్రునివలె, "అపరుద్ధచరితుడై" కడకు యుద్ధముఖమున రాజ్యమును సంపాదింపగల్గెను. అతని చరితమద్భుతమైనది. అంధ్రులచరితయం దాతనికి సాటి యింకొకడు కానరాడు.

ఆహవమల్ల యిమ్మడితైలపదేవ చోళత్రినేత్రులు మిత్రులయి, ఒండొరులకు సహాయము జేసికొనుచుండి

నట్లు ఊహింపవచ్చును. వారియన్యోన్యమైత్రి యుభయులను మరింతబలవంతులను జేసెను. వారిరువురును అటు చోళ రాజరాజునకును, ఇటు శక్తివర్మకును సమానవిరోధు లయిరి. రాజరాజు ఒకప్పుడు పెద్దసైన్యమిచ్చి రాజరాజను దండనాథుని చోళ త్రిణేత్రుని మీఁదికి బంపెను. దానికి కారణముగాని, ఆవశ్యకతగాని తెలియరాదు. జటాచోడభీముడు చోళ సైన్యమునోడించి, దండనాయక రాజరాజును ద్వంద్వయుద్ధమున గదతోఁ గొట్టిజంపెను. అంతకు బూర్వమో లేక తరువాతనో రాజరాజచక్రవర్తి నొళంబవాడి, గంగవాడి రాజ్యములమీఁదికి దండయాత్ర జేయుటయు, రొద్దంయుద్ధమున రాజరాజు పరాజితుడగుటయు సంభవించెను.

ముందు ఇమ్మడి తైలపదేవుఁడు మరణించెను. అంతట జటాచోడభీము డొంటరివాడగుట సంభవించెను. అయిననాతఁడు ప్రచండప్రతాపుఁడు, కాని వృద్ధుడయినాఁడు; నిరంతర సంగ్రామకార్యములవలన, జీవితమంతయు సంక్షోభములలో గడచిపోయినను, మహోచ్ఛస్థితియం దున్నాడతడు. ఆతడింకను సమరైకవీరుఁడు, కార్ముకరాముడు, రణరంగరాక్షసుఁడు, ప్రవర్తనమహాహవుఁడు. ఇమ్మడి తైలపుఁడుమరణించిన పిమ్మట, రాజరాజు గంగవాడిమీఁదికి దండయాత్రచేసినట్లు గన్పట్టును. అది శ. ౯౨౦ (= ౯౯౮) ప్రాంతమునజరిగి యుండును. ఇఱివబెడంగ సత్యాశ్రయునికి సహాయముగా జటాచోడభీముడు కర్ణాటదేశమునకు ప్రయాణమయ్యెను. అది మంచితరుణముగా తలచి శక్తివర్మ వేంగీమహీమహారాజ్యమును జయించుటకు మహోద్యోగియయ్యెను. జటాచోడ

భీముని పరోక్షమున వేంగిని జయింపదలచెను. ఆతనికి సహాయముగా, చోళరాజరాజు, యొక్క పెద్దసైన్యమును ఆంధ్రదేశముమీదికి బంపెను. దానికి సేనాపతి అరియం రాజరాజం అను మాండలికుని దండనాథుని జేసి బంపెను. అరియం రాజరాజం అను నాతనికి విక్రమచోళుడనియు, చోడియవరియను అనియు బిరుదములు. అతడు జయంగొండ మండలములోని తిరుమూరునాడుకు చెందిన శాత్తమంగలం మహాగ్రామమున కధ్యక్షుడు. సామంతకేసరి యతడు, రాజరాజు ఒకప్పుడు తానంపిన దండనాయక రాజరాజును తన పేరుగలవానిని గదాయుద్ధమున 'దండ'ముతో జంపినాడను కోపకారణమున ప్రతిక్రియార్థియై, జటాచోడ భీమునిమీదికి సేనాపతి అరియం రాజరాజం చోడియవరియను యగు విక్రమ చోళుని విశేషసైన్య మిచ్చి పంపెను[†]. సేనాపతి విక్రమ చోళ చోడియవరియను, తనమీదికి వచ్చుచున్నాడను వార్త వినినంతనే, జటాచోడభీముడు కర్ణాటదేశమునకు పయనమై కొంతదవ్వఱిగినవాడు, వేంగికి తక్షణము మఱలి వచ్చెను. అంతట శక్తివర్మకును జటాచోడభీమునకు నతి దారుణమైన పోరు సంఘటిల్లెను. ఆనాటి సంగ్రామము నందు జటాచోడభీము డోడిపోయెను. శక్తివర్మ రాఘవునివలె విక్రమించి, రావణ ప్రతినిధి యని పేరొందిన యా చోళత్రినేత్రుని జంపెను. అంతటితో తనివిజెందక జటాచోడభీముని బంధు

† దండేన భీమేన యుధిప్రవీణో యద్రాజరాజో నిహతో మదాఖ్యః
తద్భీమనామాన మరంధ్రమంధ్రం హన్మీతి దండేన జఘాన సః॥
రాజేంద్రచోళుని తిరువాలంగాడు తామ్రశాసనము.

మిత్రాదులను కులమువారలను పుత్రులను ఎల్లరిని జంపి, కూకటివేళ్ళతోగూడ మహావృక్షమును పడగొట్టినట్లు, నాతని వంశము నున్మూలించెను. అంతట చాళుక్యనారాయణుడని రెండవపేరును ధరించెను. ఆ చాళుక్యచంద్రుని యాస్థాన విద్వత్కవి యొక డాతని శౌర్య సాహసకృత్యముల నద్భుతముగా కావ్యరూపమున వర్ణించెను. "బలమైన మూలస్కంధములతో నెత్తుగా పెరిగి, అంతస్సారముగలిగి యింకను ఎదుగుచు విశాలముగా విస్తరించుచు, శాఖోపశాఖలతో విజృంభించుచు, మహావృక్షమువలెనున్న జటాచోడభీముని, సకల రాజన్యలోకముచేతను, అరినృపతుల చేతను మ్రొక్కులందుచు బలవంతుడై, రణకేళీదర్పితుడై యున్న రావణ సన్నిభుని, వంశాంకురమైన లేకుండ, ఆమూలము శక్తివర్మ సంహరించెను." పిమ్మట చోళసైన్య సహితుడై కళింగముమీదికిబోయి, జటాచోడుని ప్రతినిధిని గూల్చి, యా రాజ్యమును మరల గంగభూపతికి, అనియంకభీమాపరనామ్నుడగు ఇమ్మడివజ్రహస్తునికి వశముజేసి పూర్వపు మైత్రిని ప్రతిష్ఠించెను. ఆ వృత్తాంతములన్నియు శ. ౯౨౧ (౯౯౯-౧౦౦౦) కు సరియైన వికారి సంవత్సరమున జరిగినట్లు కన్పించును. చోళశాసనములందు రాజరాజు సైన్యములనంపి వేంగీ కళింగములను జయించెనని కీర్తి మాత్రాకరములయిన వాక్యములనుబట్టియు, తరువాత తనకుమార్తె కుందవాంబాదేవిని విమలాదిత్యునికిచ్చి యుద్వాహ మొనరించుటయు మొదలయిన వృత్తాంతములను బురస్కరించుకొని చరిత్రకారులు కొందరు విపరీతపు టూహలను దీసి, వేంగీరాజ్యమును

జయించి, శక్తివర్మను సింహాసనస్థునిజేసెనని యసంగతపు టూహలను, నిరాధారములైనను సిద్ధాంతములుగా వ్రాసి పెట్టిరి. చోళాభిమానముతోపాటు, ఆంధ్రులన్న దురభిమానమును, మాత్సర్యమును గలిగి, శక్తివర్మ శౌర్యకృత్యములను వర్ణించు వేంగీచాలుక్య శాసన కావ్యములను క్రీగంటనైన జూడక విపరీతపు వ్రాతలను వ్రాసిరి. జటాచోడుని తనచేతులతో జంపి వేంగీమహీరాజ్యమును జయించి గ్రహించితినని శక్తివర్మ,చోళుని మాటయైన తడవక,సంశయమునకు తావొసంగని వాక్యములందు ప్రకటించినాడు.శక్తివర్మకు చోళరాజరాజు సహాయముచేసెననుమాట నిక్కము. కాని ఇరువదియేడేండ్లుగా, కడగండ్ల పాలయి, ఎడతెగక ప్రయత్నించి, పరాజయము వెంట పరాజయము వెన్నంటివచ్చినను ధైర్యమును, గాంభీర్యమును, స్థైర్యమును విడనాడక, దీక్షతో పైతృకరాజ్యమును జయించికొన్న మేటి ప్రతాపుడు శక్తివర్మ. అత డనాయకమైయున్న వేంగీ రాజ్యలక్ష్మిని గ్రహించి చాళుక్యనారాయణుడయ్యెను. అరాజకమైయుండి శత్రువుల యాక్రమణవలన వాటిల్లిన అంధకారమును తన శౌర్య శక్తిచేత తొలగద్రోచి అరాజకమును బాపిన చాలుక్యచంద్రు డాతడు. దురభిమాన తమసాంధకారమున సత్యమును చూడజాలని అయ్యలు కొందరు వ్రాసినరీతి సత్యమే యయినచో, వేంగిని జయించిన రాజరాజు, ఆ రాజ్యమును అల్లుడు విమలాదిత్యుని కొసగి యాతని వేంగీశ్వరునిజేయక, శక్తివర్మ వేంగీశ్వరుడగుట కెట్లు సమ్మతించెనో తెలుపజాలరైరి. అదియునుగాక,

రాజరాజెక్కడ నెన్ని ప్రగల్భములు వ్రాయించుకొనినను, తాను వేంగీచాళుక్య రాజ్యస్థాతయని ప్రకటించుకొనలేదు.

శక్తివర్మ వేంగీమహీ మహారాజ్యమును తన బాహువీర్యప్రతాపముల సహాయ్యమున జయించుకొనెను. అతడు శక్తిత్రయ సంపన్నుడు. వేంగీశ్వరుడు మిత్రుడగుటవలన ఆహవమల్ల ఇమ్మడి తైలపుడు చోళ రాజరాజు దండయాత్రలను గంగవాడియందు సాగనీయలేదు. వేంగీశ్వరుడు తన కాప్తమిత్రుడై యున్నచో, కర్ణాటభూపతి నిస్సహాయుడగుట సంభవించును. అప్పుడు గంగవాడి నొలంబవాడి రాజ్యములనేగాక, రట్టపాడినిగూడ జయింపవచ్చును. కావున వేంగీశ్వరునితోడి మైత్రియు, చుట్టరికము నత్యంతాదరణీయములని భావించి, చోళరాజు, శక్తివర్మ తమ్మునికి, యువరాజ విమలాదిత్యునికి తన కూతునిచ్చి బంధుత్వమును గలుపుకొనెను. వేంగీచాళుక్యులతోడి బాంధవ్యము, రాజరాజు తలచినరీతి చోళరాజ్యాభివృద్ధికి హేతువయ్యెను. ఇమ్మడి తైలపదేవుని రాజనీతి యాతని యనంతరము సాగిరాలేదు. దానిని ప్రయోగించి చతురుడైన రాజరాజు చోళమహాసామ్రాజ్యము నిర్మించెను.

వేంగీమహీ సామ్రాజ్యమునకు చాళుక్యచంద్రుడు సర్వలోకాశ్రయ శ్రీవిష్ణువర్ధన మహారాజాధిరాజ యను అభిషేకనామముతో రాజపరమేశ్వరాది పారమేష్ఠి సూచకములయిన బిరుదులతో, పట్టాభిషిక్తుడయ్యెను. పిమ్మట తనకు తోడునీడయై, బాసటయై నిలచి తనకాజ్ఞానువర్తియై మెలగిన, తమ్మునికి, విమలాదిత్యునికి, యౌవరాజ్యమును గట్టి

యుండెను. విమలాదిత్య కుందవాంబల యుద్వాహము యౌవరాజ్యాభిషేకానంతరము, శ. ౯౨౪ కు సరియైన (౧౦౦౨-౦౩) శుభకృతు సంవత్సర ప్రారంభమున జరిగియుండును. శక్తివర్మ రాజ్యాభిషిక్తుడయినతరువాత దేశమున మరల శాంతిభద్రతలు ఏర్పడియెను. రాజచాళుక్యవంశము వేంగీభద్ర సింహాసనముపై మరల సుప్రతిష్ఠిత మయ్యెననుటకు శక్తివర్మ తనపేరట చాళుక్యచంద్రుడన్న సార్థకనామముతో వరాహలాంఛనముగల సువర్ణగద్యానములను ముద్రించెను. వరాహలాంఛనము గలవగుటచేత గద్యానములకు వరాహములన్న (వరహాలు) పేరు గల్గెను.

వేంగీశ్వరునితోడి మైత్రియు, బంధుత్వమును స్థిరపడిన పిమ్మట శక్తివర్మ యండజూచుకొని రాజరాజు నిర్భీతుడయి, నిశ్శంకతో కుమారుని రాజేంద్రచోళుని వెంటనిడుకొని గంగవాడిమీదికి పలుతడవలు దండయాత్ర జేసెను. గంగవాడిపై దండయాత్ర శ. ౯౨౫ (౧౦౦౩-౦౪) సంవత్సరమునుండి సాగెను. పశ్చిమగంగ వంశమును నిర్మూలనముగావించి, గంగవాడిని చోళరాజ్యమున గలుపుకొనునంతవఱకు రాజేంద్రచోళుడు విశ్రమింపలేదు. గంగవంశాంకురమైన లేకుండ జేసి, గంగవాడిని జయించి, రాజేంద్రచోళుడు గంగయికొండడని బిరుదమును దాల్చెను. మరియు దుస్సాధనాధికమైన గంగవాడి విజయమును బ్రకటించుకొఱకు గంగయిచోళపురమని యొక మహానగరము నిర్మించి, దానిని తనకు రాజధానిని జేసికొనెను. గంగవాడిని జయించి, చోళభూపతి గంగరాజ్యశ్రియమును గొల్లగొట్టి చోళదేశమునకు గొంపోయెను.

అంతట శ. ౯౨౬ (౧౦౦౪-౦౫) నకు సరియైన క్రోధిసంవత్సరమున ఉత్తరార్ధమున కొంతకాలము సత్యాశ్రయున కించుక విరామము కలిగెను. గంగవాడిని సంరక్షించుకొనజాలకపోయినదానికి చింతింపక, వేంగీశ్వరుని శిక్షించిన, నది చోళభూపతికి ప్రతిక్రియ కాగలదను బుద్ధితో, సత్యాశ్రయుడు వేంగిమీాదికి యుద్ధసన్నద్ధుడై వెడలెను. చోళభూపతి గంగవాడిని జయించి ఆక్రమించుకొనుచుండినవేళ, సత్యాశ్రయుని బలహీనునిజేయుటకు తూర్పుదిక్కునుండి శక్తివర్మ కర్ణాటరాజ్యముమీాదికి వచ్చి యొత్తిడి కలిగించియుండును. అది కారణముగా సత్యాశ్రయుడు శక్తివర్మకు క్లేశము కలిగించుటకు శ్రీశైలమువఱకు వచ్చెను. పిమ్మట శక్తివర్మతో పోరునకు తలపడియెనో లేదో ఎఱుగము. ఏమయిననేమి, సత్యాశ్రయు డేమియు సాధింపజాలక విగతధైర్యుడయి కర్ణాటభూమికి మరలిపోయెను. శ్రీశైలముననున్నవేళ, విజయార్థియై కాబోలు సత్యాశ్రయుడు, పుష్యబహుళ అమావాస్య నాడు సూర్యగ్రహణ నిమిత్తమున తన రాజ్యములో నొక మూల, యాలిసిరూరు గ్రామమున, నున్న మూలస్థాన మహాదేవరగుడికి కొంత భూమిని దానము చేసెను. ఆ సూర్యగ్రహణము ౧౦౦౫ సంవత్సరము జనవరి ౧౩ తేదినాడు పట్టెను.

శక్తివర్మతో పోరునకు దలపడి యోడియో, తలపడకయో, సత్యాశ్రయుడు శ్రీశైలమునుండి వడివడిగ శ. ౯౨౭ సంవత్సరారంభమున (మార్చి, ౧౦౦౫) కర్ణాటభూమికి తరలిపోయెను. సత్యాశ్రయు డంధ్రదేశపు సరిహద్దు లందు

మలయుచుండినవేళ రాజరాజ, రాజేంద్రచోళదేవులు రట్ట పాడిమీఁదికి మరల దండెత్తివచ్చిరి. గంగవాడిని దాటి క్రమముగా దుర్భేద్యమైన బనవాసిరాజ్యమును బ్రవేశించిరి. రాజధానియగు బనవాసిదుర్గమును ముట్టడించిరి. బనవాసికి వనవాసమనియు వైజయంతీపురమనియు గూడ బ్రతినామము లుండెను. అది కదంబ సామంత రాజన్యులకు రాజధాని; మైసూరుకుత్తర దిశయందు, ఉత్తర కనరా జిల్లా దక్షిణమందున్నది. బనవాసి కొకప్రక్క హంస నదియు, నింకొక ప్రక్కదుర్గ ప్రాకారముల నొరసికొనుచు వరదా నదియు బ్రవహించుచుండును. హంసనది వరద కుపనది. ఆ రెండు నదుల మధ్య దుర్భేద్యమయి వరలియుండె నొకనాడు బనవాసి దుర్గము. రాజరాజ, రాజేంద్రచోళు దేవులు వనవాసిని సాధించి, యచటికి తూర్పుగా నుండి, 'దక్షిణ కవాట'మని ప్రసిద్ధికెక్కిన కొల్లిపాకను ముట్టడించి, కాల్చిరి. పిమ్మట తత్సమీపమున నున్న మన్నెదుర్గము ముట్టడించి గైకొనిరి. ఆ విధముగా బనవాసి ముప్పది రెండువేల రాజ్యము నాక్రమించి, తుంగభద్రను దాటి రట్టపాడిని బ్రవేశించిరి. చోళసైన్యములు రట్టపాడిని జొచ్చి, దేశమును కొల్లగొట్టుచు, గ్రామములను భస్మీపటలము గావించెను. చోళసైన్యములు ఉత్తరాభిముఖమై సాగి పోవుచుండ వాటి నెదుర్కొనుటకు సత్యాశ్రయుడు శ్రీశైలమునుండి యతి వేగమున వచ్చెను. రాజరాజ, రాజేంద్రచోళుల దండయాత్ర వరుసగా రెండేండ్లు సాగెను. రట్టపాడి కడగండ్లపాలయ్యెను. కర్ణాట దేశ ప్రజలు తీవ్రమైన సంక్షోభము నొంది భయ

భ్రాంతులైరి. చోళసైన్యములు నీతిని ధర్మమును పరిత్యజించి స్త్రీవధ, బాల, బ్రాహ్మణవధలను నిర్దయులై జరిపిరి. వర్ణ సాంకర్యమును గల్గించిరి. చోళసైన్యములను ఎదుర్కొని యోడించుటకు సత్యాశ్రయుడు సేనల నాయత్తపఱచుకొని యుద్ధమునకు సిద్ధమయ్యెను. సత్యాశ్రయుడు యుద్ధసన్నద్ధుడై వచ్చుచున్నాడని విని రాజరాజ, రాజేంద్రచోళులు రట్టపాడి యందు ముందుకు సాగుట మాని వెనుకకు మరలిరి. మర లుచు, దోనవూరువద్ద నవలక్ష సైన్యముతో విడిసి దేశమును కొల్లగొట్టుట ప్రారంభించిరి. అంతట సత్యాశ్రయునికి చోళ భూపతికిని తావరఘాటీవద్దఘోరసంగ్రామ మయ్యెను. రాజరాజు సంపూర్ణముగ నోడి రణరంగమును విడిచి స్వదేశ మునకు త్రోవ బట్టెను. సత్యాశ్రయు డంతట చోళభూపతి కొల్లగొట్టుకొనివచ్చిన సకల వస్తువాహనచయము నపహ రించెను. తావరఘాటీ యుద్ధము శ. ౯౨౯ కు సరియైన ప్లవంగ సంవత్సరమున (౧౦౦౭) జరిగెనని హొత్తూరు శాస నము దెలుపుచున్నది.

రాజరాజ, రాజేంద్రచోళదేవులు రట్టపాడియందు వీరవిహారము సలుపుచుండినవేళ, వారి సహాయార్థము శక్తి వర్మయో, యువరాజ విమలాదిత్యుడో వచ్చియుందురు. చోళులకు వేంగీశ్వరుని సహాయము పూర్తిగా కలుగకుండ జేయు తలంపుతో సత్యాశ్రయుడు వేంగిమీద దాడిచేయను, బయలునంబియను బ్రాహ్మణ చమూపతిని బంపెను. బయలు నంబి ఆహవమల్లదేవ శ్రీపాద పద్మారాధక, పరమణ్డల సాధక, విప్రవంశాలంకార, సత్తిగ నంకకాఱ, కొంకణ

భయంకర, సామంత వజ్రపంజర, నిజ భుజ పరాక్రమ నిర్జిత ప్రతిమల్ల, వాజికుళ క్రమళభాను రే త్యాది బిరుదములు గలవాడు. అతడు కృష్ణ దాటివచ్చి, కమ్మరాష్ట్రమును ప్రవేశించి. దన్నడ, ఎన్మందల (యనమదల) దుర్గములను రెంటిని గాల్చెను. బయలునంబి ఆంధ్ర దేశముమీద జరిపిన జైత్రయాత్ర శ. ౯౨౪ (౧౦౦౨) కు సరియైన పరాభవ సంవత్సరమున జరిగెను. చేంబ్రోలుచెంతనో, మరి యెచ్చటనో బయలునంబి పూర్తిగా నోడింపబడినా డనుట నిస్సందేహము. కర్ణాటచమూపతి సలిపిన జైత్ర యాత్రయందు వేంగీశ్వరున కానాడు బ్రాహ్మణదండనాయకులు పెక్కండ్రు సహాయులై వచ్చి యఖండ విజయమును సమకూర్చిరి. శక్తివర్మయట్టి స్వామిభక్తి పరాయణులయిన విప్రముఖ్యులను బ్రాహ్మణ దండనాథులను, అగ్రహారములు, మాన్యములు నిచ్చి బహూకరించి సంతోషపెట్టెను. అతని బ్రాహ్మణ చమూపతులలో నొకడు వెన్నయశర్మ. చాళుక్యచంద్రుని కనేక పర్యాయము లాహవరంగమున విజయలక్ష్మిని కైవసము చేసిన దా విప్రకులాలంకారుని విక్రమ శౌర్యాన్వితము లైన ఖడ్గ కార్యములు. గోదావరికి తూర్పుననున్న కూట (నేటి కోట) గ్రామమునకు గ్రామణియును, హారీత గోత్రుడు నగు పిణ్ణయ భట్టారకుడు, మరియొక బ్రాహ్మణ చమూపతి. పరితుష్టుడైన చాళుక్యనారాయణునివలన నతడు పెన్నేరు (నేటి పెనికేరు) మొదలయిన నాలుగు గ్రామములను మాన్యముగా బడసెను. అతడు గరుత్మంతుని వంటిబల పరాక్రమములు గలవాడు. తన పరిశ్రమచేత భీమ

రాదిత్య నృపాలునివలన (ఇతడెవ్వరో తెలియదు) నృప చిహ్నములను పారితోషికముగా బడసినాడు. 'చాళుక్య వంశవర్ధన రక్షణహేతువై' జన్మించిన ద్విజశ్రేష్ఠు డతడు. సత్యశీలుడు, మన్వాచారుడు, ధార్మికుడు, కలాభిజ్ఞుడు, స్వామి భక్తిపరాయణుడు, డతడని విద్వద్బృందములచేత స్తుతింప దగిన గుణము లనేకములు గలవా డాతడు. పిణ్ణాయ భట్టారకుడు 'చాళుక్య వంశవర్ధన రక్షణ హేతుభూతు' డనుటవలన ఆదికాలమునాడు ముడివేము గ్రామాగ్రహారికుడైన విష్ణుభట్ట సోమయాజివలె, దానార్ణవుని మరణానంతరము విహ్వలురైయుండిన రాజచాళుక్య వంశాంకురములగు శక్తివర్మ విమలాదిత్యులను, అపాయ స్థితినుండి తప్పించి, రక్షించి, పెంచి, పెద్దవారిని జేసినవాడని యూహింపవచ్చును.

# చతుర ప్రకరణము

శక్తివర్మ యనంతర మాతని సోదరుడు వేంగీమహీ సామ్రాజ్యమునకు బట్టముగట్టుకొనెను. మరియు, కోరుమిల్లి శాసనమున చేతనభట్టు తెలిపినరీతి, "శత్రువులను చీకటిని ధ్వంసముచేయుటకు సప్తాశ్వతేజుడయిన రాజమార్తాండ భూపుడు, సకలవర్ణ సుమతీ భృన్మస్త కన్యస్త పాదుడై, వేంగిసామ్రాజ్య రక్షణభారమును వహించెను. వహించి యేడేండ్లు రాజ్యమేలెను. నన్నియభట్టుకూడ భారతావ తారికయందును. నందమపూండి శాసనమందును, విమలా దిత్యుని భీమప్రతాపుడనియు ధీరుడనియు బిరుదాంక భీము డనియు మొదలయిన విశేషణములతో స్తుతించి, 'మహోత్సా హముతో మహనీయ తేజముతో మహీమండల సామ్రాజ్య ప్రాజ్యలక్ష్మిని ముదముతో జయించి పరిగ్రహించి, మహి మాధ్యుడై ఏడు సంవత్సరములు పాలించినాడ'ని తెలిపి యున్నాడు. విమలాదిత్యుని శత్రువులు దాయాదులుగాని యన్యులుగారు. దాయాదవిరోధనృపులతో బోరాడుచు శక్తి వర్మ వీరస్వర్గమునొందెను. తదనంతర మన్న మరణమునకు గారకులైన విరోధులను వారికి తోడ్పడవచ్చిన దుర్మతి ద్రోహి మాండలికులను విమలాదిత్యుడు యుద్ధములందు సంహారించెను. ఆనాడు ముమ్మడి భీమునకు కళింగభూపతి కూడ విరోధియై వర్తించియుండును. ఈవిషయము నింతకు ముందొకసారి సూచించితిమి. శక్తివర్మ మరణానంతరము చేతులనుండి జారిపోవుచుండినట్లుండిన వేంగిసామ్రాజ్యమును విమలాదిత్యుడు స్వబాహుబలమున జయించుకొనెను.

ఆకాలపు యదార్థచరిత్రను పరిశీలింపజాలని కొంద ఱయ్యలు శక్తివర్మ విమలాదిత్యులగూర్చి నిరాధారము లయిన కథలనుకల్పించి, 'చరిత్ర'యని వ్రాసిరి. వారి సాహస మెంతయు శోచనీయము. "దానార్ణవుని కుమారులు, శక్తి వర్మ విమలాదిత్యులు వేంగీసామ్రాజ్యమును జటాచోడభీము డాక్రమించుకొన్న పిదప దేశమును త్యజించిపారిపోయిరి!" "ఈ యంధ్రసోదరులు చోళరాజు నాశ్రయించినట్లు తెలియు చున్నది." "రాజరాజు వేంగిని జయించి, శక్తివర్మను వేంగీ సింహాసనముపై గూర్చుండబెట్టెను." "శక్తివర్మను వేంగీశుని జేసి యాతనితమ్మునికి తనకూతురు కుందవాంబనచ్చి పెండ్లి చేసెను. శక్తివర్మ, విమలాదిత్యులు రాజరాజ, రాజేంద్ర చోళదేవులకు సామంతులైరి." "వేంగీరాజ్యమును శక్తివర్మ క్రీ. శ. ౧౦౧౧ వఱకు పాలించెను. అతడు గతించిన వెనుక నాతని సోదరుడు విమలాదిత్యుడు రాజాయెను. కాని ఏకార ణముచేతనో వెంటనే పట్టాభిషిక్తుడు గాక కొంతకాలము చోళదేశమున మామగారి యింట తిరువయ్యారులోనే యుండెను. ఆతని శాసన మొకటి క్రీ. శ. ౧౦౧౪ నాటిది తిరువయ్యారులో గలదు. ఈకాలమున కర్ణాటకులు వేంగీ దేశము నాక్రమించుకొని రనుటకు ప్రబల నిదర్శనములు గలవు. క్రీ. శ. ౧౦౧౫ లో రాజేంద్రచోళుడు వేంగిమీదుగా కర్ణాటకముపై దండెత్తివచ్చి, జయసింహుని జయించి మరల వేంగియందు విమలాదిత్యుని బ్రతిష్ఠించెను. విమలాదిత్యుడు క్రీ. శ. ౧౦౧౮ వఱకు వేంగిని పాలించి చనిపోయెను" అని యీ విధముగా, చరిత్ర పరిశోధనాశాస్త్రపద్ధతులను విడిచి,

దురభిమానమును తోడుచేసికొని, అపూర్వకల్పనా విశేషా వహ వృత్తములను సమగూర్చి "చరిత్ర" వ్రాసిరి. వారి వ్రాతలు చదువను జుగుప్సాకరములు! అసంగతములైన వారి వ్రాతలను విమర్శింపబూనుట వృథాయాసకరము. ఆవిధములైన వ్రాతలు నిరాధారములు. క్రీ. శ. ౧౦౧౫ (శ. ౯౩౭) సంవత్సరమున రాజేంద్రచోళుడు వేంగిమీదుగా కర్ణాటకముమీదికి దండెత్తిపోలేదు. కర్ణాటకులు వేంగీ దేశము నాక్రమించుకొనను లేదు. విమలాదిత్యుని రాజేంద్ర చోళుడు వేంగిసింహాసనముపై ప్రతిష్ఠింపను లేదు.

విమలాదిత్యుడు సింహాసనమధిష్ఠించునాటికి దక్షిణా పథ రాజ్యముల పరిస్థితు లింతకుముం దొకసారి కొంతవఱకు తెలుపబడినవి. ఆనాటి వేంగి సామ్రాజ్య పరిస్థితు లవగాహ నము చేసికొనుటకు దక్షిణాపథ రాజవంశముల చరిత్ర సంపూ ర్ణముగ దెలిసికొను టావశ్యకము. ఇమ్మడి తైలవునకు చేది దేశాధీశ్వరులయిన కలచుర్యు లాప్తబంధువులు. కలచుర్యు లకు రాజధాని త్రిపురి. కలచుర్యులకు హైహయులనిగూడ వ్యవహారము గలదు. కలచుర్యుల చేదిరాజ్యము అంధ్ర భూమికి ఉత్తరమున నున్నది. ఇమ్మడి తైలపదేవుడు చేది దేశాధీశుడయిన లక్ష్మణ రాజ దేవుని మనుమడు. బొంథా దేవి తనూజుడు. కుంతలరాజ్యస్థాపనకార్యమందు చేది దేశా దేశాధీశుడు ఇమ్మడి తైలపునికి సాహాయ్యముచేసియుండును. తైలపుడును అతని మేనమామ ఇమ్మడి యువరాజ దేవుడు నించుమించుగా నేకకాలమున రాజ్యాభిషిక్తులయిరి. కల చుర్యులు కర్ణాటచాళుక్యులకు బంధువులగుటవలన, మాలవా

ధీశుడయిన వాక్పతి ముంజరాజుకు శత్రువులయిరి. ఇమ్మడి యువరాజదేవుడు వాక్పతిముంజరాజుచే పెక్కుతడవులు ఓడింపబడియెను. ఆకారణమున వాక్పతి ముంజరాజుకు, నాతని యనంతరము సింహాసనమెక్కిన సింధురాజ, భోజనృపతులకు కలచుర్యులతోడ విరోధమును, వేంగీశ్వరుల మైత్రియు నేర్పడి యభివృద్ధినొందెను. అట్టి మైత్రి విరోధములు కారణములుగా పరమార వేంగీచాళుక్యులును, కర్ణాట చేదీశ్వరులును, ఒండొరులకు యుద్ధములందు పరస్పర సహాయము చేసికొనుచుండి నట్లూహింపవచ్చును.

కొంకణ గూర్జర సౌరాష్ట్రదేశము లానాడు నిరంతర సంగ్రామరంగములై యుండెను. కొంకణము కర్ణాటచాళుక్య సామ్రాజ్యమున జేరియుండెను. గూర్జరము, నేటి కథియవాడ మండలములోని మధ్యభాగ మగుచు, అన్హిల్వాడ చాళుక్య రాజ్యముగ నేర్పడియెను. మూలరాజను నాతడు చాళుక్య రాజ్యస్థాతయయ్యెను. స్వాతంత్రమునకై యాతడు తన దాయాదియు విరోధియునగు లాటదేశాధీశునితోడ తఱచుగా బోరుచుండెను. లాట చాళుక్యరాజన్యుడు కుంతలేశ్వరునికి సామంతుడు. మూలరాజు, వాక్పతి ముంజరాజు దుర్మరణము నొందిన తరువాత, సింధురాజు బలహీనతను యదనుగా గుర్తించి, స్వతంత్రుడయ్యెను. పరమారసింధురాజును, ఆతని యన్నవలె వేంగీశ్వరునకు మిత్రుడు. కర్ణాటభూపతి వేంగీశ్వరునికి విరోధియై, యాతని పదచ్యుతునిజేయుటకు దాయాదులను పురికొల్పి, స్వామిభక్తిపరాయణులను స్వామిద్రోహులుగజేసి, దండనాయకులను బంపి వేంగిపై దండయాత్రలు

సాగించుచుండ, వేంగీశ్వరుడు, అన్హిల్వాడ గుర్జరులను, కొంకణ దేశపు శకమాండలికులను పురికొల్పుచు నిరంతరము కుంతలేశ్వరునకు కష్టములు కలిగించుచుండెను. ఇంతకన్న నెక్కువ వివరముగ ఆనాటిపరిస్థితుల నెఱుగజాలము.

శక్తివర్మ మరణించునాటికి కర్ణాటరాజ్యమును త్రిభువనమల్ల బిరుదాంచితుడగు ఐదవ విక్రమాదిత్యుడు పాలించుచుండెను. ఉత్తరమున కొంకణమాండలికులు సౌరాష్ట్రచాళుక్యులు, పరమారభోజుడు, కుంతల రాజ్యమునకు అక్షేమంకరులై ప్రవర్తించుచుండిరి. విక్రమాదిత్యుని యనంతరము అయ్యణదేవుడు సింహాసనమెక్కెను. ఆ భూపతుల కాలమున కర్ణాటరాజ్యముపలువిధములఇడుములపాలయ్యెను. అయ్యణదేవుని యనంతరము దుర్మతిమాండలికులు, కుటిల సామంతులును కూడి జగదేకమల్ల జయసింహుని సింహాసన మధిష్ఠింపకుండను, పట్టాభిషేకానంతరము క్రూరమరణము వాత బడద్రోయుటకును, విశేషప్రయత్నములను పెక్కింటిని గావించిరి. కర్ణాటచాళుక్యుల యధికారము సన్నగిల్లెను. అంతట నొకనాడు రిపునృపతి ప్రేషితులై, సామంతులు, మండలేశ్వరులును, గలిసి స్వామిద్రోహులై, కొలువుదీఱిన వేళ సింహభూపతి శిరముపై, ఛత్రముపై, తెరవెనుకనుండి యొకపెద్దబండ రాతిని పడద్రోసి బలాత్కారముగ జంప†

---

† తెరెయిం కుంబువ ఛత్రమం భారద బిణ్గుణిక్కు బల్పిందె సం
వరిపంతు ర్వ్వనె సింహ భూపతిగె మాసామన్తరుం మండలే
శ్వరరుం తప్పి కళల్ద రాజ్య ధరమం కైకొణ్డు బల్పిం సము
ద్ధరిసిర్ద్దన్నలి కాళిదాస విభువింగక్కుం పెరంగక్కుమే.

త్రైలోక్యమల్లనినాటి వాగాయి శిలాశాసనము.

నుద్యోగించిరి. స్వామిద్రోహుల కుటిలతంత్రములను ముందుగా దెలిసికొని, చమూపతి కాళిదాసు సింహభూపతిని రక్షించెను. కాళిదాసవిభుడు వానస వంశ విప్రకులాలంకారుడు. వశిష్ఠ గోత్రుడు. నాగవాపి పురాధీశుడు. కుంతల రాజ్యలక్ష్మీలతావసంతుడని ప్రఖ్యాగన్నవాడు. మున్నొకసారి దెలిపినరీతి సింహభూపతియే జగదేకమల్ల జయసింహుడు. అతడు శ. ౯౩౬ కు సరియైన (౧౦౧౪) ఆనంద సంవత్సరారంభమున కుంతల రాజ్యమున కభిషిక్తుడయ్యెను. కుంతలేశ్వరునికి సన్నిహితుడైన గాంగేయదేవుడుగూడ నొకప్పుడు కర్ణాటభూపతిని తిరిగి పదస్థుని జేసితినని సగర్వముగ జెప్పుకొనెను. కుంతలేశ్వరుని సామంతనృప, మండలేశ్వరులను భంగపఱచితినని, యతడు 'కుంతలభంగ భంగిరసిక'యని తనపేరుకు బిరుదమును జేర్చుకొనెను. గాంగేయదేవునికి సమకాలికుడయిన కుంతలేశ్వరుడు జగదేకమల్ల జయసింహుడు. ఆవిధముగా జయసింహుని పదచ్యుతుని చేయుటకు విమలాదిత్యుడు ప్రయత్నములు గావించియుండును. అట్టి ప్రయత్నములందు విమలాదిత్యునికి ప్రగ్గడయైన వజ్రామాత్యుడు కార్యఖడ్గములతో ననేకవిధముల సహాయముచేసియుండును. రణస్థిపూండిశాసనమున భీమనభట్టు విమలాదిత్యుడు సింహభూపతిని భంగపఱచిన విధానమును మనోహరముగ వర్ణించినాడు. జగదేకమల్లుడు విపత్తునుండి తప్పించుకొనినపిమ్మట, విమలాదిత్యుని మీదికి, ప్రతిక్రియ జేయుతలంపుతో దండెత్తివచ్చియుండెను. ఆనాటి దుస్సాధనాధిక విరోధి గజేంద్రసంఘములతోడ యుద్ధము

శ. ౯౪౦ (జనవరి, ౧౦౧౯) సంవత్సరాంతమున జరిగి యుండును.

విమలాదిత్యునిమీద పగకు, జయసింహునకు కారణము లింకను గలవు. తన పెదతండ్రికి ప్రబల విరోధియైన చోళునకు అల్లుడు. తనకు శత్రువైన రాజేంద్రచోళుని కాప్త బంధువు. రాజేంద్రచోళుడు శ. ౯౩౮ (= ౧౦౧౬)వ సంవత్సర ప్రాంతమున, అతని నాల్గవ విజయరాజ్యవర్షమున, రట్టపాడిమీదకు దండయాత్ర వెడలెను. ఆనాటికి పది యేండ్లకు బూర్వము, రాజరాజు జీవించియున్నకాలమున గంగ వాడిని, నొళంబవాడిలోని దక్షిణ భాగమును జయించి, వ్యాఘ్రధ్వజము నచ్చట నెలకొల్పెను. ఈ దండయాత్రయందతడు రట్టపాడిని జయించి ఆక్రమించుకొనదలచెను. కుంతల రాజ్యమున కంతకును, తమిళచోళుల శాసనములందు రట్టపాడియని పేరు. రాజేంద్రచోళుడు ముందుగా నొళంబవాడి ముప్పది రెండువేల రాజ్యము నాక్రమించుకొనసాగెను. నొళంబవాడి ముప్పది రెండువేల సీమకు ఉచ్చంగిగిరి దుర్గము రాజధాని. దానికే ముశంగియని తమిళచోళుల శాసనములందు ప్రతినామము గాన్పించుచున్నది. తమిళులనోట ఉచ్చంగి ముశంగియగుట విశేషముగాదు. ఉచ్చంగి దుర్గమత్యంత దుస్సాధ్యమైనది. అది నేడు బల్లారి మండలమున హార్పనహల్లి తాలూకాయందు, దక్షిణమున పర్వతశ్రేణి కానుకొని యున్నది. ఉచ్చంగి దుర్గమును రాజేంద్రచోళుడు చిరకాలము ముట్టడించి చివరకు సాధించినట్లగపడును. జయసింహుడు రాజేంద్రచోళునిధాటి కాగజాలక, రణరంగమున

నిలువలేక ఉచ్చంగి దుర్గమును ప్రవేశించియుండును. రాజేంద్రచోళుని ముట్టడి అగ్నిజ్వాలవలె దహించుచుండ, కర్తవ్యమునుగానక, జయసింహు డుచ్చంగి గిరిదుర్గమును విడిచి, యాత్మరక్షణార్థమును, శత్రుసంహారణోపాయార్థమును పాఱిపోయెను. తత్పూర్వము రాజేంద్రచోళుడు జయసింహుని యుచ్చంగి దుర్గముచెంత నోడించి, కర్ణాటసేనలను నాశనమొనరించియుండెననిగూడ యూహింపవచ్చును. ఉచ్చంగి (ముశంగి) యుద్ధము శ. ౯౩౮ (ఫిబ్రవరి, ౧౦౧౭) సంవత్సరాంతమున జరిగియుండును. వెన్నిచ్చిపాఱిన జగదేకమల్లుని గంగయి కొండచోళుడు వెంట దఱిమెను. కాని కర్ణాటభూపతి విశేష బలములను గూర్చుకొని, సాహసముతో మరల రాజేంద్ర చోళునితో దారుణ రణక్రీడకు దలపడి యోడించెను. ఆ యుద్ధము, తుంగభద్రా దక్షిణ తటమున, ప్రాయశః కంపిలి నగర సమీపమున, శ.౯౩౯ యగు పింగళ సంవత్సరాంతమున (ఫిబ్రవరి ౧౦౧౮) జరిగినట్లూహింపవచ్చును†. ఆనాటి ఘోర పరాజయముతో, రాజేంద్రచోళుడు తల్లడమంది, "నయవేది"యై తక్షణమ నిజ రాజధానికి గంగయికొండ చోళపురమునకు మరలివచ్చెను. తిరువాలంగాడు శాసన కావ్యకర్త, ఉచితజ్ఞుడై, తన ప్రభువునకు వాటిల్లిన ఘోరాపజయమును విపత్తును అర్థగాంభీర్యముతో నిండిన మాటలలో చెప్పినాడు‡. రాజేంద్రచోళుని యోడించిన విజయోత్సా

† సౌ. ఇ. ఇ. సం. ౯ భాగము ౧. సె ౫౦.

‡ రట్ట రాజ్యమవిజిత్య స్వసైన్యం రాజరాజతనయో నయవేదీ।
ధైర్య శౌర్య విజయాద్యఖిలైః స్వైస్స్వవిలోగుణగణైః పురమాప॥

హామున, రణక్రీడకై కేరుచున్న సైన్యముతో, జయసిం
హుడు విమలాదిత్యునిపై పగదీర్చుకొనుటకు వేంగిమీదకు
బోయెను. కాని విమలాదిత్యుడు సింహభూపతిని పూర్తిగ
నోడించి వెన్నంటి తఱిమెను. ఆ యుద్ధము శ. ౯౪౦
(జనవరి, ౧౦౧౯) మాఘమాసమున జరిగియుండినట్లూహింప
వచ్చును. సరిగా, నావేళకు జయసింహుడు పరాజితుడై,
దూరదేశమందుండుటగాంచి, భోజనృపతి కొంకణముపై
దండెత్తివచ్చి విజయుడై మరలెను.

కావున విమలాదిత్యునికి మామ రాజరాజుగాని, బావ
రాజేంద్రచోళుడుగాని, సాహాయ్య మొనరించి, వేంగీ సింహా
సనముపై గూర్చుండబెట్టిరనుటకు ప్రమాణమేమియు గాన
రాదు. అట్టి వ్రాత కేవలము కల్పితమైన యూహ. చోళ
చక్రవర్తి ముమ్మడిచోళుని కాలమునాటినుండి యదార్థశౌర్య
కార్యములతోపాటు కేవలము కీర్తిమాత్రాకరములైన
వృత్తాంతములను గొన్నింటిని, వేంగీ కళింగములను
జయించినట్లు కొన్ని వీరకృత్యములను శుష్కదంభ
ప్రియులై, గొప్పకొఱకు తమ శాసనప్రశస్తులందు విసుగు
లేక, సమయాసమయములను జూడక, చరిత్రచరణముగా
వ్రాయించుకొనిరి. అట్లు ప్రతి శాసనమునందును, చోళ
భూపతియొక్క విజయరాజ్య వర్షముతోపాటు ఆ రాజేంద్రుని
ప్రశస్తి చెప్పుటాచారమయ్యెను. నిజమునకు లేని గొప్పలు
చెప్పుకొనుటలో చోళ భూపతు లగ్రగణ్యులు.

ముమ్మడి చోళుడు ఇంచుమించుగా ఇరువైతొమ్మిది
యేండ్లు రాజ్య మేలెను. మరణించుటకు రెండేండ్లకు బూర్వ

మాతడు రాజపరిత్యాగము గావించి, కుమారుని గంగయి కొండ చోళుని పట్టాభిషిక్తుని జేసెను. ఆ వృత్తాంతము శ. ౯3౮ వ సంవత్సరమున (౧౦౧౭ పూర్వార్ధమునందు) జరిగెను. అంతకుపూర్వమునుండి రాజరాజు, తన దేవేరులతో కూడి తన కాలమును దైవచింతనతో ధర్మ కార్యాచరణ ములతో గడుపసాగెను. ఆ కాలమున తానును తన రాణు లును అనేక శివాలయముల నచ్చటచ్చట ప్రతిష్ఠించిరి. దానములు చేసిరి. ముమ్మడి చోళుని పట్టమహిషి దంతి శక్తి విటంకి యను బిరుదుగల లోక మహాదేవులు తన పేరట లోక మహాదేవీశ్వరుడను పేరుతో తిరువైయ్యారు నందొక శివాలయమును బ్రతిష్ఠించెను. తిరువంజలి గ్రామమున ముమ్మడి చోళుడు కపర్దీశ్వర మహాదేవుని కోవిలయందు రమణీయమయిన ప్రాసాదమును కాలభైరవు నికి గట్టించెను. ఆ దేవాలయ ప్రతిష్ఠల సందర్భమున జరుగు మహోత్సవమును దిలకించుటకు విమలాదిత్యుని యగ్ర మహిషి కుందవాంబ యరిగెను. పిమ్మట మరుచటి సంవ త్సరమున శ. ౯33 నకు సరియైన విరోధికృతు సంవత్స రమున రాజరాజు తంజాపూరునందు వేంచేసియుండి తాను రాజరాజేశ్వర మహాదేవర గుడి చేసిన మహా దానము లన్నింటికిని కోవిల కరణములచేత లెక్కలు వ్రాయించు చుండెను. సరిగా నావేళకు విమలాదిత్యుడు రాజమహేంద్ర వరమున పట్టాభిషేక మహోత్సవమును జఱుపుకొనుచు వేంగీ రాజ్య సంరక్షణ కార్యమందు నిమగ్నుడై యుండెను. ముమ్మడి చోళుడు తాను, తన దేవులు, తన అక్క కుందవాంబ

మున్నగు వారలు చేసిన దాన ధర్మములకు సవిస్తరముగా తంజాపుర రాజరాజేశ్వర దేవాలయమునందు శిలలపై శాసనములు వ్రాయించుచుండెను. పిమ్మట, మరుచటి సంవత్సరమునందు, అనగా శ.౯౩౪ వ సంవత్సరమున (౧౦౧౨-౧౩) చోళమండలములోని శివాలయములను, జీర్ణస్థితియందున్నవాటిని ఉద్ధరించియుండెను. రాజేంద్ర చోళుడు రాజ్యభారము బూనియుండ రాజరాజు చోళ సామ్రాజ్య సంరక్షణమునకును, విస్తరించుటకును పునాదులు వేయుచు సన్నాహములు చేయుచుండెను. ఇట్లుండ నా మరుచటి యేడు, శ. ౯౩౫ వ (౧౦౧౩-౧౪) సంవత్సరమున, ముమ్మడి చోళుని యారోగ్యము చెడిపోయెను. అది యాతని ౨౯ వ విజయరాజ్య వర్షము. సంవత్సరాంతము లోపల యతడు దివంగతుడయ్యెను. ఆ రీతిగా ఆమరణాంతమతడు రాజరాజేశ్వరాది శివాలయములముల కిచ్చిన గ్రామములకు శతసహస్ర అఖండ దీపారాధనలకు వలసిన నేయి సరియించుట కొసగిన పశుగణములకు, సమర్పించిన మణిభూషణాదులకు,సువర్ణాభరణములకు లెక్కలు వ్రాయించుచునుండెను. ఏతత్పూర్వ మతడు తన యగ్రమహిషితో గూడి యనేక తులాపురుషదానముల జేసియుండెను. ఆ విధముగా ముమ్మడిచోళుని 'యవసానకాలము రెండు మూడేండ్లు గడచెను. అనంతర మొకటి రెండేండ్లవఱకు రాజేంద్రచోళుడు దక్షిణ దిగ్విజయ యాత్రలందు నిమగ్నుడై యుండెను.

ముమ్మడిచోళుడు మరణించుటకు కొంచెము బూర్వమో లేక, పిదపనో, విమలాదిత్యుడు చోళరాజధాని కరిగెను.

రాజ్యభ్రష్టుడై, మామను, బావను, దీనుడై యాశ్రయింప నాత డరిగియుండలేదు. ఆ నాటి తంజాపుర మహోత్సవములను వినోదముకొఱకు తిలకించుటకు బోయియుండెను. రాజరాజు మరణించుటకు బూర్వ మాతని దేవేరి లోక మహాదేవులు హిరణ్య గర్భ మహా సువర్ణ దానమును జేసెను. లోక మహాదేవులు కుందవాంబకు జనని. ఆ నాటి మహోత్సవ సందర్భమున విమలాదిత్యు డనేక దాన ధర్మములను జేసెను. అందొకటి మాత్రముమనకు తెలియవచ్చినది. తిరువైయ్యారున తన యత్తగారిచే ప్రతిష్ఠితమైన లోక మహాదేవీశ్వర మహాదేవునికి విమలాదిత్యుడు రజత పాత్రలను దానమిచ్చెను. వేంగీశ్వరుడు చోళరాజధాని కరిగిన కారణమును పరిశీలింపజాలక కొందఱయ్యలు ఊహా జవమున కల్పనాకథలను చరిత్ర క్రింద వ్రాసిరి. శ. ౯3౫ వ సంవత్సరమున (౧౦౧3-౧౪) గాని తత్పూర్వముగాని కర్ణాట భూపతి వేంగిపై దండెత్తి రాలేదు. ఆనాడు త్రిభువనమల్ల విక్రమాదిత్య, అయ్యణదేవుల దుస్థితి, వర్ణనాతీతమై యుండెను. ఒకవంక వారిపై భోజరాజు మిత్ర నరపతి సంఘాతమును గూర్చుకొని, బహుళ సేనాసమేతుడై కర్ణాట భూమిపై దండయాత్ర జేసెను. ఆ నరపతి సంఘాతమున విమలాదిత్యుడు గూడ నుండెనని మున్నొక సారి తెలిపితిమి. విక్రమాదిత్య, అయ్యణదేవులు వరుసగా భోజుని కోడి, మరణించిరి.. అట్టి దుష్కాలమున కర్ణాట భూపతు లంధ్రదేశము మీదికి వచ్చుటకు గాని, విమలాదిత్యుని దేశమునుండి వెడలనడచుటకుగాని, అవకాశము

లేదు. వేంగీ సామ్రాజ్యమునందు విశ్వాసపాత్రులయినవారు, స్వామి భక్తి పరాయణులయినవారు, సామంతులు రాజన్యులు, మాండలికులు, దండనాథులు, విమలాదిత్యుని సాహాయ్యము చేయఁగల వారెందఱుండరు! అట్టివారి సహాయ్యము నెల్ల పరిత్యజించి, యతఁడు విగత ధైర్యుఁడయి, దీనుని పగిది, మామను, బావను ఆశ్రయింపఁబోయెననుట అసంగతము. అది హాస్యాస్పదమైన యూహ. వీరమకర ధ్వజుఁడు, బిరుదంక భీముఁడు, రాజమార్తాండుఁడు, భూప మహేంద్రుఁడు, వీరుఁడు, అని బిరుదములు గల్గిన విమలాదిత్యునికి, రిపులను గెల్చి, వేంగి సామ్రాజ్య ప్రాజ్యలక్ష్మిని తన వశము జేసికొన్న వీరోగ్రాజి విజయునికి, చోళ భూపతి నాశ్రయింపవలసిన దుర్గతి పట్టలేదు. గంగవాడి, నొళంబవాడి, రట్టపాడి రాజ్యముల మీఁదకు దండయాత్రలు సాగింప దలచిన చోళ భూపతులకు, కుంతల చాళుక్యులకంటె నధిక బలవంతులైన వేంగీశ్వరుల సాహాయ్యమే తఱచుగా నవసరమగుటచేత, వేంగీశ్వరులవలన తమకెట్టి విపత్తును గలుగకుండుటకు, వేంగీశ్వరుల ప్రాపుగోరి, మూఁడు తరములు వరుసగా తమ యింటి యాఁడుబిడ్డలనిచ్చి వారి బంధుత్వముతో పాటు మైత్రిని నెఱపి, దానిని సుస్థిరము జేసికొనిరి. చివరకు చోళ మహా సామ్రాజ్యమున సంరక్షించుటకు సోమవంశ తిలకుఁడయిన వేంగీయువరాజే గతియయ్యెను.

విమలాదిత్యుఁడు వేంగీసామ్రాజ్యమును ఏడేండ్లు అద్వితీయ పరాక్రమ తేజములతో బరిపాలించెను. ఆ యేడు సంవత్సములును రాజేంద్రచోళుఁడు సర్వథా యుద్ధములలో

మునిగి తేలుచుండెను. మొదటి మూడు సంవత్సరములును పాండ్య, చేరభూపతులతోడి పోరాటముతో గడచిపోయెను. తరువాత మూడేండ్లు రట్టపాడి దండయాత్రతో గడచెను.

ఆ రట్టపాడి దండయాత్రయందు విశేష సంఘటన యేదో జరిగెను. రాజేంద్రచోళుడు తీవ్రమైన గాయములు తగిలి అంగవైకల్యము నొందియుండును. ఆ నాటి పరాజయాది వృత్తాంతములు గారణముగా, రాజేంద్రచోళుడు రాజ్యభారమునుదక్షుడయిన తన రెండవ కుమారునికి, రాజాధిరాజునకు బంచియిచ్చి, పట్టాభిషిక్తుని జేసెను. ఆ పట్టాభిషేకము శ. ౯౪౦ కుసరియైన కాలయుక్తి సంవత్సరారంభమున(ఏప్రిలు - మేయి ౧౦౧౮) జరిగియుండినట్లూహింపవచ్చును. అటు తరువాత రాజేంద్రచోళుడు మరల జయసింహుని మీదికి యుద్ధమునకు బోలేదు. అందులకు కారణము దురూహ్యము. నాటనోలె రాజేంద్రచోళుడు కుమారునితో గలిసి యేకస్థుడయి రాజ్యమును పాలించెను.

విమలాదిత్యుని కాల మొగయుగసంధి: అనేక కారణములను బట్టి చిరస్మరణీయమైనది. చిరకాలము నుండి వంశపరంపరగా వాడుకనోనుండిన చాళుక్య వంశోత్పత్తి కథనము, పౌరాణిక వంశగాథలు మొదలయినవియును రాజవంశప్రశస్తులందు, శాసనకావ్య కర్తలచే కూర్పబడుట తటస్థించెను. పదియవ శతాబ్దాంతరపు కడపటి పాతికేండ్ల లోపల దక్షిణాపథ రాజవంశముల చరిత్రయందు సంఘటిల్లిన వృత్తాంతముల ననేకములు దానికి గారణములు. కుంతల వేంగీ దేశములందు చాళుక్యరాజ్యములు మరల ప్రతిష్ఠింప బడి

మెను. మహోదగ్రు లయిన చోళ భూపతుల యభ్యుదయము ప్రారంభమయ్యెను. మాలవదేశమున పరమారులు సుస్థిర మైన రాజ్యము నేర్పరచుకొనిరి. అన్హిల్వాడ రాజధానిగా చాళుక్యరాజస్థాపనము జరిగెను. ఆ విధముగా పారమేష్ఠి త్వము ననుభవించిన ప్రసిద్ధ రాజవంశములు మాండలిక, సామంత రాజవంశములనేకము లుద్భవించెను. వారెల్లరు తమవంశ ప్రాశస్త్యముల నగ్గడించుకొనుటకై వంశకథలను వ్రాయించుకొనుచు, పౌరాణిక రాజవంశములనుండి యుద్భ వించితిమని తెలుపుకొన సాగిరి. ఆ కార్యము నొకరిజూచి నొకరు ప్రారంభించిరి, ఎవ్వరు ప్రారంభించిరో యెవ్వరు అనుకరించిరో తెలుపు టసాధ్యపు బని. విమలాదిత్యుడు చాళుక్యవంశకథను పౌరాణికగాథతో గ్రుచ్చెత్తి, తొలుత రణస్థిపూండి శాసనమున తనవంశ ప్రశస్తిని సంపూర్ణముగ వ్రాయించెను. ఆ ప్రశస్తితో, శాసనకావ్యమును రచించిన మహాకవి రాచియపెద్దేరి తనూజుడైన భీమనభట్టు. అతడు విమలాదిత్యుని యాస్థానకవి. రాజమహేంద్ర కవీంద్ర సమాజమున అగ్రస్థానము నలంకరించిన విద్వత్కవి. అతనికి దెలిసినట్లు రాజచాళుక్య వంశోత్పత్తికథలు, పౌరాణిక గాథలు నింకొరికి దెలియవు. రణస్థిపూండి శాసనము శ. ౯౪౧ సరియైన సిద్ధార్థి (జూలై ౧౦౧౯) సంవత్సరము నాటిది. చాళుక్యుల పౌరాణిక వంశకథలను బోలిన పౌరా ణిక వంశకథలను తంజాపురచోళులు గూడ వ్రాయించు కొనిరి. కాని వారి పౌరాణిక గాథలందు కన్పట్టు పూర్వుల పేర్లు, ఏ పురాణములందును గానరావు. వాటి నెక్కడి

నుండి చోళరాజాస్థానకవులు సంగ్రహించిరో తెలియదు. చాళుక్యుల పౌరాణిక వంశకథకంటె చోళులు తమ పౌరాణిక వంశకథ నెక్కువ ప్రశస్తతరమైన దానిని చేయు తలంపుతో గంగయికొండచోళవు రాస్థానకవులు అపూర్వములును అశ్రుతములనగు పేర్లను సృజించి విపరీత పౌరాణిక వంశ క్రమమును రచియించిరి. చోళుల పౌరాణిక వంశకథకంటె చాళుక్యుల వంశకథ అధిక ప్రాచీనతరమైనది. చోళుల పౌరాణిక వంశ చరిత్రనుజూచి చాళుక్యపౌరాణికవంశానుక్రమణికను విమలాదిత్యునకు క్రొత్తగా రచింప బనిలేదు. ప్రశస్తమైన పౌరాణిక వంశక్రమము గలవారనియే ముమ్మడిచోళుడు తనకంటె నధికుడయిన విమలాదిత్యునకు తనకూతు నిచ్చి, చాళుక్యులతో సంబంధమును గలుపుకొనెను.

ఒకవిధముగా చారిత్రాత్మకమయినట్లు కన్పించు చాళుక్యవంశోత్పత్తి కథ తొలుత త్రిభువనమల్లవిక్రమాదిత్యుని కౌఠేం తామ్రశాసనమందు గానవచ్చును. అదిరణస్థిపూండిశాసనముకంటె పదియేండ్లు ముందు పుట్టెను, అందీ విధముగానున్నది కథ : "చాళుక్యవంశమందు సమస్తభువనాశ్రయ, సర్వలోకాశ్రయ, విష్ణువర్ధన, విజయాదిత్యాది విశేష నామ్నులయిన రాజరత్నములు భూమిపై నుద్భవించిరి. ఆచాళుక్యవంశమందు ఏబదితొమ్మండ్రుగురుజన్మించి, అయోధ్యను పరిపాలించిరి. పిమ్మట పదునార్గురు దక్షిణాపథమున కేతెంచి రాజ్యముచేసిరి. అంతట కొన్నిపురుషాంతరముల కాలము చాళుక్యరాజ్యలక్ష్మికి అంతరాయము కలిగెను. పిమ్మట జయసింహుడవతరించి చాళుక్యరాజ్యలక్ష్మిని పున

రుద్ధరించెను.'' రణస్థిపూండిశాసనము వెలువడిన కాలము నాటి మైసూరులోని బలగామి శిలాశాసనమం దీ కథ ఇంచుక వ్యత్యస్తముగానున్నది. ఏబదితొమ్మండ్రుగురును, వారి వంశమునందు మరి కొందరును గతించిన వెనుక సత్యాశ్రయుడు జన్మించెననియు, నాతని పేర, బ్రహ్మనుండి యావిర్భవించిన చాళుక్యకులము సత్యాశ్రయకులమయ్యెననియు తెలుపబడెను. ఆవిధముగా అసంపూర్ణములును వ్యత్యస్తవిశేషములుపెక్కులు గల కథలనేకములు కర్ణాటదేశమున వ్యాప్తిలోనుండెను. కర్ణాట చాళుక్య రాజ్యశ్రీకి రాష్ట్రకూటుల కారణమున ఇన్నూటయేబది వంవత్సరముల కుంతలదేశమున అంతరాయముకల్గెను. ఆకారణమున కర్ణాటదేశపు చాళుక్యుల గాథలు అసంపూర్ణములు, అస్తవ్యస్తములునగుట సంభవించెను. ఆంధ్రదేశమున నట్లుగాదు. కుబ్జవిష్ణువర్ధనుని నాటి నుండి విమలాదిత్యుని కాలమువఱకు వేంగీచాళుక్య రాజ్యశ్రీయమున కంతరాయముకలుగలేదు. జటాచోడ భీముని యిరువదేడేండ్ల దురాక్రమణకాల మొకయంతరాయము గాదు. కావున వేంగీచాళుక్యవంశమున నిలచియున్న ఐతిహాసిక పౌరాణికగాథలు సంపూర్ణములైనవి. వాటినన్నింటిని విమలాదిత్యుని యనుమతిని భీమనభట్టు కావ్యరూపమున శాసన ప్రశస్తియందు జొనిపి స్థిరమొనరించినాడు. దక్షిణాపథమున నేలిన పదునార్గురి తరువాత గలిగిన యంతరాయమునకు కారణమును, విష్ణుభట్ట సోమయాజి, ముదివేము గ్రామముల వృత్తాంతమును కలిపి అస్తవ్యస్తముగానున్న ఐతిహాసికవంశ కథను సంస్కరించి చక్కదిద్దినాడు. చాళుక్యులు సోమవంశ

జులనుట చేత భారతకథకు ప్రధానులైన పాండవోత్తములతో సంబంధమును గూర్చినాడు.

విమలాదిత్యుని పట్టాభిషేకమునకును, రాజరాజ-విష్ణువర్థనుని పట్టాభిషేకమునకును నడుమ నించుమించుగా పదకొండు సంవత్సరములు గడచెను. విమలాదిత్యు డేడేండ్లు రాజ్యము చేసెననియు, నంతట రాజరాజ విష్ణువర్థనుడు వేంగీశ్వరుడయ్యెననియు శాసనము లొక్కరీతిగా దెలుపు చున్నవి. కాని తండ్రి తనయులమధ్య మూడేండ్లు వ్యత్యాసము గన్పట్టుచున్నది. ఆ వ్యత్యాసమునకు గారణమేమి ? విమలాదిత్యు డెప్పుడు మరణించెను ? ఆ వ్యత్యాసమును గూర్చి చాలుక్య శాసనము లేమియు దెలుపకుండుటకు గారణమేమి ? ఇత్యాది సందేహములు కలుగుటచేత కొందరు తమ ఇచ్చవచ్చినరీతి ఊహలనుబెంచి కల్పనా వృత్తాంతములను వ్రాసియుండిరి. రణస్థిపూండి శాసన కావ్యమున, రాజరాజు కోరుమిల్లి శాసనమును, నాటికాలపు సమకాలీన చారిత్రమును చారిత్రకదృష్టితో పరిశీలింపక బోవుట వలన విపరీతములును, అసంగతములునగు ఊహలను సిద్ధాంతములుగ వ్రాయసాహసించుటకు గారణమయ్యెను.

చాళుక్యరాజుల కాలనిర్ణయము చేయునపుడు ఒక మూలసూత్రము జ్ఞాపకముంచుకొనవలయును. ఒకే శక సంవత్సరమున నొక భూపతి మరణించుటయు, నాతని ఔరసుడో, సోదరుడో వెంటనే పట్టాభిషిక్తుడగుటయు సంభవించును. అట్టి తఱియా సంవత్సరము గతించినవానికి కడపటి విజయరాజ్యవర్షముక్రిందను, తరువాత రాజ్యాభి

# కళింగ - రెండవ గంగ వంశము

గుణమహార్ణవుడు

|

. మొదటి వజ్రహస్తదేవుడు

శ. ౮౧౭ - ౮౬౧ (= ౮౯౫ - ౯౩౯)

|

౨. గుండమరాజు
శ. ౮౬౧ - ౮౬౩
(= ౯౩౯ - ౯౪౨)
మూడేండ్లు

౩. కామార్ణవుడు
శ. ౮౬౪ - ౮౯౯
(= ౯౪౨ - ౯౭౭)
౩౫ ఏండ్లు

|

౫. ముమ్మడి అనంతవర్మయైన
ఇమ్మడి వజ్రహస్తదేవుడు.
అనియంకభీముడు
శ. ౯౦౨ . ౯౩౬ (= ౯౮౦ - ౧౦౧౪)

౪. వినయాదిత్యుడు.
శ. ౮౯౯ - ౯౦౨
(= ౯౭౭ - ౯౮౧)
మూడేండ్లు

౬. ఇమ్మడి కామార్ణవుడు
దే. వినయమహాదేవి
(ఆరునెలలు, శ. ౯౩౬
(= ౧౦౧౪)

౯. నాల్గవ అనంతవర్మయైన
ముమ్మడి వజ్రహస్తదేవుడు
శ. ౯౫౦ . ౯౯౭
(= ౧౦౩౮ . ౧౦౭౦)

౧౦. ఆరవ దేవేంద్రవర్మయైన
రాజరాజు . దే. (చోళ) రాజ సుందరి
శ. ౯౯౭ . ౯౯౯
(= ౧౦౭౫ . ౧౦౭౭)

౧౧. (ఐదవ) అనంతవర్మయైన
శ. ౯౯౯ . ౧౦౬౪
(= ౧౦౭౮ . ౧౧౪౨)

౭. ఇమ్మడి గుండరాజు
ఐదవ దేవేంద్రవర్మ
శ. ౯౩౭ . ౯౪౦
(౧౦౧౫ . ౧౦౧౮)

(రెండవదేవియందు)
౮. మధుకామార్ణవుడు
శ. ౯౪౦ . ౯౪౬
(౧౦౧౯ . ౧౦౩౮)
(పదియేండ్లు)

షిక్తుడైన వాని ప్రథమ విజయ రాజ్యవర్షముగను లెక్కించుట మేటి చాళుక్యవంశమున నాచారము. ఆ సంప్రదాయమునుబట్టి పరిశీలించినపుడు శక్తివర్మ పండ్రెండవ విజయ రాజ్యవర్షమైన శ. ౯౩౩ వ సంవత్సరము, విమలాదిత్యుని ప్రథమవిజయరాజవర్షమగుచున్నది. శ. ౯౩౩ ప్రథమ వర్షముగా లెక్కించిన శ. ౯౩౯ వ సంవత్సరము విమలాదిత్యుని యేడవ విజయరాజ్యమగుచున్నది. కాని యాతని రణస్థిపూండి తామ్రశాసనము అష్టమ వర్షవర్ధనమందు సింహమాసమున నొసగబడినది. అష్టమ వర్షము శ. ౯౪౧ వ (జూలై, ౧౦౧౯) సంవత్సరమున ప్రవర్ధమానమగుచుండెను. కావున నా వ్యత్యస్తమునకు సమాధానము కుదురవలయును. విమలాదిత్యుని ఏడుసంపూర్ణ సంవత్సరముల రాజ్యకాలము రణస్థిపూండి శాసన కాలమునాటికి గడచిపోయెను. ఎనిమిదవ సంవత్సరమప్పుడే ప్రారంభమై సింహమాసాంతరములోపల, అగస్టు నెలలోపల, యాతని రాజ్యపరిపాలనము ముగిసియుండును. అటుతరువాత మూడేండ్లవఱకు రాజరాజ విష్ణువర్ధనుడు పట్టాభిషిక్తుడుగాని కారణమున, విమలాదిత్యుడు ఏడు సంవత్సరములు మాత్రమే రాజ్యపాలన మొనరించియుండెనని తరువాతికాలపు శాసనములందు దెలుపుబడుటకు గారణమయ్యెను.

విమలాదిత్యుని కాలమున కళింగ మొకపరి వేంగీ సామ్రాజ్యమునుండి విడిపోయి కప్పముగట్టుటమానదలచెను. కాని యా ప్రయత్నము సాగినట్లు కన్పించదు. ఆ వృత్తాంతము విమలాదిత్యదేవుడు, మామ యవసానకాలమునకు

తంజావూరు కలిగినవేళ జరిగియుండెనని యూహింపవచ్చును. కళింగాధిపతియగు ఇమ్మడి వజ్రహస్తదేవుడు శ. ౯౬౦ (౧౦౩౮) వ సంవత్సరమున మరణించెను. అతని కిద్దరు దేవులు కలరు. వారిలో నగ్రమహిషియందు ఇమ్మడి కామార్ణవ, ఇమ్మడిగుండమ రాజులును, రెండవదేవియందు మధుకామార్ణవుడును బుట్టిరి. సవతి తల్లుల బిడ్డలు తండ్రి మరణానంతరము రాజ్యమునకై కలహ మటయో వేంగీశ్వరుడు దక్షిణమునకు బోయినవేళ పారతంత్ర్యమునుండి బయటబడుటకు ప్రయత్నమో జరిగియుండినట్లు కన్పట్టును. వారిలో నగ్రజుడగు ఇమ్మడి కామార్ణవు డారుమాసములు మాత్రము శ. ౯౬౪ (౧౦౪౨)న రాజ్యముచేసి మరణించెను. పిమ్మట ఇమ్మడిగుండమరాజు దేవేంద్రవర్మాభిధానముతో పట్టాభిషిక్తుడై శ. ౯౬౪ ౯౭౦ వ సంవత్సరముల నడుమ (౧౦౪౨ ౧౦౪౮) మూడేండ్లు పాలించి స్వర్గస్థుడయ్యెను. ఆ కళింగ పాండవులును ముమ్మడి భీమునకు సమకాలికులు. వంగీదేశమునకు మరలివచ్చినపిదప విమలాదిత్యుడు కళింగాధీశులను బలిమివాటించి జయించి కప్పములు కానుకలుగ గొనియుండును. కళింగము విమలాదిత్యుని సామ్రాజ్యమును జేరి యుండెననుటకు రామతీర్థపు శిలాశాసనము సాక్ష్యము.

# పంచమ ప్రకరణము

వేంగీచాళుక్యసింహాసనమును పరమబ్రహ్మణ్యుడును, పరమభట్టారకుడును, విశేషించి పరమమాహేశ్వరుడునగు సుక్షత్రియుడు మాత్రమే యధిష్ఠింపవలయును. కుబ్జవిష్ణువే నాడు వేంగీరాజ్యస్థాపకుడయ్యెనో, ఆనాటినుండి యించుమించుగా, నొక వైదికాచారము సంప్రదాయముగ నేర్పడెను. కుబ్జవిష్ణువర్ధనాదులు కొందఱు పరమభాగవతులగుదురుగాక, కాని వైదికాచారపరాయణులు. అది రాజ చాళుక్యవంశ మర్యాద. వేంగీచాళుక్యుల రాజనీతిధర్మము. వేంగీశ్వరులు బౌద్ధధర్మోపాసకులపై జైనమునులపై, శ్రావకులపై ఆదరాభిమానమును జూపి యాయాధర్మములను బోషింతురుగాక. దానధర్మములను జేయుదురుగాక సంఘారామములను జినవసతులను, జినాలయములను నిర్మించి భూదానాదులు గావింతురుగాక, కాని వేంగీచాళుక్యచక్రేశ్వరుడుమాత్రము పరమబ్రహ్మణ్యుడును, పరమమాహేశ్వరుడును గావలయును. ఆ సంప్రదాయము ఇమ్మడి విష్ణురాజ ప్రళయాదిత్యునికాలమున సుస్థిరముగ నిలచిపోయెను. బ్రాహ్మణధర్మ మవలంబింక, పరమబ్రహ్మణ్యుడు గానినాడు, శైవాచారము విడనాడి ఈశ్వరాగమములందు మనసునిలుపక పరమమాహేశ్వరాచారపరుడు గానినాడు రాజచాళుక్యవంశజుడు వేంగీసింహాసనముపై గూర్చుండరాదు. అనర్హుడతడు. వేంగీచాళుక్యులకు దక్షవాటి భీమేశ్వరమహాదేవుడు కులదైవము.

విమలాదిత్యుఁడు రాజ్యముచేయుచున్న కాలమున త్రికాలయోగి సిద్ధాంత దేవముని యను నొక జైనయతి యంధ్ర దేశమున కేతెంచెను. అతఁడు మూల సంఘములోని కొండకుందాన్వయమునకు జెందిన నందిగణమువాఁడు. దిగంబర జైనసంప్రదాయమువాఁడు. అతఁడు గొల్లాచార్యుని ప్రియ శిష్యుఁడు. గొల్ల దేశాధీశుఁడట ఒకప్పుడు గొల్లాచార్యుఁడు. నూత్న చందిల కులుఁడు. ఏ కారణముననో యతఁడు జిన ధర్మమును స్వీకరించి యతి యయ్యెను. త్రికాలయోగి సిద్ధాంత దేవముని మహామహిమాన్వితుఁడు. దేశిగణమున కాచార్యుఁడు. ఒకప్పుడాతఁడు బ్రహ్మరాక్షసు నొకని వశవర్తునిగా జేసికొని శిష్యుని జేసికొనెనట! కానుగ నూనెను, కమ్మని నేయిగా తన మహిమాప్రభావముచేత మార్చెనట. త్రికాలయోగి సిద్ధాంత దేవుని సమకాలికుఁడొకఁడు వృషభనంద్యాచార్యుడను ప్రభాచంద్రుఁడు. అతఁడు ధారా నగరాధీశుఁడైన భోజునిచె మన్నన సత్కారములందెను. భోజునికి మిత్రుఁడైన విమలాదిత్యుని సందర్శించుటకు త్రికాలయోగి వచ్చెను. ఆ కాలమున రామతీర్థము ప్రఖ్యాతమైన జైన సిద్ధక్షేత్రముగా నుండెను. సిద్ధక్షేత్ర మనగా జినమునులు జీవన్ముక్తులయిన దివ్యస్థలమని యర్థము. అట్టి రామతీర్థము కళింగమందుండెను. నేడది విజయనగరమున కీశాన్యముగ ఎనిమిది మైళ్ల దూరమున నున్నది. విమలాదిత్యుని కాలమున కళింగము వేంగీసామ్రాజ్యమున కలిసియుండెను గావున, త్రికాలయోగి సిద్ధాంతదేవుడు రామతీర్థమున కరిగి యచ్చట నివాసమేర్పఱచుకొనెను. విమలాదిత్యు డాతని జినధర్మోపదేశముల

నాలకించి యాతని మహనీయ మహత్వసంపదను గాంచి యచ్చెరువంది, శ్రావకుడై యాతనికి శిష్యుడయ్యెను. జిన ధర్మము మనసుకెక్కి నదాదిగా విమలాదిత్యుడు పరమ మాహేశ్వరాచారమును విడనాడెను. రణస్తిపూండి శాసన కాలమునాటి కాత డింకను పరమమాహేశ్వరుడు. కాని, తదనంతరమే యాతడు శ్రావకుడై, విరక్తుడై రాజ్యమును గూడ విసర్జింప నిశ్చయించుకొనెను. జినధర్మ ముపాసించి జీవన్ముక్తుడు కాదలచెను. ఆవిధముగా నాతడు సింహాసన మును పరిత్యజింపవలసి వచ్చెను. యువరాజ రాజరాజ దేవ రకు యుక్తవయసువచ్చిన తక్షణము, రాజ్యభారమాతని వశముజేసి సింహాసనమును త్యజించెను. నాటినుండి వేంగీ సింహాసనము 'త్యాగ సింహాసన'మయ్యెను. పట్టాభిషిక్తు డయిన పిమ్మట రాజరాజ విష్ణువర్ధనుడు 'త్యాగసింహాస నాసీను'డయ్యెనని బేతనభట్టు కోరుమిల్లి శాసన కావ్యమున నుడివియున్నాడు.

రాజరాజదేవు డెప్పుడు జన్మించెనో ఎఱుగరాదు. విమ లాదిత్యుడు సింహాసనమును త్యజించునాటికి యుక్తవయసు వచ్చిన పదునారేండ్లవాడనినచో నాతని జననము శ. ౯౨౫ కు సరియైన (౧౦౦౩) శోభకృతు సంవత్సరమున జరిగి యుం డును. లేక పట్టాభిషిక్తుడగు నాటికి పదునారేండ్ల ప్రాయమువా డని తలంచినచో నాతడు శ. ౯౨౮కు సరియైన (౧౦౦౬) కీలకసంవత్సరమున జన్మించియుండె ననవలయును. ఈరెండిం టిలో రెండవయూహయే సంగతమనుటకు కారణములు చెప్పగలవు. బాల్యమందే యాతనిగుణములు రత్నమయ

మైన కంఠపట్టికవలె యువరాజపదవీచిహ్నముగ బ్రకా శించెననియు, నంతట గుణలుబ్ధయై మాలాధరయై భూమి యాతని పతిగా వరించెననియు విశేషార్థమును ధ్వనింపజేయుచు బేతనభట్టు రాజరాజువయసును కలిదిండి శాసనకావ్యమున చక్కగా స్ఫురింపజేసినాడు. పదమూడేండ్లు నిండీనిండని యువ రాజు రాజరాజదేవునికి విమలాదిత్యుడు రాజ్యాభిషేకము చేయలేదు. తాను జీవించియుండగా కుమారునికి రాజ్యపట్ట మును గట్టినట్లు గూడ కన్పట్టదు. అత డింకను రాజ్యమును పాలించుచుండనేమోగాని, సింహాసనాసీనుడైన వేంగీశ్వరుడు గాడతడు. కాని సామ్రాజ్యసంరక్షణమున కాతడు తగిన రక్షణలు కల్పించినట్లూహింపవచ్చును. అతడు మను మార్గ వర్తి గావున మానవధర్మశాస్త్రము ననుసరించి యాతడొక రాజప్రతినిధివర్గమును నియమించియుండును. అందు తాను, యువరాజు రాజరాజు, అమాత్యశిఖామణి వజ్జియప్రెగ్గడయు సభ్యులుగానుండు నోపుదురు. రాజ్యాభిషిక్తుడుగాని రాజప్రతి నిధి యువరాజు. ఆవృత్తాంతమును బేతనభట్టు అర్థగర్భితము గా "గుణలుబ్ధయేవ మాలాధరయా దత్తా పతిం వరయా" యని కలిదిండి శాసనమున దెలిపినాడు. ఈ శ్లోకపాదమున గూఢార్థమెంతేని కలదు. విమలాదిత్యుడు రాజ్యపరిత్యాగము చేసినదాదిగా వేంగీసామ్రాజ్యము వధువువోలె గుణవంతు డైన పతికొఱకు నిరీక్షించుచు, తనకు తానయై వరించి దత్త మయ్యెనట! ఆమూడేండ్లకాలము లోపల అనేకకారణ ములకతన రాజరాజునకు పట్టాభిషేకము జరుగలేదు. ఆనాడు, స్వయంవరమునకై వచ్చినరాజులట్లు వేంగీసామ్రా

జ్యలక్ష్మికై దాయాదులు పెక్కండ్రు ఒండొరులతో పోరాడుచు రాజరాజు నెదిరించియుందురు. అట్టి వేళ, రాజరాజు సమస్తవిరోధిదాయాదసంఘమును, విక్రమించి సంహరించిన కతన "గుణలుబ్ధ"యై "మాలాధరవై" వచ్చి వేంగీప్రాజ్య సామ్రాజ్యలక్ష్మి రాజరాజును వరించి తనకుదానవై దత్తయయ్యె ననుటలో విశేషఅంతరార్థము నున్నదనుటకు సందియము లేదు. స్వేచ్ఛగా వచ్చి, వరించి, స్వయందత్తమైన సామ్రాజ్యలక్ష్మిని, 'వసుమతి'ని రక్షించుకొఱకు, 'గుణనిధి'యైన రాజరాజు రాజ్యాభిషిక్తుడై పట్టబంధము గట్టుకొనెను.

విమలాదిత్యుడు రాజప్రతినిధివర్గము నొకదాని నేర్పరిచి, సింహాసనమును త్యజించు టొక సాహసకార్యము. ఆతడు కార్యఖడ్గదక్షుడైన వజ్జయప్రగ్గడ యను అమాత్యశిఖామణిని జూచుకొని యా సాహసకార్యమునకు దిగియుండును. అదృష్టవశమున ఆనాడు కుంతలేశ్వరుడు వేంగీదేశముపై నెత్తివచ్చుస్థితియందు లేడు. శ. ౯౪౧ మొదలుకొని నాలుగైదేండ్ల (౧౦౧౯ ౧౦౨౪) వఱకాతడు కర్ణాటరాజ్య పరిస్థితులను చక్కబెట్టుకొనుటలో మునిగియుండెను. శ. ౯౪౬కు సరియైన రక్తాక్షిసంవత్సర వైశాఖశుద్ధపూర్ణిమా (ఏప్రిలు ౨౬, ౧౦౨౪) ఆదివారమున నొసగబడిన మిరజ్ తామ్రశాసనమునందు జగదేకమల్లుడు సప్తకోంకణాధీశ్వరుల సర్వస్వమును గ్రహించియు, తిరిగి ఉత్తరదిగ్విజయార్థము పోవుచుండినట్లు తెలుపబడినది. భోజుడు కొంకణమును జయించిన నాటనుండి, మైదారేండ్లుగా జయసింహుడు సప్తకోంకణా

ధీశ్వరులతోడను భోజునితోడను నిరంతరము బోరుచు వేంగీ
శ్వరునికి ప్రతిక్రియచేయు తలంపుకూడ లేకుండెను. కావున
ఆమూడునాలుగేండ్లును ఆంధ్రదేశమునకు విరోధి పరనృప
తులవలన నెట్టిబాధయు కలిగినట్లు కనబడదు.

రాజ్యపరిత్యాగము చేయుటకుపూర్వము విమలా
దిత్యుడు రణస్థిపూండి గ్రామమును సర్వకరపరిహారముగా
తన యమాత్యశిఖామణికి వజ్జియప్రెగ్గడకు అగ్రహారము
గావించి ధారవోసెను. ఆ దాననిమిత్త మాశాసనముందు
స్పష్టముగా చెప్పబడియెను. రణస్థిపూండి గ్రామము గుద్ద
వాడి విషయములో నుండెను. నేడాగ్రామము కానరాదు.
ఏనాడో యది బేచిరాకయ్యెను. అది దుళ్లకాగ్నేయముగను
వడిదకు దక్షిణముగను, మోతుకుద్రుకు పశ్చిమముగను,
ఉండెను. గుద్దవాడి విషయము నేటి రామచంద్రపురం
తాలూకాకు వర్తించును. వజ్జియప్రెగ్గడ కౌండిన్య గోత్ర
జుడు. ద్రోణమంత్రి పౌత్రుడు. హరదత్త వరప్రసాదుడైన
దత్తామాత్యుని తనయుడు. ప్రభుమంత్రోత్సాహశక్తి
సంయుక్తుడు దత్తామాత్యుడు. శుభకృత్ప్రభావ మహితు
డతడు. చీడమాంబ యా మంత్రిపుంగవునికి ధర్మపత్ని, పతి
వ్రత, సద్గుణములకు నివాసభూమి యాసతి. ఆ పుణ్యదంప
తుల కుదయించిన వజ్జియప్రెగ్గడ (వజ్రామాత్యుడు) కమ్మ
రాష్ట్రములోని కారంచేడు గ్రామవాస్తవ్యుడు. అతడు
మహామేధావి. సూనృతవాక్కు గలవాడు, బుద్ధిశాలి,
సౌమనస్కుడు. వజ్రామాత్యుని పుణ్యగేహము మేధా
వంతులైన బ్రాహ్మణ వటువులు నిత్యము వేదాధ్యయస

మొనరించు ప్రఖ్యాత గురుకులము. ఆ గృహమున శుకశారి కలు గూడ నిత్య వేదపఠనాశ్రవణమువలన వేదవాక్యము లను బలుకుచుండును. అప్రతిమాన ప్రజ్ఞాసమన్వితుడు వజ్జియప్రెగ్గడ. ఆతనిబోలిన యమాత్యుడుగాని, విమలాదిత్యుని వంటి నరపాలుడుగాని, దక్షవాటి భీమేశ్వరునివంటి దైవము గాని అంతకుపూర్వము భూమిపై వెలయలేదు. ఇక భవిష్య త్కాలమున నట్టివా రుదయింపరు. అని సుకవి భీమనభట్టు వచించినాడు. వజ్జియప్రెగ్గడ స్వామికార్యనిర్వహణదక్షుడు. బిరుదంకభీమభూపాలుని కాతడు కార్యఖడ్గధౌరంధర్యమున ననవరతము సాహాయ్య మొనర్చుచుండెను. ఆ ప్రభృత్యు డయి విమలాదిత్యభూపతిని కొలిచి యత డమాత్యపదవికి రాగల్గెను. మహేంద్రుడు వజ్రాయుధ సహాయ్యమున కుధర ములను భేదించినరీతి విమలాదిత్యుడు వజ్రామాత్యుని కార్య ఖడ్గముల సాహాయ్యమున సమస్త రిపుసమూహమును నిర్జించి, భూపమహేంద్రుడని ప్రఖ్యాతిగనెను.

వజ్రామాత్యు డవిరళ జపహోమతత్పరుడు. సకల వేదశాస్త్రార్థ నిష్ణాతుడు. నిరంతర దాననిరతుడు. బ్రాహ్మణ కులమునకు భాస్కరునివంటివాడు. శుచి యతడు. అతడు చతుర సత్యవచో నిరతుడు. బుధవజ్రపాకారు డతడు. ఆతని కార్యఖడ్గ ధౌరంధర్యమువలన శత్రువులు వేంగీశ్వరుని యెదిరింపజాలకుండిరి. వారి సైనికులు దండనాథులు స్వగృ హములందు విశ్రాంతి ననుభవింపసాగిరి. వజ్రామాత్యుని ప్రజ్ఞావిశేషమువలన అంధ్రజగతి శాంతిసౌఖ్యసంపదల ననుభవించెను. అతడు సుస్థిరచిత్తుడు. శ్రీకరుడు. శ్రీకంఠ

పదారవిందముల నాశ్రయించిన షట్పదము. వాచా, మనసా, కర్మణా సదాచారమం దత్యంతము స్తవనీయమైన గుణములు కలవాడు. ధర్మసంగతియం దాతడు నాయకుడు. ఉదార నిరతికి నిధివంటివాడు. అట్టి వజ్రామాత్యుడు చాళుక్య చూడామణియైన విమలాదిత్యదేవుని పాదభక్తుడై, సౌజన్య రత్నాకరుడని ప్రసిద్ధికెక్కెను. నృపపదములకు అంగములు ఏడు. అందు మొదటిది నృపాలుడు. రెండవ యంగము అమాత్యుడు. అట్టి అమాత్యపదవియం దద్వితీయుడు వజ్రామాత్యుడు. అట్టి అమాత్య శిఖామణికి, ప్రసిద్ధనామ్నుడయిన వజ్జియప్రెగ్గడకు, ప్రీతితో విమలాదిత్య భూపతి, శ్రీద్వార పింఛ కర కాతప వారణాది నృపచిహ్నముల నొసగి సన్మానించెను. తన యభ్యుదయాభి వృద్ధికొఱకు అగ్రహారమును ధారవోసెను. విమలాదిత్యుని శాసనమున కాజ్ఞప్తి దండనాయక నృపకాముడు. అతడు ద్విజాధినాయకుడు. బ్రాహ్మణకుల శ్రేష్ఠుఁడు. భీమనభట్టు రచించిన శాసన కావ్యమును రాగిరేకులమీద జొంతాచార్యుడు లిఖించెను.

రాజరాజ విష్ణువర్ధనుడు పట్టాభిషిక్తుడయిన తరువాత కొలది కాలమునకు ప్రకటింపబడెను కోరుమిల్లి దానశాసనము. తచ్ఛాసన కావ్యకర్తయగు బేతనభట్టు 'రాజద్రాజన్య సేవ్యమైన పృథ్వీరాజ్యలక్ష్మిని రాజరాజు, భుజబలముచేత సంపాదించెను' అని తెలిపియున్నాడు. ఆనాడెవ్వరినో శత్రువులను జయించి తండ్రిత్యజించిన 'త్యాగసింహాసనము'ను రాజరాజు అధిష్ఠించెనని దానిభావము. ఆ కాలమున రాజరాజుకు దాయాదులు తప్ప ఇతర శత్రువులు లేరు.

రాజరాజుకు సవతితమ్ముడు వీరవిజయాదిత్యదేవుడు గలడు. అతడు విమలాదిత్యునికి మేడమాంబాదేవియందు జనించెను. ఆదేవి చోడవంశమున బుట్టెను. ఆమెజనకుడు తెనుగు చోడవంశజుడు, ఆచంటపురాధీశ్వరుడైన మండలిక నూరపరాజు. కుమార వీరవిజయాదిత్యునివలన రాజరాజుకు పట్టాభిషేకమునకు బూర్వము క్లేశముకలిగినట్లూహింపరాదు. అతడు బాలుడు; రాజరాజుకంటెను బాలుడు. రాజ్యకాంక్ష యాతని హృదయక్షేత్రమున శైశవమునాడె మొలకెత్తినటుల తరువాతి కాలపు నాతనిశాసనములు లేశమయినను సూచనలు చేయవు. అట్టిధ్వనియు నందు గానరాదు. రాజరాజుశీలమును, మనస్తత్వమును, బంధుప్రియత్వమును, కరుణారసప్రపూర్ణత్వాదులను విమర్శించినపుడు, అతడు సవతితమ్ముని యువరాజపదవికి పట్టముగట్టియుండునని యూహింపవచ్చును. కావున రాజరాజవిష్ణువర్ధనుని కానాడు వీరవిజయాదిత్యుడు విరోధిగాడు. అతని విరోధు లన్యులైయుండురు.

ఇమ్మడిచాళుక్యభీముడు దాయాదులనందరిని జయించి వారలను దేశమునుండి వెడలనడచి వేంగీసామ్రాజ్యపట్టమును గట్టుకొనెను. యుద్ధమల్ల, రాజమార్తాండ, కంఠిక విజయాదిత్య ప్రభృతులు రాజభీముని దాయాదులు. వారందరు దేశోపద్రవకారిణులై యుద్ధతులై చరించిరని తెలియుచున్నది. రాజమార్తాండు డెవ్వడో తెలియదు. యుద్ధమల్లుని సంతతి బాదప, తాళరాజవిష్ణువర్ధనులతో నంతరించెను. రాజమార్తాండుని సంతతివారు గావచ్చును నిరవద్యపురమను నిడదవోలును రాజధానిజేసికొని పాలించిన వారు. నిరవద్య

పుర చాళుక్యవంశము చిరకాల మొక చిన్నరాజ్యము పాలించెను. ఆ వంశచరిత్ర పూర్తిగ దెలియదు. వారును సర్వలోకాశ్రయ శ్రీవిష్ణువర్ధన మహారాజని అభిషేకనామముతో తమ రాజ్యమును బాలించిరి. సర్వలోకాశ్రయ శ్రీవిష్ణువర్ధన నామముజూడ నిరవద్యపుర చాళుక్యులు వేంగీశ్వరునకు విరోధులని యూహింపవచ్చును. కంఠిక బేతరాజు లేక కంఠిక విజయాదిత్యుని సంతతి పిఠాపురము రాజధానిగా నొక చిన్నరాజ్యమును పాలించిరి. వారును వేంగీశ్వరులవలె సర్వలోకాశ్రయ శ్రీవిష్ణువర్ధన మహారాజులని వ్యవహరించిరి. రాజరాజ విష్ణువర్ధనునికి, ప్రాయశః రాజమార్తాండుని వంశజులైన నిరవద్యపుర చాళుక్యులును, కంఠిక విజయాదిత్యుని యన్వయమువారగు పిఠాపుర చాళుక్యులును విరోధులయి వేంగీ సింహాసనమునకై పోరాడి యుందురు. కంఠిక విజయాదిత్యుని కుమారుడు ఉత్తమ చాళుక్యాపరనామ్నుడయిన సత్యాశ్రయుడు. అతడు గంగాన్వయమందు జన్మించిన గౌరీదేవిని పెండ్లియాడెను. ఆదంపతులకు విజయాదిత్య, విమలాదిత్య, విక్రమాదిత్య, విష్ణువర్ధన, మల్లప, కామ, రాజమార్తాండులను ఏడ్గురు పుత్రు లుదయించిరి. శక్తివర్మ మరణానంతరమును, పిదప విమలాదిత్యుని సింహాసన త్యాగానంతరమును ఉత్తమ చాళుక్యుడు వేంగీశ్వరుడగుటకు ప్రయత్నించి యుండును. నిరవద్యపుర, పిఠాపుర చాళుక్యులుకాక యలమంచి కళింగములోని సర్వసిద్ధి చాళుక్యులుకూడ వేంగీ సామ్రాజ్యమునకై రాజరాజుతో పోరాడి పరాజితులై

యుందురు. 'గుణనిధి' యగుటవలన రాజరాజు జనులకు ప్రీతి పాత్రుడయ్యెను. 'జనసంప్రార్థన' మాతనికి సాయపడెను. ఇత్యాది కారణములవలన రాజరాజు దాయాదివర్గమును నిశ్శేషముగా జయించగల్గెనని కోరుమిల్లి శాసన కావ్యము ధ్వనింపజేయుచున్నది.

రాజరాజదేవుడు పట్టాభిషిక్తుడు కాకపూర్వముగూడ రెండేండ్లకాలము రాజ్యముపాలించెనని వీర విజయాదిత్యుడు పాములవాక శాసనమునందు వచించినాడు. కాని యా రెండేండ్లకాలమునాడు రాజరాజనరేంద్రుడు పట్టాభిషేకము చేసికొనితండ్రిత్యజించిన సింహాసనమునగూర్చుండజాలకపోయెను. శత్రువులు, దాయాదు, లాతని నాకాలమున రాజ్యాభిషేకమును జేసికొననీయలేదు. దాయాదానలమును పూర్తిగా నార్పినగాని ఇతర విరోధులు విక్రమించుచునేయుందురు. ఆనాడు రాజరాజుకు విరోధులలో నొకడు కళింగభూపతి మధుకామార్ణవుడని తోచును. విమలాదిత్యుని సింహాసన పరిత్యాగకాలమునాడు మధుకామార్ణవుడు కళింగసింహాసన మధిష్ఠించెను. విమలాదిత్యుడు సింహాసనపరిత్యాగము జేసిన నొకసంవత్సరమునకు మరణించియుండును. విమలాదిత్యుని మరణమునకు దాయాదుల వైరములోడయ్యెను. ఆ యదను జూచుకొని వేంగీచాలుక్యరాజన్యుల సహాయము, మైత్రియు తనకు తోడగుచుండ,మధుకామార్ణవుడు రాజరాజుకు విరోధి యయ్యెను. అట్టి శత్రువును, దాయాదులను జయించిన పిమ్మటగాని రాజరాజు పట్టాభిషేకమును జేసికొనలేదు.

పట్టాభిషేకము నాటికి రాజరాజ నరేంద్రుడు పదు నారేండ్లవాడు. పట్టాభిషేకానంతరమే రాజరాజు అమ్మంగ దేవి నుద్వాహమయ్యెను. ఆమె మధురాంతక దేవుడని ప్రసిద్ధ నామముగల రాజేంద్రచోళ దేవుని ప్రియతనయ. ఆవివాహము రాజమహేంద్రవరమున శ. ౯౪౪ సంవత్సర మాఘఫాల్గుణ ములందు (౧౦౨3, ఫిబ్రవరి) జరిగినట్లూహింపవచ్చును. చేతనభట్టు తనయేలిక వివాహమును అర్థగాంభీర్యముగల మాటలలో తెలిపియున్నాడు. దాయాదాది శత్రుసంహార మునుజేసి రాజరాజు రాజ్యాభిషిక్తుడయినాడని 'విని', అతని యందు ఉన్నతవంశ వినయ త్యాగాభిమాన, ప్రజ్ఞావిక్రమ సత్య శౌచ పటుశౌర్య క్షమాది గుణములుండుట గాంచి, సుహృష్టుడయి, స్నేహముతో, నాచాలుక్యాభరణునకు తన కుమార్తె, అమ్మంగదేవి నిచ్చి పెండ్లి జేసి అగ్రమహిషిని జేసె ను. అని చేతన భట్టు వ్రాసిన దానియందు రాజేంద్రచోళుడు స్వయముగా నేతెంచి తనమేనల్లుని, దుర్బలు నొకని నిస్సహా యుని, వేంగీసింహాసనముపై గూర్చుండబెట్టినట్లు ధ్వని స్ఫురిం చుటలేదు. రాజేంద్రచోళుడు రాజరాజు సహాయమునకొఱకు సేనల నంపినట్లు చోళశాసనములందు ధ్వని గూడలేదు. కాని సేనా సహాయముచేసియుండె ననుట సంశయింప నక్కఱ లేదు. కాని వేంగీసామ్రాజ్యమును సమరాంగణమున రాజ రాజు పటువిక్రమశౌర్యసహాయ్యముతో స్వభుజబలముతో జయించికొనినాడనుట నిస్సంశయము. ఖడ్గైకసహాయుడై శత్రువులను జయించి, రాజరాజు పరగండభైరవుడని బిరుద

మును ధరించినట్లు బేతనభట్టు తెలుపుచున్నాడు. తనకొఱకు గంగాజలమును గొనివచ్చుదండనాథునికులూతోత్కల వంగ, కళింగాధిపతులు కొందఱు ప్రతిఘటించినారని విని రాజేంద్ర చోళుడు విజిగీషుఁడై యాతని సహాయార్థము గోదావరివఱకరిగి తా నక్కడ నిలచిపోయి దండాధిపులను మాత్రము తూర్పుకు బంపెను. తాను అమ్మంగదేవి కుద్వాహమును గావించుతలంపుతో రాజమహేంద్రవరమున నిలచియుండును. రాజరాజదేవుని వివాహము జరుగునాటికి చోళదండనాథులు కులూతోత్కల కళింగవంగాధీశులను జయించి భాగీరథీజలమును గొనివచ్చిరి. రాజమహేంద్రవరమున గోదావరీ పావనోదకములందు గంగ నీటిని కలిపి రాజేంద్రచోళుడు జలక మాడి నిజరాజధానికి మరలివచ్చెను. గోదావరీ పావనోదకములను భాగీరథీజలములను గొనితెచ్చి గంగయికొండ చోళ పురమును బ్రవేశించి వాటిని ప్రత్యేక పవిత్రకుండమందు నింపి యాతటాకమునకు గంగయికుండమని పేరిడెను.

వివాహానంతరము రాజరాజు కొంతకాలము, కనీస మొక పది యేండ్లు, నిశ్చింతగా రాజ్యమేలినట్లు తోచును. సన్మార్గముచే కులమును, మనుమార్గవర్తియై ప్రజలను, రక్షించెను. దీనుల ననాథుల నర్థులను బంధుజనులను ధనమిచ్చి సంతోషపఱచెను. తన పవిత్రచరిత్ర మను తోయములతో కలికాలపంకమును కడగివైచెను. నయశాలినియైన రాజరాజ విష్ణువర్ధనుని పరిపాలనమున ప్రజలు ప్రీతిజెందిరి. అతడు సుఖ వినోదగోష్ఠినిసామ్రాజ్యోపభోగముల ననుభవించెను. ఆనాకు నిండు జవ్వనమున నున్నరాజరాజు రాజమహేంద్రునివలె చండి

శాప్రసాద పరిలబ్ధసామ్రాజ్యచిహ్నముతో, 'త్యాగసింహాసన' మధిష్ఠించి, నిత్యప్రవర్ధమాన మహామహీరాజ్యవిభవుడై అఖిల జగద్గీయమానముగ, ధర్మదయార్ద్రబుద్ధియై జనానురంజకముగ, నంధ్రభూమిని పాలించెను. ఆనాడు రాజమహేంద్రు డనేకపురాణములను వినెను. అనేక అర్థధర్మశాస్త్రముల తెలుగు గ్రహించెను. ఉదాత్త రసాన్విత కావ్య నాటకక్రమములు పెక్కుచూచెను. విద్వాంసుడును 'కృతమతి'యును, కవియునయ్యెను. రాజమహేంద్ర కవీంద్రసమాజమును బోషించెను. 'అపారశబ్దశాస్త్రపారగులైన వైయాకరణులను భారతరామాయణాద్యనేక పురాణేతిహాస చాతురీ ధురీణులైన పౌరాణికులను, మృదుమధుర రసభావభాసుర కవితా రచనావిశారదులయిన మహాకవులను, వివిధతర్క విగాహిత సమస్తశాస్త్ర సాగరసార గరీయః ప్రతిభులైన తార్కికులును, వైణిక గాయకులాదిగాగల విద్వజ్జనంబులను' బోషించెను. ఆ విధముగా నతడు తనకు రాజమహేంద్రవరము రాజధానిగా, మహేంద్రమహిమతో మహావిభూతితో దిక్కుల తనయాజ్ఞ వెలిగించుచు పరిపాలించెను.

# కళ్యాణ (కుంతల లేక కర్ణాట) చాళుక్య వంశము.

విజయాదిత్యుడు

- ఇమ్మడి విక్రమాదిత్యుడు
  ఇమ్మడి కీర్తివర్మ
  (వాతాపిచాళుక్యులలో కడపటివాడు)
- * * * * *
  అయ్యణదేవుడు
  - నాల్గవ విక్రమాదిత్యుడు
    (కలచురి రాజపుత్రి బొంథాదేవి
    - ఆహవమల్ల - నూర్మడి
      ఇమ్మడి తైలపదేవుడు
      శ. ౮౯౫ - ౯౨౦ (౯౭౩ - ౯౯౭)
      - అకలంకచరిత, ఇఱివ బెడంగ
        సత్యాశ్రయుడు - శ. ౯౨౦ - ౯౩౧
        (౯౯౭ - ౧౦౦౯)
      - దాళవర్మ, లేక యశోవర్మ
        బాగలదేవి

కుమార్తె
భర్త, పల్లవ ఇరివ నోలంబాధిరాజు

త్రిభువనమల్ల
ఐదవ విక్రమాదిత్యుడు
శ. ౯౩౦ - ౯౩౪
(౧౦౦౯ - ౧౦౧౩)

అయ్యణదేవుఁడు
శ ౯౩౫ - ౩౬
(౧౦౧౩ - ౧౦౧౪)

అక్కాదేవి

జగదేకమల్ల
ఇమ్మడి జయసింహుడు
శ. ౯౩౬ - ౯౬౫
(౧౦౧౪ - ౧౦౪౪)

త్రైలోక్యమల్ల ఆహవమల్ల
(మొదటి) సోమేశ్వరుడు
శ. ౯౬౫-౯౯౦
(౧౦౪౪-౧౦౬౮)

భువనైకమల్ల
(రెండవ) సోమేశ్వరుడు
శ. ౯౯౦ - ౯౯౮ (౧౦౬౮ - ౧౦౭౬)

త్రిభువనమల్ల
(ఆరవ) విక్రమాదిత్యుడు
శ. ౯౯౮ - ౧౦౪౮ (౧౦౭౬ - ౧౧౨౬)

భూలోకమల్ల (మూడవ) సోమేశ్వరుడు

జయసింహుడు

విష్ణువర్ధన
విజయాదిత్యుడు

# షష్ఠ ప్రకరణము

ఇంచుమించుగా రాజరాజవిష్ణువర్ధనుడు రాజ్యాభిషిక్తుడైన ఎనిమిదేండ్లకు ఆతని సవతితమ్ముడు ద్రోహము తలపెట్టెను. దానికి కారణము రాజ్యాభిలాష. 'ముమ్మడి భీమునికుమారుడైన రాజరాజు భూమిని పండ్రెండు సంవత్సరములు పాలించెను. ఆతని సవతితల్లి కుమారుడైన విజయాదిత్యుడు రాజరాజును బలమువాటించి, ఘోరసంకులమున నోడించి, బలాత్కారముగ వేంగీసామ్రాజ్యమునకు బట్టముగట్టుకొనెను' అని పాములవాక శాసనమునం దున్నది. విజయాదిత్యు డావిధముగ అన్నపట్ల స్వామిద్రోహమొనరించి, శ. ౯౫౩ కు సరియైన ప్రజాపతి సంవత్సర శ్రావణ శుద్ధ పంచమి (సౌరమాన కర్కాటకమాసమున) ఆదివారము (౨౭ జూను, ౧౦౩౧) నాడుదయము కన్యాలగ్నమున ధన్యుడై, సర్వలోకాశ్రయ శ్రీవిష్ణువర్ధన మహారాజాధిరాజను పేరుతో పట్టాభిషిక్తుడయ్యెను. ఆనాటికి రాజరాజు పండ్రెండు సంవత్సరములు పాలించియుండె నని దెలుపుటవలన విమలాదిత్యు డప్పటికి మరణించి పండ్రెండు సంవత్సరములు గడచెననియు, రాజరాజు పరిపాలనము నాటినుండి ప్రారంభించెననియు, విజయాదిత్యుడు లెక్కించినాడు. కాని వేంగీరాజ చాళుక్యవంశజుల గణనపద్ధతినిబట్టి, విజయాదిత్యుడు పట్టాభిషేకము రాజరాజు పదియవ విజయరాజ్యవర్షమున జరిగెను. పటాభిషేకమునకు బూర్వము రాజరాజు నిర్వక్రముగా,

శత్రునిశ్శేషముగా రాజ్యమేలియుండని కారణమున పట్టాభి
షేకమునకు ముందు గడచిన రెండేండ్లను గణనకు
రాలేదు.

విజయాదిత్యదేవునకు చాళుక్యభీముడన్న నామము
కలదు. అతడుముమ్మడిచాళుక్యభీముడు. పరగండభైరవుడైన
అన్నను నిర్జించి యతడు కరవాలభైరవుడని బిరుదుధరించెను.
అతడు రాజ్యాభిషిక్తుడయిన రెండవయేట, తనకై క్లేశముల
ననుభవించి, వేంగిసామ్రాజ్యమును సంపాదించుటయందు
తనకు తోడ్పడిన మాండలికభీమునకు యలమంచి కలింగము
లోని కొంపాలొంగు గ్రామమును ద్వాదశగ్రామసహితముగ
నొకమండలముగ శాసనముచేసి దానమిచ్చెను. భీమభూపతి
చామెరాజుకు కామాంబికయందు పుట్టిన తనయుడు. చామె
రాజు అశేషులయిన రిపునృపతులను జంపి నిజేశ్వరునివలన
మాండలిక ప్రభుత్వప్రసాదమును బడసెను. కాని యంతలో
నాహవరంగమున మడిసెను. అతని కుమారుడు భీముడంతట
విజయా దిత్యునికి స్వామి భక్తితో సాయపడెను. భీమరాజు
నాగకులభూషణుడు. అతనికి, మేఘగిరినాధుడనియు, మేల్ప
కందర్పుడనియు, మలయ భాస్కరుడనియు ప్రఖ్యాతబిరుద
ములు. విజయాదిత్యదేవున కాతడు మంత్రి. అతడు బృహ
స్పతి సదృశుడైన మతిమంతుడు. విజయాదిత్యు డన్నకు
ద్రోహము తలచి, కళింగమున సామంతుడుగా పరిపాలించు
చుండినవేళ, హఠాత్తుగ, నాతనిపైబడి యోడించి రాజధానిని
సింహాసనమును బలాత్కారముగ నపహరించుటయందు
భీమరాజు తోడ్పడి యుండెను.

విజయాదిత్యుడు బలాత్కారముగ రాజరాజును రాజధానినుండి తఱిమివేయగల్గెను గాని, వేంగీరాజ్యము సంపూర్ణముగ నాతనికివశము కాలేదు. జనానురంజకుడైన రాజరాజును, బలవంతుడును మృగరాజపరాక్రముడు నగు రాజరాజును, సంహరింప విజయాదిత్యుని కొక్కనికి దుస్సాధ్యమయ్యెను. ఒకప్రక్క కళింగమునేలు మధుకామార్ణవుని సాహాయ్యమును, రెండవవైపునుండి కర్ణాటభూపతి జగదేకమల్లుని సాహాయ్యమునర్థించివిజయాదిత్యుడన్నతోపోరాడియుండును. రాజరాజ విజయాత్యులవైరము రెండుమూడేండ్లుగా సాగెను.విజయాదిత్యుడన్నను నిరవశేషముగ నోడించి, సంహరింపజాలక పోయెను.

ఇట్లుండ విజయాదిత్యునకు సహాయము జేయ జగదేకమల్లుడు కర్ణాట సైన్యములను బంపుచున్నాడని విని, ఆంధ్రభూమిని జరుగుచుండిన మహాసంకులములను పరికించుచున్న రాజేంద్రచోళుడాసైన్యముల నెదుర్కొనిజయసింహుని పన్నాగము వ్యర్థము చేయదలచి తత్క్షణము చోళదేశమునుండి ముువ్వురు దండనాథులను మూడుసైన్యము లిచ్చి బంపెను. కర్ణాట భూపతి ఆంధ్రదేశమునకు సైన్యము లంపుటకు గారణము, రాజరాజును సంహరించి, రాజేంద్రచోళునకు వేంగీశ్వరుని సహాయ్య మెప్పటికిని లేకుండ జేయవలయునని తలంపుగా తోచును. చోళ దండనాథులలో నగ్రగణ్యుడు రాజరాజ బ్రహ్మమహారాజను బ్రాహ్మణ దండనాయకుడు. అతడు మధురాంతకదేవుని కరుణారసముచే వర్ధిల్లిన మహావీరుడు. చోళమహా సామ్రాజ్యలక్ష్మిని సంరక్షించుటకు సమర్థము

లయిన మహోగ్ర భుజంగములవంటి బాహువులు గలవాడు. శత్రు రక్తమును ద్రావుట కాసక్తత గల అపరకాలుని వంటివాడు. ప్రచండ మహాసైన్యమున కధీశుడు. ఉత్తమ చోడచోడగోనను నాతడు రెండవ చమూపతి. ఉత్తమ చోడ మిలాడుడయ్యను మూడవవాడు. భార్గవవంశ సంభూతు డతడు, యాదవభీముడని పేరువడసిన దండనాయకుడు. కడపటి యిరువురును సుక్షత్రియ వంశజులు. కరాటసేనలు చోళసేనల నెదుర్కొనకుండ, విజయాదిత్యదేవుని గలిసికొనవలెనని ప్రయత్నించి యుండును. వారి ప్రయత్నము సాగనీయకుండ చోళ దండనాథులు కర్ణాట చమూపతులను సంకులమున కీడ్చియుండిరి. అంతట ఉభయ బలములకును కలిదిండి మహాగ్రామము దగ్గి ఘోరయుద్ధము సంఘటిల్లెను. ఆ యుద్ధమం దెవరికిని జయము లభింప లేదనియు నది సమాన యుద్ధ మయ్యెననియు ఉభయ బలములవారును సమానముగ కూలిరనియు కలిదిండి శాసనము నుడువుచున్నది. అది యదార్థము కావచ్చును.

కలిదిండి యుద్ధమును బేతనభట్టు కన్నులతో జూచి వచ్చినట్లు అత్యద్భుతముగ వర్ణించినాడు. 'పదాతులు ముష్టాముష్టి, కేశాకేశి, తల్ క్షణమ దండాదండి, కుంతాకుంతి, పోరాడిరి. కొందరు వెనుకనుండి ధనుర్ధరులై, శౌర్యమూర్తులై శరపరంపరల గుప్పించిరి. పరస్పర బాణాపాతములచేత రెండుసేనలును పెనుగాలిచే కొట్టబడిన వనములట్లుండెను. ఖడ్గిఖడ్గముల తాకుడుచేత విస్ఫులింగములు లేచుచుండెను. శలభములవలె నా యగ్నియందు, సుభటులు సయితము

భయవృత్తులై మడిసిరి, చలచిత్తులై కొందరు పరిభ్రమించిరి. ఆ ఘోరసంకులమందు గజకబన్ధములు, తురగ కబన్ధములు రోషావేశమున నృత్యము చేయుచున్నట్లుండెను. చచ్చిన యేనుగులు, గుఱ్ఱములు, పదాతులు, ఆకృతి గోల్పోయిగా బండోరులమీద కుప్పతిప్పలుగా బడిపోయిరి. కాలవశమున ఆ ఘోరయుద్ధమందు, చోళ దండనాథులు తురంగముల నెక్కియు, ఏనుగుల నెక్కియు బాహుబలము జూపి విక్రమించిపోరాడియు దివంగతులైరి'. అట్టివీరుల నుద్దేశించి. యుద్ధానంతరము కొన్నినాళ్లకు, రాజరాజు తిరిగి వేంగీశ్వరుడయిన పిదప, వైరివీరులను విజయాదిత్యుని నిస్తేజులను జేసిన పిదప, కలిదిండి గ్రామమున రాజరాజేశ్వరుడను పేరుతో రెండు శివాయతనములను బ్రతిష్ఠించెను. బలినివేద్య ఉపహారాదులకు, నృత్య సంగీత మంగళ వాయిద్యములకు, ఖణ్డస్ఫుటిత నవకర్మల కొఱకును, వేదాధ్యయనచేయు ఏబది బ్రహ్మచారులకు శాస్త్రశ్రోతలకు అధ్యాపకులకు సత్రమున భోజనార్థమును, దేవాలయమునకు ఏబది యిద్దరు వేశ్యలుండుటకును, గ్రామమున నూర్గురేసి చొప్పున బ్రాహ్మణులు, వైశ్యులు, శూద్రులు నివసించుటకు వసతులు గల్పించి, కలిదిండి కడపట్టు ఆవకూరు గ్రామములను మూడింటిని దానము జేసెను.

కలిదిండి యుద్ధము విజయాత్యుడింకను పదస్థుడై యున్నకాలమున జరిగెను. అయ్యది శ. ౯౫౪ - ౯౫౫ సంవత్సరముల నడుమ (౧౦౩౩ - ౧౦౩౪) నెప్పుడో జరిగియుండును. అనాడించుమించుగా విజయాదిత్య రాజరాజులు

పోరాడిన సంగ్రామములన్నియు సమయుద్ధములుగా పరిణమించెను. జయ మెవ్వరికిని స్థిరముగా సంశయభిదముగా లభింపకుండెను. ఆంధ్రదేశమున జరుగుచుండిన అన్నదమ్ముల పోరును కౌతుకముతో పరికించుచు, విజయాదిత్యునికి జయము గోరుచు జగదేకమల్లుడు కుంతలదేశమున పర్యటనము జేయుచుండెను. అతడు శ. ౯౫౨ సంవత్సరమున యాతగిరినగరమందుండెను. మరుచటియేడు కళ్యాణకటకమునకుబోయెను, ఆసంవత్సరాంతమునకు ననగా శ. ౯౫౫ సంవత్సర ఉత్తరాయణ సంక్రమణ పుణ్యకాలమునాటికి తుంగభద్రదాటి పొట్టలకెఱె నేలవీడున విడిసెను. పొట్టలకెఱె నేడు దణ్ణాయకకెఱె యని బరగుచు హాసపేట తాలూకాలో నున్నది. శ. ౯౫౬ యగు భావ సంవత్సరమున జగదేకమల్లుడు విజయాదిత్యుడోడుచుండుటగాంచి, పశ్చిమదిశాభిముఖుడై గంగవాడి రాజ్యములోని కొల్లిపాకకు† వెడలెను. ఆ భావ సంవత్సరాంతము నాటికి (మార్చి, ౧౦౩౫) రాజరాజు సంపూర్ణ విజయమును బొందినట్లూహింపవచ్చును. కలిదిండిగ్రామమున శివాయతన ద్వయ నిర్మాణప్రతిష్ఠాదులు శ. ౯౫౭ యగు యువసంవత్సరమున (౧౦౩౫) జరిగియుండును. రాజరాజనరేంద్రుని సంగ్రామవిజయ విక్రమశౌర్యములు జనుల మనః

† చారిత్రకపరిశోధికులు కొల్లిపాకను సరిగా గుర్తింపజాలకున్నారు. రాజేంద్రచోళ, రాజాధిరాజులు పలుతడవలు తగులబెట్టిన కొల్లిపాక మైసూరుమండలములోనిది గాని తెలంగాణములోనిదిగాదు. గంగవాడి కొల్లిపాకకు 'దక్షిణకవాటవని' కుంతలచాళుక్యులనాడు ప్రసిద్ధి. చోళ శాసనములందు పేర్కొనబడిన కొల్లిపాకయే దక్షిణకవాటము.

క్షేత్రములందు నిలచియుండి అప్పటికింకను ప్రత్యక్షముగ జరిగినట్లు స్ఫురణకు వచ్చుచుండెను. రాజరాజనరేంద్రుడు నిక్కముగా ననేక ఘోర సంగ్రామములందు పెక్కు తడవులు జయము గైకొనెను. కాని విజయాదిత్యుడు సాహసియై మాటి మాటికి అన్న నెదిరించి యుద్ధమున నోడింపవలయునని ప్రయత్నములు చేయుచుండెను. ఏమయిన నేమి చివర కాతడు సంపూర్ణముగ నోడి విఫల మనోరథుడయ్యెను. రాజరాజు ప్రచండ ప్రతాపుడు. విక్రమ శౌర్యముగలవాడు.

ఆ కథను బేతనభట్టు కవిరాయని కవితారచన దోప జేయును. "యస్య శ్రీ పరగండభైరవ విభోర్దోర్దణ్డ కాణ్డేయక", "ఏకేనైవ హయాహయేన" అని మనోహరములయిన రెండు శ్లోకములందు రాజరాజనరేంద్రుని విక్రమ శౌర్యములను కన్నులకు గట్టినట్లు వర్ణించినాడు. నన్నియభట్టుగూడ నారీతినే, రసభావభాసురమైన కవిత్వమందు, నందమపూండి శాసనమందు రాజరాజను వీరావతారమోయన్నట్లు "యస్య స్ఫారభుజాకృపాణదళితారాతీభకుంభస్థల"మని ప్రారంభించు శ్లోకమున వర్ణించినాడు. రాజరాజు శత్రువులబరిమార్చి రాజ్యమును రెండు పర్యాయములు జయించుకొని, సుస్థిరైశ్వర్యమును బడసినాడు. ఆ కారణమునగాదె నన్నియభట్టు తనివిదీరకయు భారతమున అర్థ గాంభీర్యములో నిండిన వాక్యములందు. 'ఘోరాజిముఖోపలబ్ధ విజయ ప్రమదాశ్రిత బాహుదండ' 'నిస్తేజిత వైరివీర' "నిజభుజవిక్రమ విజితారాతి రాజనివహుండ," అన్యరాజతేజోజయశాలి శౌర్యుడు", "అపరాజిత భూరి

భుజాకృపాణ ధారాజలశాంత శాత్రవపరాగుఁడు", 'దండితాహితవీర', "పరగండభైరవ," 'వైరి వేదండగండ విదారి' 'ఘోరతరాసి భాసిభుజార్గళా', వీరోగ్రాజి విజయ". 'రిపు ప్రలయప్రతాప,' 'పార్థసన్నిభ' 'వైరి భయంకర శౌర్య' 'గంధ సింధురహయశిఖారూఢ,' 'పరాక్రమ రాఘవ' 'ఘోరారి మద కుంభ విదారణ దారుణ కృపాణ దక్షిణ హస్త' ఇత్యాది మనోహర పద వాక్యరచనలు గావించి రాజరాజనరేంద్రుని శౌర్యప్రతాపములను వర్ణించినాడు.

నన్నియభట్టు వచించిన రీతి రాజరాజంతట రాజనారాయణ బిరుదాంచితుడయ్యెను. దక్షమఖారి దయాలబ్ధసుస్థిరైశ్వర్యప్రదుడయ్యెను. అహితవిరుడైన విజయాదిత్యుని సంపూర్ణముగ నోడించిన పిమ్మట, రాజరాజు తమ్మునివలన నిక ముందెన్నడును ద్రోహము సంభవించకుండ, రాజనీతి సర్వజ్ఞుడయి కట్టుదిట్టములను జేసెను. కృపారస బంధురుడును, బాంధవాంభోజవన ద్యుమణియునగుటవల విజయాదిత్యుని నిర్బంధితుని గావించియుండును. కొందఱయ్యలూహించినరీతి విజయాదిత్యుడు పరాజితుడై జగదేకమల్లు నాశ్రయింపబోలేదు. ఆ యూహ అసంగతమైనది. రాజరాజు తమ్ముని జీవగ్రాహముగా బట్టుకొనిబంధించియుండును. విజయాదిత్య నామాంకితులు ఆహవమల్లుని సామంతులలో నెందఱేనికలరు. వేంగీశ్వరుడైన విజయాదిత్యుడు కలియుధిష్ఠిర, కరవాల భైరవాంచితుడు. అన్య విజయాదిత్యుల కాబిరుదులు లేవు. ఆ విధముగా విజయాదిత్యుని శిక్షించి శ. ౯౪౪ వ సంవత్సరము మొదలుకొని ౯౮౩ వఱకు వించుమించుగా

పదియేండ్లు (౧౦౩౫-౧౦౪౪) రాజమహేంద్రుడు "నిస్తే జితవైరివీరు"డై. "నానావనీనాథ కిరీటతటీ విలసద్రత్న సంఘటిత పదకమలుఁడై" సుఖ వినోదగోష్ఠినుండుచు రాజ్యమును పాలించెను.

రాజమహేంద్రవరమున మరల 'త్యాగ సింహాసనము' నధిష్ఠించి సుఖముగనున్న ఆ దినములలో ఒకానొక సూర్య గ్రహణ నిమిత్తమున సమస్తభువనాశ్రయ బ్రహ్మ మహా రాజని ప్రసిద్ధుడైన బ్రాహ్మణ వీరపుంగవునకు భారద్వాజ గోత్రపవిత్రునకు అంకయ నామునకు, రాజరాజు మండగ్రామ మున విశేషమయిన వరి క్షేత్రములను దానముచేసెను. సమస్త భువనాశ్రయ బ్రహ్మ మహారాజనుటచేత అంకయ దండనాథుడుగావలయును. అత డాపస్తంబసూత్రుడు, శివ కుమారభట్టు పౌత్రుడు. స్వధర్మానుష్ఠానపరుడైన రామ దేవుని కుమారుడు. దత్తభూమి మండగ్రామమున కుత్తర దక్షిణదిశలందు రెండు ఖండములుగా నుండెను. వరి క్షేత్ర ముతోపాటు తోట భూమిని, ఊరిమధ్య నలువది మూరల మేర నొక గృహక్షేత్రమునుగూడ, రాజరాజు దానమిచ్చెను. మండగ్రామము నేడు, ఒక ప్రక్కగా జరిగి మండపేటయైనది. దక్షిణ దిశయందున్న దత్తపన్నస క్షేత్రమునకు సప్తగోదావరి దక్షిణపుసీమయని తెలుపబడినది. సప్త గోదావరమునేడచట కానరాదు. అది దక్షవాటి భీమేశ్వరునిగుడి ముంగిట చిన్న చెఱువువలె దుస్థితియందుండి దీనమై కాన్పించుచున్నది. కాని రాజరాజనరేంద్రుని కాలమున సప్త గోదావర మొక చిన్న నదివలె, గోదావరినుండిచీలిన యొక ప్రవాహమువలె నుండె

నట్లు మండశాసనము తెలుపుచున్నది. 'యాచనము మాడ' ఒక్కటి తప్ప, ఇతర కరములనన్నింటిని తొలగించి, క్షేత్రములను 'పన్నసగా' శాసించి, రాజరాజు దానముచేసెను. ఆనాటి రాజకీయ సాంఘిక వ్యవస్థలు తెలియని కారణమున 'పన్నస', 'యాచనముమాడ' అన నేమియు నర్థమగుటలేదు. మండశాసనకావ్యకర్త నన్నియభట్టు. అతడు శ. ౯౫౬ - ౯౬౬ సంవత్సరముల నడుమ శాసనాధికారియై, శాసనకావ్యములను వ్రాయుచుండినట్లూహింపవచ్చును. ఆనాటికి బేతనభట్టు మరణించి యుండిన కతన యీ పదవి నన్నియభట్టుకు వచ్చియుండును.

జగదేకమల్లుడు తనరాజ్యావసానకాలమున పదిమేండ్లించుమించుగా సమరకార్యములు మాని శాంతచిత్తుడై పాలించెను. రాజేంద్రచోళుడుకూడ తన కడపటి పదిసంవత్సరముల కాలము శాంతియుతముగ గడపి ప్రజాపాలనమొనరించెను. ఆకారణమున చోళ, కుంతలదేశములందు కూడ, శ. ౯౫౭ మొదలుకొని ౯౬౬ వఱకు (౧౦౩౫ - ౧౦౪౪) వేంగియందున్నట్లు శాంతి నెలకొనియుండెను. జగదేకమల్లుడు శ. ౯౬౫ కు సరియైన (జనవరి, ౧౦౪౪) స్వభాను సంవత్సరాంతమాసములందు మరణించెను. అంతకు రెండేండ్లకు పూర్వమునుండి యాతడు రాజ్యభారమును దనకుమారుడగు యువరాజ సోమేశ్వరునకు ఒప్పగించెను. తండ్రి మరణానంతరము సోమేశ్వరుడు శ. ౯౬౬ కు సరియైన తారణ సంవత్సర చైత్రమాసమున (ఏప్రిలు, ౧౦౪౪) త్రైలోక్యమల్ల, ఆహవమల్ల, అను రెండు బిరుదులతో కుంతలరాజ్యమున కభిషిక్తు

డయ్యెను. ఇంచుమించుగా నావేళనో, లేక తత్పూర్వమో మధురాంతకదేవుడుగూడ మరణించెను. అంతట తండ్రితో పాటు సమపాలకుడుగా రాజ్యమేలుచున్న రాజాధిరాజు చోళ రాజ్యమునకు ఏకచ్ఛత్రాధిపతియయ్యెను.

రాజాధిరాజ, సోమేశ్వరుల రాజ్యాధిరోహణముతో దక్షిణాపథమున నూతనయుగమొకటి మరల ప్రారంభ మయ్యెను. పదియేండ్లుగా చల్లారియున్న కర్ణాట చోళభూప తుల వైరానలము మరల మహోజ్జ్వలముగ ప్రజ్వరిల్లెను. దానివలన చోళ కుంతల కర్ణాటదేశములు ముప్పదియేండ్లు ఘూర్ణిల్లిపోయెను. అంతియగాదు, సేతునర్మదామధ్యస్థమైన అఖిలదక్షిణాపథమును తల్లడిల్లిపోయెను. ద్రమిళ కర్ణాటకుల యుద్ధకార్యములందు, చోళభూపతులతోడి బంధుత్వకారణ మున రాజరాజనరేంద్రుడు కూడ అనివార్యముగ పాల్గొన వలసివచ్చెను.

సింహాసన మధిష్ఠించిన మఱుచటి సంవత్సరము రాజాధి రాజు రణక్రియాభిరతుడై అశ్వమేధయాగమునుదలపెట్టెను. దక్షిణ దిగ్విజయ యాత్ర గావించి పాండ్య చేర దేశాధీశాదుల వందటి నదిమివచ్చెను. ఆహవమల్లు డాయశ్వమేధయాగము నకు విఘ్నము దలపెట్టెను. రాజాధిరాజుకు వేంగీశ్వరుడు బంధువును సహాయుడును గావున నాతనితోగూడ కయ్యము నకు కాలుసాచెను. ఆహవమల్లుడు తన మహాసామంతాధి పతులలో కడువృద్ధుడును, విశ్వాసముగల భృత్యుడునగు మహామండలేశ్వర శోభనరసును యువరాజుగా నభిషేకించి, యతనికి 'వేంగీపురవరేశ్వర' యను కీర్తిమాత్రాకరమైన

బిరుదును గట్టెను. పిమ్మట గంగవాడి కుత్తరముగానున్న బనవాసిరాజ్యమును సంరక్షించుకొనుటకు పయనమయ్యెను. ఆవృత్తాంతములు శ. ౯౬౭ కు సరియైన (౧౦౪౫ - ౪౬) సంవత్సరమున జరిగియుండెను. తత్పూర్వము రాజరాజ విష్ణువర్ధనుడు వేంగినుండి రాజేంద్రచోళదేవుని యవసానకాలమునకు చోళరాజధానికిబోయి నట్లూహింపవచ్చును. పిమ్మట తన మేనమఱది రాజాధిరాజు తలపెట్టిన అశ్వమేధయాగార్థము కొంతకాలము చోళదేశమందు నిలచిపోయి యాగతురంగమును సంరక్షించుకొఱకు గంగవాడిమీదుగా బనవాసి రాజ్యముమీదికి జైత్రయాత్ర చేసియుండును. రాజమహేంద్రుని జైత్రయాత్ర కారణముగా రాజాధిరాజు అశ్వమేధము నిర్విఘ్నముగా సాగెను. రాజరాజు అరివీరభయంకర శౌర్యుడై, సేనాపతి మతివర్మ సహాయమున ఆహవమల్లుని ప్రయత్నములను నిష్ఫలముజేసెను. కర్ణాటరాజ్యములోని దక్షిణభాగమును తల్లడమందజేసెను. ఆవృత్తాంతమంతయు కోగోడు శిలాశాసనము*వలన దెలియుచున్నది.

అశ్వమేధ యాగానంతరము రాజాధిరాజు పగబూని ఆహవమల్లునిపై దండెత్తిపోయెను. ఆతనిధాటికి నిలువజాలక ఆహవమల్లుడు వెనుకకు మరలెను. దక్షిణకవాటమగు కొల్లిపాక కనతిమారమున దారుణసంకులమయ్యెను. దండనాయకులు గండప్పయ్య గంగాధరయ్యలు రణక్షేత్రమున

మైసూరు ఆర్కియొలాజికల్ రిపోర్టు ౧౯౨౪ పుటలు ౧౯,౩౦, నెం. ౧౫ ఇందు శాసనపు తేది లేదుకాని, యాశాసన మీకాలమునాటి దనుట నిస్సంశయము.

కూలిరి. విక్రమాదిత్య, విజయాదిత్య, శాంగమయ్యాది సామంత దండనాయకులు భీతచిత్తులై పాఱిపోయిరి. కోప వేశమున రాజాధిరాజు కర్ణాటసేనలను తఱుముకొనుచు బోయెను. కొల్లిపాకదుర్గమును కర్ణాటసేనానులు ప్రవేశిం చుటచేత గాబోలు, నాదుర్గమును ముట్టడించి, చివరకు దానిని తగులపెట్టెను. కొల్లిపాక మైసూరు రాజ్యమున పశ్చిమదేశమందు మలె (మలయ) నాడున హొన్నూరు తాలూకా యందున్నది. ప్రసిద్ధ రేణుకశివాచార్యసంతతికి చెందినవారి శివమఠమున్న బాలెహొల్లియే కొల్లిపాక. బాలె హొల్లి కొల్లిపాకలు కలిసియేయున్నవి. గంగవాడిలోని కొల్లి పాకను తెలింగాణములోని కొల్లిపాకయనుట అసంగతము.

కొల్లిపాక ముట్టడికి పూర్వమందో, తరువాతనో రాజాధిరాజు కావేరిప్రాంతమున చాళుక్యసేనానిని, దండనా యక గణపతినోడించెను. 'వడగండ్లవాన' గురిసినరీతి చోళ సైన్యములు కర్ణాటులమీద రాళ్లవర్షమును గురిపించి, తల్లడ మందచేసెను. దండనాయక గణపతి ప్రాణభీతిచే పాఱిపోయెను. అంతట తన్నెదుర్కొనువారులేక, రాజాధిరాజు క్రూరుడై జైనవసతులను ధ్వంసముచేయుచు, స్త్రీ బాల బ్రాహ్మణ వధలుచేయుచు, వేదవతి, భద్రానదులు ప్రవహించు బన వాసిరాజ్యమును విధ్వస్తముగావించెను. పిదప తుంగభద్రను దాటిపోయి, బెలివోల, కసుకొడె సీమలను వశపఱచుకొనెను. అంతటితో తృప్తిజెందలే దతడు. త్రైలోక్యమల్ల సోమేశ్వరుడు బహుసేనాసమేతుడై తుంగభద్ర దక్షిణతటమున కంపిలి నగర మున నున్నాడని విని యాతనిమీదికి బోయెను. త్రైలోక్య

మల్లుడు వెనుకనుండివచ్చి, తలపడి, తనసేనలను చీకాకుపఱచునని సంశయించి, ముందుగా తానే యాతనిమీదకు నడచెను. కంపిలిచెంత రాజాధిరాజ సోమేశ్వరులకు ఘోరయుద్ధము జరిగెను. ఆహవమల్లుడు, చోళభూపతియొక్క ప్రచండ శౌర్యాగ్నికి నిలువజాలకపోయెను. గండ దినకర (గండరాదిత్య), నారాయణ, గణపతి, మధుసూదనాది మహాప్రసిద్ధులయిన కర్ణాటసేనానులు ఓడి వెన్నిచ్చి పలాయితులయిరి. రణకేళీదర్పితుడై రాజాధిరాజు, విజయోత్సాహమున కంపిలి నగరమును, చాళుక్యరాజప్రాసాదములను, ఆరామములను, తగులబెట్టి భస్మీపటలముగావించెను. విజయ పరంపరలతో సాగిన నారట్టపాడి దండయాత్ర మణిమంగళ దేవాలయశాసనమునకు బూర్వము శ. ౯౭౮ కు సరియైన వ్యయ సంవత్సర పూర్వార్ధమందు, (౧౦౪౬ వ సంవత్సరమున) జరిగియుండెను. రాజాధిరాజు వీరోగ్రాజివిజయుడై రణరంగమున వీరపట్టాభిషేకము గావించుకొని 'జయంగొండ చోళు' డను బిరుదమును స్వీకరించెను. పిమ్మట నిజరాజధానికి మరలివచ్చెను.

కంపిలి యుద్ధానంతరము రెండేండ్లు గడచునంతవఱకు త్రైలోక్యమల్లుడు రాజాధిరాజుకు ప్రతీకారము చేయజాలకపోయెను. అందుకొక కారణము ఉత్తరమున కొంకణముమీదికి భోజుని దండయాత్ర. జగదేకమల్లుని మరణానంతరము ఆహవమల్లునికి క్లేశము కలిగించు తలంపుతో, ప్రాత పగలను సాధించుకొనుటకు భోజుడు దండెత్తివచ్చెను. కర్ణాట భూపతి ముందుగా ధారానగరముమీదికి బోయి, యా నగరమును

గాల్చి, భోజుని పరాభవించెను. పిమ్మట చోళరాజ్యము మీదికి కోడగ్రాచువలె పగదీర్చుకొనుటకు బోయెను. రాజాధిరాజు సోమేశ్వరుని దండయాత్రకు సిద్ధపడియుండ లేదు. కర్ణాట దండనాథుడు మహా సామంతాధిపతి పొలకేశి త్రైలోక్యమల్లుని యాదేశానుసారము కాంచీపురమును బట్టుకొని నిరాకులుడై తగులబెట్టెను*. కాంచీపురము చోళభూపతులకు రెండవ రాజధాని. పొలకేశి మహా ప్రచండ దండనాయకుడు. బనవాసి ౧౨౦౦౦ రాజ్యమునకు పాలకుడు. అతడు చోళదండనాథులను నిర్జించి దిగ్విజయముచేసి రాజాధిరాజు బవవాసిరాజ్యమునకు చేసినదానికి ప్రతీకారముచేసివచ్చెను. పొలకేశి, చోళదేశ దండయాత్ర శ. ౯౭౦ కుసరిమైన (౧౦౪౮) సర్వధారి సంవత్సరమున నడిచినట్లు దోచును.

అంతట ఆహవమల్ల రాజాధిరాజులు యుద్ధములను విరమించి రెండేండ్లు శాంతించిరి. కాని రాజాధిరాజు ప్రతీకారవాంఛతో యుద్ధసన్నద్ధుడగుచుండెను. ఈసారి యాతడు ఎప్పటిరీతి బనవాసి రాజ్యముమీదుగా రట్టపాడిమీదికి జైత్రయాత్రసాగించెను. ఈ దండయాత్రయందు ఘోర సంగ్రామము లనేకములు జరిగెను. జయము కర్ణాటకులకును చోళుల

*. తానెయు కత్తి ముమ్మురియ గణ్ముర గొణ్డ పవక్కె చారతన్న
నాన్నెయ నెట్టు కాంచెయ నిరాకులడిం పొలకేసి సుట్ట క
ల్యాణద చోళసుట్టనెవలాంతె గజేన్ద్రనెయిది కొన్దవ
ఘూణ పరాక్రమం సుభటచోళనం ఆహవమల్ల భూభుజాం,

ఎ. క. సం. ౫. సొరాబు నెం. ౩౨౫.

కును సమముగా నుండెను. కాని కర్ణాటభూమియందు చోళ సైన్యములు గావించుచుండిన దారుణ క్రూరకార్యములు, త్రైలోక్యమల్లుని, కర్ణాట ప్రజలనుగూడ క్షోభిల్ల జేసెను. ఇంచుమించుగా నొక సంవత్సర మారీతిగా గడచిన పిమ్మట ఆహవమల్లుడు సంధి ప్రయత్నములు జేసెను. కాని యవి నిష్ఫలములయ్యెను. అతని రాయబారులను రాజాధిరాజు అవమానించి పంపెను. ఇంక యుద్ధము తప్పనిసరియయ్యెను. క్రమముగా చోళ సైన్యములు తుంగభద్రను దాటెను. మాల్యప్రభకు దక్షిణముగానున్న రాజ్య మలజడికొండెను. పల్లెలు, పట్టణములు, గ్రామములు, అగ్రహారములు, జైన, దేవ, బ్రాహ్మణక్షేత్రములు వరుసగా నన్నియు అగ్నిపాలయ్యెను. జీవనదులతో నిండిన పచ్చని దేశము ఎండి ఎడారియయ్యెను. ప్రజలను చోళులు దోచుకొనిరి. జైనవసతులు నిర్మూలితములయ్యెను. వాటి ధనవస్తుచయము సకలమును చోళుల యధీనమయ్యెను. రట్టపాడిని జయించి చోళ సామ్రాజ్యమున జేర్చు కార్యమునకు తమ్ముని రాజేంద్రదేవుని నియోగించి రాజాధిరాజు గంగయికొండచోళపురమునకు మరలి వచ్చెను. ఆ వృత్తాంతము శ. ౯౭౩వ సంవత్సర మార్గశీర్షమున (నవంబరు, ౧౦౫౧) జరిగెను.

అంతలో సోమేశ్వరుడు కొంత తెప్పరిల్లెను. తన రాజ్యమున చోళులు కాలూని పాదుకొనుచుండుటజూచి సహింపలేక పోయెను. సంగ్రామరంగమున తన్నెదిరించి పోరాడుట ధర్మముగాని, నిస్సహాయులయిన ప్రజలను బాధించుట నీతిగాదని రణక్రీడ కాహ్వానించెను. యుద్ధసన్నద్ధుడై

మతడు కొప్పంక్షేత్రమునకు నడచెను. కొప్పము కర్ణాట దేశమున నొక ప్రఖ్యాత శివక్షేత్రము. అచ్చటి మహాదేవునికి కొప్పేశ్వరుడనిపేరు. అదియొక తీర్థయాత్రాస్థలము. కృష్ణా స్రవంతి యచ్చట వంక తిరిగి ఉత్తరవాహినియై ప్రవహించును. ఆ వంపులో, నదికి దక్షిణతటమున నున్నది కొప్పము. ఆ తీర్థస్థలమున కించుక దూరమున దక్షిణమున దుగ్ధగంగ కృష్ణవేణిలో సంగమించును; ఉత్తరమున పంచగంగ కలియును. కొప్పము నేడు ఖద్రపురమని బరగుచున్నది. పుష్యమాసమున నచ్చట గొప్ప ఉత్సవము సాగుచుండును. రాజాధిరాజ, రాజేంద్రదేవులు యుద్ధమున కంగీకరించిరి. రాజాధిరాజు చోళదేశమునుండి బయలుదేరి వచ్చునంతలోపల కొప్పంవద్ద ఘోర సంగ్రామము జరిగెను.

రాజేంద్రదేవుడొక్కడే ఆహవమల్లునితో పోరాడెను. ఒక సమయమున జయలక్ష్మి సోమేశ్వరుని వరించునట్లుండెను. ఆతని వాడి శరములు పరంపరలై వచ్చి రాజేంద్రదేవుని శరీరమును గాయపఱచెను. ఆతడెక్కిన మదహస్తికి కుంభస్థలమున వాడి బాణములు గ్రుచ్చుకొనెను. ఆరాభహస్తి బాధ కోర్వజాలక రణరంగమును భీభత్సము చేసెను. మరి కొన్ని శరపరంపరలు, రాజేంద్రదేవుని మదహస్తిపైనున్న వీరులను గూల్చెను. రాజేంద్రదేవుని బాహువులు, ఊరువులు తీవ్రముగ గాయపడెను. అట్టి విపత్సమయమున, సర్వము నపజయముగా పరిణమించునట్లున్నవేళ, రాజేంద్రదేవుడావంతయు చలింపక ధైర్యమును విడనాడక విక్రమించి పోరాడెను. తన దళమున కొత్తిడి కలిగించుచున్న జయ

సింహుని బలములను దార్కొనెను. ఒక్క ముహూర్త ములోపల చోళులకు సంపూర్ణ నపజయముగా పరిణమించ వలసిన యీ ఘోర సంగ్రామము దైవవిధివలన అఖండ విజయముగా మారెను. ఆహవమల్లుని సోదరుడు జయ సింహుడు మరణించెను. ఆతనితోపాటు కాంచీపురమును నిరాకులుడై తగులబెట్టిన దండనాయకపాలకేశి, మహా సామంతాధిపతి దాసప్ప, అశోకయ్య, అటియప్ప, మొట్టయ, నన్నినొళంబపెమ్మాడిదేవాది మహాదండ నాయకులనేకులు మరణించిరి. ఆహవమల్లుడు సంపూర్ణముగనోడి రణరం గము వీడి పాఱిపోయెను. ఆతని యేనుగులను గుఱ్ఱము లను లొట్టియలను భూషణములను సకలవస్తుచయమును, అంతఃపుర స్త్రీల సహితముగ వశపఱచుకొనెను. క్షత గాత్రుడయ్యు, రక్తముతో శరీరమంతయు దడిసియున్న వేళ రాజేంద్రదేవుడు విజయోత్సాహమున రణస్థలిని వీరాభిషేక మును జరికొనెను. ఆ వృత్తాంతమంతయు శ. ౯౭౮ కు సరియైన నందన సంవత్సర జ్యేష్ఠ బహుళ త్రయోదశి (౨౫ గూడ మేయి, ౧౦౫౭) నాడు జరిగెను. ఆ దినమే రాజేంద్ర దేవుని నిజముగ పట్టాభిషేక దినముగూడ నయ్యెను.

కొప్పం యుద్ధము జరిగిన కొన్నాళ్లకు రాజాధిరాజు సైన్యసమేతుడై వచ్చి తమ్ముని గలిసికొనెను. సోదరు లిరువు రంతట వెన్నిచ్చి పాఱుచున్న సోమేశ్వరుని తఱుము కొని పోయిరి. కొప్పమునకు ముప్పదిమైళ్ల దూరమున పశ్చిమ దిశగా నున్న కొల్లాపురముచెంత సోమేశ్వరునితో నా చోళ భూపతులు యుద్ధమునకు తలపడిరి. కొల్లాపురమును ఆహవ

మల్లుఁ డాత్మ రక్షణార్థము ప్రవేశించి యుండును. చోళ భూపతులు కొల్లాపురమును దగ్ధము గావించి, సోమేశ్వరు నంమండి పాఱఁద్రోలిరి. విజయసూచకముగ నా నగరమున రాజేంద్రదేవుఁడు జయస్తంభమును నాటెను. చోళ సోదరు లంతటితో తనివినొందక, రాజధానియగు కల్యాణకటకమును ప్రవేశించిన త్రైలోక్యమును సంహరించుటకు ఉద్ధతులై, రణదర్పముతో బోయిరి. కల్యాణనగరము నిజాము రాజ్యములో నున్నది. ఆహవమల్లుఁడు కాంచీపురమును గాల్చినదానికి ప్రతిక్రియ గావించు తలంపుతో క్రోధావేశమున రాజాధిరాజు సోమేశ్వరుని మూఁడవమారు పరాభవించి, కళ్యాణ కటకిమును కసిదీర దగులబెట్టెను. తద్విజయసూచకముగ నచ్చట జయస్తంభమును బాతెను. సమరాంగణమున నభిషిక్తుఁడై విజయరాజేంద్రుఁడన్న బిరుదమును గ్రహించెను. ఆ వృత్తాంతము లన్నియు శ. ౯౭౫న శ్రావణ మాసమాదిగా (౧౦౫౩ జూలై, మొదలుకొని) నొక సంవత్సరములోపల జరిగెను. తన రాజ్యమును జొచ్చిన శత్రువులను బరిమార్చింగాని, తనకు క్షేమములేదని. ఆకులుఁడుగాక, శక్తిత్రయోపేతుఁడై, శౌర్యధనుఁడై ఆహవమల్లుఁడు రాజాధిరాజ, రాజేంద్రదేవులను మరల దారుణ రణక్రీడకు కొప్పముకు రావలసిన దని యాహ్వానించెను. విజయపరంపరలతో విజయదర్పముతో నుద్ధతుఁడై కేరుచున్న రాజాధిరాజు త్రైలోక్యమల్లుని యాహ్వాన మంగీకరించెను. ఈసారి యెట్లయిన చోళ భూపతి నోడించి, కర్ణాటభూమినుండి తఱుమవలయునని సోమేశ్వరుఁడు దృఢసంకల్పుఁడై ఆహవకార్యమును దల

పెట్టెను. రెండవ కొప్పం యుద్ధమునందు, చోళులకు సహాయముగ వేంగినుండి రాజరాజనరేంద్రుడుకూడ నరిగియుండెనని యూహింపవచ్చును. శ. ౯౭౫ కు సరియైన విజయ సంవత్సర ఆషాఢ ఆశ్వయుజమాసములమధ్య (౧౦౫౩, జూను-సెప్టెంబరు లనడుమ) నెప్పుడో కొప్పము రెండవ యుద్ధము జరిగెను. ఉభయబలముల దండనాయకులును నిష్ఠుర చేతస్కులై శత్రు రుధిరమును ద్రావ తలంపుతో ఘోరముగ బోరాడిరి. రాజాధిరాజ, సోమేశ్వరు లిరువురును సమరకార్య ప్రవర్తనలందు సమాన దక్షులు, శౌర్యమూర్తులు, వీరావతారులు, సమాన బలముగలవారు. రణదర్పముతో రాజాధిరాజు పోరాడుచుండ, జయమో మరణమో యని చలముతో సోమేశ్వరుడు సమరకార్యమును నడపెను. మొదటి యుద్ధమునందుకన్న అత్యధిక సాహసముతో ఆహవమల్లుడు, విజయరాజేంద్రుని ఎదుర్కొనెను. చోళభూపతి గాయపడి చీకాకు పడుచుండినవేళ, కుంతలేశ్వరుని సామంతుడొకడు మండలేశ్వర దడిగదేవు డుగ్రుడై, తన్నెదుర్కొనిన చోళ దండనాథుని సంహరించి, రాజాధిరా జధివసించియున్న మదగజముమీది కతి సాహసమున నుఱికి యాతని శిరమును తన ఖడ్గముతో నఱికి. రక్తసిక్త మయినదానిని గొనివచ్చి తన యేలికకు గానుకగా సమర్పించెను *. దడిగదేవుడు బలికులమున బుట్టిన బప్పుర వంశజుడు. ధర్మ మాండలికుడని

* ఎ. ఇ. సం. ౧౫. పుట. ౧౦౫. కె గుత్తగల కుడి శిలా శాసనము.

బేరొందినవాడు. కిసుకాడు డెబ్బది సీమకు పాలకుడు. రాజాధిరాజు దుర్మరణము చోళసైన్యములను తల్లడమందజేసెను. అది చోళభూపతికి అపజయ హేతువయ్యెను. మొదటి కొప్పం యుద్ధమునాడు కర్ణాటాధీశునికి బట్టిన దురవస్థ రెండవ కుప్పం యుద్ధమున చోళ భూమీశునకు బట్టెను. తల దాచుకొనుటకై రాజేంద్రదేవు డాహవరంగమును విడిచి పలాయితుడయ్యెను. ఆనాటి దారుణసంకులమును రాజాధిరాజు చావును కారణములుగా, రాజేంద్రదేవుడు బ్రతికిన పదియేండ్లును ఆహవమల్ల త్రైలోక్యమల్లునితో మరల యుద్ధమునకు దలపడలేదు. కాని కుంతలేశ్వర వేంగీశ్వరుల మధ్య వైరానలము రాజుకొనుచునే యుండెను. రాజరాజ దేవరపై కసి దీర్చుకొనుటకు సోమేశ్వరుడు తరుణమునకై వేచియుండెను.

రెండవ కొప్పంయుద్ధమున త్రైలోక్యమల్లుడు గొనిన అఖండవిజయమునకు కర్ణాట సామ్రాజ్య ప్రజ లానందముతో పొంగి పొరలిరి. ఆయుద్ధవిజయము మహాపర్వమ్ముగా, బ్రా..., సామంతులు, మహాసామంతులు, దండనాయకులు తమ తమ ఇష్ట దైవతములకు ధానధర్మములు జేసిరి. సోమేశ్వరుడు కొప్పం విడిచి, దక్షిణాభిముఖుడై వచ్చి తుంగభద్రనుదాటి, కంపిలి నగరమున బ్రవేశించెను. అది శ. ౯౭౫కు సరియైన విజయ సంవత్సర మార్గశీర్ష మాసమునకు (నవంబరు,౧౦౫౩) బూర్వము జరిగెను.

రెండవ కొప్పం యుద్ధానంతరము రాజరాజ విష్ణువర్ధనుడు కర్ణాటభూమియం దొక క్షణమైన నిలువజాలక రాజ

మహేంద్రవరమునకు మరలివచ్చెను. ఆహవమల్లునితోడి సమరకార్యములం దాతని ప్రధానులలో నొకడగు నారాయణభట్టు, రాజరాజుకు తోడ్పడియుండును. దాని కతడు నన్నియభట్టుకు సహాధ్యాయుడు నిష్టుడునగుట కారణము. అతని తనయ కుప్పమ దక్షారామ భీమేశున కఖండదీపము సమర్పించి, శాసనము వ్రాయించెను. ఆ వృత్తాంతము రెండవ కొప్పం యుద్ధము జరిగిన మూడెండ్లకు జరిగెను. ఆశాసనమం దామె "త్రైలోక్యమల్ల దేవరప్రధాని నారాయణభట్టు కూతురు"నని వ్రాయించెను. నందమ పూండి అగ్రహార పరిగృహీతయగు నారాయణభట్టు త్రైలోక్యమల్ల-ఆహవమల్లుని ప్రధానియనుటకు సందియములేదు. నందమపూండి శాసనకావ్యమున నారాయణభట్టు కవిత్వపాటవము మాత్రమే ప్రశంసింపబడినది గాని యాతని వాసస వంశముగాని, కుంతల చాళుక్యులయొద్ద వంశానుగతముగ మూడు తరములనుండి వచ్చుచున్న ప్రధానత్వమును నన్నియభట్టు లోకజ్ఞు డగుటవలన తడవియుండలేదు. దానికి కారణములు గలవు. రెండవ కొప్పం యుద్ధానంతరము, నారాయణభట్టు కర్ణాటదేశమున నుండ నిచ్చగొనక రాజమహేంద్రుని వెంట నంధ్రదేశమునకు వచ్చియుండెను. ఇతర కారణము లెట్లున్నను నన్నియభట్టు ప్రేరణముకూడ దానికి కారణమై యుండును. అర్థగాంభీర్యముతో నిండిన పదములతో "అనుష్ఠిత జగదుపకరణు"డని నన్నినారాయణుని నన్నియభట్టు నుతించినాడు. రాజరాజు కుపకరించుటవలన నారాయణభట్టు జగదుపకరణు డయ్యెను. నారాయణభట్టుకు రాజమహేంద్రుడు దుర్గమమైన రెండేఱుల

నడిమి విషయములోని నందమపూండి గ్రామమును శ. ౯౭౫ కు సరియైన విజయ సంవత్సర మార్గశీర్ష పూర్ణిమ నాడు (క్రీ॥ నవంబరు ౧౦౫౩) చంద్రగ్రహణ నిమిత్తమున సర్వకర పరిహారముగ అగ్రహారముచేసి ధారవోసెను. అది రాజదేవర ముప్పదిరెండవ విజయరాజ్య వర్షము. రెండవ కొప్పం యుద్ధముజరిగి యానాటి కై దారునెలలు గడచియుండెను.

# సప్తమ ప్రకరణము.

కొప్పం క్షేత్రమున జరిగిన రెండవ ఘోర సంగ్రామము రాజరాజనరేంద్రుని హృదయము నపరిమితముగ కలతపెట్టిన ట్లగపడును. ఆప్తబంధువులు, మిత్రులు, అనురక్తులైన ఆశ్రితులు పెక్కండ్రు రణరంగమున నిష్కారణముగా మరణించిరి. మహామహీ విభవరాజ్యసుఖోపభోగములనుభవించుచుండినను, కురుక్షేత్ర సంగ్రామము పాండవాగ్రజుని కట్లో, కొప్పం రెండవ యుద్ధ మా సత్యాశ్రయ కుల శేఖరునికి దారుణ దుఃఖమును కలిగించెను. యుధిష్ఠిరుని దుఃఖోపశాంతికి యదునందన వ్యాసాది బాంధవ ప్రముఖులైన నుండిరి. చాళుక్య చూడామణికి జనమేజయునికి వలె, విద్వజ్జన సమాజము తప్ప వేఱు ఆప్తులు గానరైరి. ఏకైక కుమారుడు, యువరాజ రాజేంద్రచోడు డాసమయమున రాజ రాజదేవర చెంత నుండెనో లేదో, ఉండిన ట్లగపడదు.

వ్యసన వివర్జితుడైన యా విష్ణువర్ధన భూపతి కానాటి ఆంధ్రదేశ సాంఘిక.మత,ధార్మిక పరిస్థితులుగూడ సంతాప హేతువులై అసంతృప్తికరములుగా నుండినట్లు గన్పట్టును. ఆంధ్రదేశము, కుబ్జ విష్ణువర్ధనుని కాలమునుండి వైదిక శైవాచారమునకు, బ్రాహ్మణ మతమునకు, వర్ణాశ్రమ ధర్మములకును, సన్మా కేంద్రము ఆటపట్టుగా నుండెను. చాళుక్య నృపాలురిచ్చిన దాన శాసనములన్నియు వేదవిప్రులను వర్ధిల్ల చేయుట కొసగబడెను. వేదవేదాంగములకు, ఉత్తర పూర్వ

మీమాంసలకు రెండింటికి నంధ్రభూమి యాకరమయ్యెను. కాని కుమారిల భట్టాచార్యు డంధ్రు డగుటవలన గాబోలు పూర్వమీమాంసకు ప్రజాదరణ మత్యధికమయ్యెను. అయినను ప్రజాబాహుళ్యమును శైవాచారము కంటె జినధర్మము విశేషముగ నాకర్షించెను. ఇమ్మడిచాళుక్యభీమునినాడు మహాసామంత దండనాథులు జైనశ్రావకులు రాజ చలుక్య కుల కల్యాణాభ్యుదయము కొఱకు బాసటయై నిలిచిరి. తత్ఫలితముగ కృతజ్ఞతతో ఇమ్మడి అమ్మరాజు విజయవాడయందు రెండు జైన వసతులను గట్టించి వాటి పోషణార్థము తెనాలి తాలూకాలోని పెద గాదెలవర్రు మహా గ్రామమును దేవభోగముగా సమర్పించెను. కాని వెంటనే ప్రాయశ్చిత్తార్థము, తన దేశికుడును లకులీశ పాశుపతాచార్యుడును అపర రుద్రమూర్తియునగు విద్యేశ్వరుని యా దేశానుసారమా మహానగరమందే, జీర్ణస్థితికి వచ్చిన ఉమామహేశ్వర (శ్రీ) మన్మహాదేవునికి మహోన్నత ప్రాసాదమును నిర్మించి యందు కాలాముఖ శివయోగులకొక మఠము నిర్మించి, వాటి పోషణార్థము నాలుగు గ్రామములను సమర్పించెను. ఇమ్మడి అమ్మరాజ రాజమహేంద్రునికి అనన్య రూపలావణ్యవతియైన భోగపత్ని, చామెకాంబ యని పట్టవర్ధని కుల సంజాతయుండెను. ఆమె సంప్రార్థనమున అత్తిలినాండు విషయములోని కలుచుంబఱ్ఱు గ్రామమును అడ్డకాలిగచ్ఛలోని వలహారిగణమున కాచార్యుడై అర్హనందియను జినమునికి సర్వలోకాశ్రయ జినభవనమునకు జెందిన సత్రార్థము సర్వ కరపరిహారముగా దాన

మిచ్చెను. మరియు కటకాధీశుడును మహా సామంతాధి పతియునగు దుగ్గరాజు విజ్ఞాపనముచేయగ, నాతడు ప్రతిష్ఠించిన కటకాభరణ జినాలయమునకు మలియంపూడి గ్రామటికను సర్వకర పరిహారముగా నొసగెను. కటకాభరణ జినాలయమునకు నందిగచ్ఛలోని యాపనీయసంఘమునకు జెందిన కోటిమడువ గణమున కధిపతియైన శ్రీ మాందిర దేవుడాచార్యుడు. కటకాభరణ జినాలయము వంగోలుకు సమీపముగానున్న ధర్మవరమందుండెను. ఆకాలమున జినమునులు 'సిద్ధాంత' పారద్రష్టలు, 'కేవల'జ్ఞాన నిధులు, తపోధనులు. కొందరు వారిలో ప్రతిహార్య (అణిమాదిసిద్ధులైన) మహిమ్నులు. మానవాతీతములైనవారి మహిమ కార్యములు చర్యలును, వారి జినధర్మోపదేశములకంటె నత్యధికముగ జనుల నాకర్షించుచుండెను. జైనధర్మము లుత్కృష్టములైనవి గావచ్చును కాని యవి వైదిక శైవాచారమునకును బ్రాహ్మణధర్మమునకు సాంఘిక వ్యవస్థలకును వ్యతిరిక్తములై యుండెను. జైనులు వేద నిరాకరణతత్పరులు. జైనయతుల మహిమలు జనులను మూఢ విశ్వాసముగలవారిగను, విద్యా సంస్కార విహీనులుగను జేయుచుండెను. జైనమత ధర్మతత్త్వము అన్యధర్మముల పట్ల అసహనము జూపుచుండెను. జైనుల అసహనము మూఢాచారములు, తరువాతికాలపు వీరశైవమునందు ప్రతిఫలించెను. అసహ్యకరములైన జైన ధర్మ సంప్రదాయములు కొన్ని వీరశైవమతమున నెలకొనెను. అయ్యవి క్రమముగా దేశోపద్రవ కారణములయ్యెను. విమలాదిత్యుని కాలమునాటికి జైనమతము మహావృక్షము

వలె మెదిగి వేళ్లు పాదుకొనెను. ఆదిని ఈశ్వరారాధన పరుడైయుండియు, కాలవశమున విమలాదిత్యుడు జైన శ్రావకుడగుట జైనధర్మవ్యాప్తికి ప్రబలహేతువయ్యెను. సర్వమత ధర్మములయందును సమదృష్టి జూపవలసినవా డయ్యును దేశోపద్రవ కారణమగుచున్న జైనధర్మము నరి కట్ట జాలకపోయెను. జనానురంజకముగ సమస్త వర్ణాశ్రమ ధర్మరక్షకుడు గాకపోయెను. అంతట దేశమున ధర్మవ్యవస్థలు సంఘవ్యవస్థలు తారుమారయ్యెను.

ఆరీతిగా వైదికధర్మోద్ధరణము బ్రాహ్మణ మతోద్ధర ణము దేశమందావశ్యకమయ్యెను. వేంగిచాళుక్యులు— వారొక్కరేకాదు, వాతాపి, కల్యాణ చాళుక్యులు, రాష్ట్ర కూటులు, ఆ నాలుగు రాజవంశములందును, చక్రవర్తు లందరును పరమబ్రహ్మణ్య పరమ భట్టారకులు, సమస్త వర్ణాశ్రమ ధర్మసంరక్షణ దీక్షాపరులు. సుక్షత్రియ వంశ సంజాతు లయిన తంజాపుర చోళులుకూడ పరమబ్రహ్మణ్యులు, వైదికాచార వర్ణాశ్రమ రక్షకులు. ఆదినుండియు బ్రాహ్మణ శ్రేష్ఠుల యాశ్రయమున, పెరిగిన రాజచాలుక్య వంశము వేదవిప్రులను, వారి యుత్తమధర్మములను, సంస్థలను పోషిం పకుండు టెట్లు సంభవింపగలదు? అయినను పౌరాణిక వంశ క్రమమును స్థిరముగ శాసన కావ్యరూపమున నిలిపిన విమ లాదిత్యుడే వేదములను, వేదవిహిత ధర్మమును త్యజించి, చిత్రముగ జైనుడయ్యెను. ఆనాటి దేశ కాలపరిస్థితులు దురూహ్యములు. ఉత్తమములైన వైదికవర్ణాశ్రమధర్మము లను, బ్రాహ్మణ మతమును ప్రజలందు వ్యాపింపజేయుటకు

పంచమవేదమని ప్రసిద్ధిగల మహాభారతమందలి యభిప్రాయ మును కావ్యరూపమున దేశభాషయందు వెలువరించుటకన్న వేఱుపాయము రాజరాజుకు తోపలేదు. లోకశ్రేయముకొఱకు భారత సంహితను కావ్యరూపముగా రచియించు టావశ్య కరమని యాత డూహించెను. వేంగీ మహాసామ్రాజ్యము నకు 'నాయకరత్నంబునుం బోని రాజమహేంద్రవర' విద్వజ్జ నుల యభిమతమును దెలిసికొనెను. వారి యనుమతిని బడ సెను. వైదికమార్గ పునరుద్ధరణకై వ్రాయబడవలసిన మహాభారతము రసాశ్రయమై యుండవలయునని కూడ నిశ్చ యించెను. ఆతని సంకల్పములు రెండు నొక్కసారి నెరవేర వలసియుండెను.

వరచళుక్యాన్వయాభరణుడైన రాజరాజు కావ్యగీత ప్రియుడు. వివేక చతురానన వాణీలీలాస్పదుడు, గావున స్వయముగ విద్వాంసుడు, కవి. అతడు విమలమతియై అనేక పురాణములను వినియుండెను. విష్ణువర్ధనుడు ప్రకాశముగా జగ త్పరిపూజ్యములైన యాశ్వరాగమములందు హృదయమును భక్తితో నిలిపియుండెను. పెక్కు పర్యాయములు విని యుండె నతడు మహాభారతమును. అయినను 'అనవరతము శ్రీ మహాభారతంబునందలి యభిప్రాయంబు విన నభిలాష పెద్దయైయుండె' నా ఆదిత్యకులచరిత్రునకు, చాళుక్యవంశ శిఖామణికి. 'భూదేవకులా భితర్పణ మహీయః ప్రీతియు భారత శ్రవణాసక్తియు, పార్వతీపతి పదాబ్జధ్యాన పూజా మహోత్సవమును, సంతత దానశీలతయు, శశ్వత్సాధు సాంగ త్యము నా రాజమహేంద్రునికి గరంబిష్టంబులై' యుండెను.

ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రమని, యధ్యాత్మవిదులు వేదాంత మని, నీతి విచక్షణులు నీతిశాస్త్రమని, కవివృషభులు మహా కావ్యమని, గొనియాడుచుండిన మహాభారత శ్రవణాభి రుచి యనిశము ఆతని కనేక కారణములవలన అత్యధిక ముగ నుండెను. సంస్కృత మహాభారతమును రాజరాజు బహుపర్యాయములు వినియుండియు మఱలమఱల విన గోరుచుండెను. 'బహుభాషల బహువిధముల బహుజన ముల వినుచు భారత బద్ధస్పృహులగువారికి నెప్పుడు బహు యాగఫలంబు పరమార్థమగు' నని యాతడు లోకమునకు చాటదలచెను. 'కపిలగోశతము నుత్తమ వేద విప్రులకు దాన మిచ్చిన సత్ఫలము భారత కథాశ్రవణమువలన లభించు'నని యాతడు విశ్వసించెను. కావున తన ప్రజకు ననుగున భారత కథాశ్రవణమత్యావశ్యకమని నిశ్చయించెను. అంతట నొక నాడు రాజమహేంద్రవరమున, 'సకలభువన లక్ష్మీవిలాస' నివాసమయిన రమ్యభర్మ హర్మ్యతలంబున కొలువుదీరి, విద్వ జ్జనంబులు పరివేష్టించియుండ, నన్నియభట్టును జూచి, విష్ణు సన్నిభుడైన వేదవ్యాసుడు జేసిన భారతమును, అందలి 'నిరూపితార్థ మేర్పడఁ దెనుఁగున రచియింపుము అత్యధిక మైన నీ ధీశక్తి తేటపడ'నని యాజ్ఞాపించెను. భారతమును తెనుగున రచియింపుమనుటలో రాజరాజనరేంద్రుని యభి ప్రాయము సుప్రకాశమగుచున్నది.

రాజరాజనరేంద్రుని యభిమతము ననుసరించి, కృష్ణ ద్వైపాయనముని విరచిత మహాభారత బద్ధానిరూపితార్థము తేటతెల్లమగునట్లు, భారతకథను తెనుగున రచించుట సామా

న్యమైనపని కాదు. మత్యమరాధిపాచార్యుడనని సత్ప్రతిభాభి యోగ్యుడనని, ఉభయభాషాకావ్య రచనాశోభితుడనని, లోకజ్ఞుడనని దన్ను దానెఱింగియు, వినయ గాంభీర్యములు తోప్రువచుచుండ రాజరాజాజ్ఞాపించిన కృతిరచన తనకు సాధ్యమాయని సంశయించను. సర్వ వేదశాస్త్రముల యశేష సారము బొందను, భారత భారతీ సముద్రముఁ దఱియంగను దుస్సాధ్యమైన పని. అయినను నన్నియభట్టు సంశయము వీడి, రాజమహేంద్రుని 'యనుమతంబున విద్వజ్జనుల యనుంగ్రహంబునం' 'దననేర్చువిధంబున' కావ్యంబు రచించె దనని ప్రారంభించెను.

తనుగున మహాభారతావతరణము కారణముగా రాజరాజనరేంద్రుఁడు శాశ్వతుడయ్యెను. వ్యాసాంజనేయాది పుణ్యాత్ములవలె, చిరంజీవియయ్యెను. సప్తసంతానములలో ఖిలముగాకుండునది కావ్యము. అట్టి కావ్యరచనచే నన్నియ, రాజరాజు లుభయులు అమరత్వము నొందిరి. అమరత్వమనుటవలన రామణీయకతతోపాటు, నిత్యయౌవ్వనమును నిత్యనవ్యతయు వారిభారతమునకు గలదని స్ఫురించును. నన్నియ భారతమంధ్రభాష జీవించియుండునంతకాలము నిలచియుండును. జగత్పరిపూరితమై పూర్ణచంద్రుని వెన్నెల కాంతివలె, రాజరాజుకీర్తియు నా చంద్రార్కము వెలుగుచుండును. నన్నియ నుడివిన్నట్లు, రాజరాజు విభ్రాజిత శుభ్రకీర్తి పరిపాండుర సర్వ దిగంతరాళుఁడు. రాజరాజ దేవర నన్నియభట్టారకుల కంధ్రదేశాభిమాన, అంధ్ర భాషాభిమానము లసదృశములు.

నన్నియభట్టు రచించిన కావ్యమును పరామర్శ చేయుట కిది తరుణముగాదు. అయినను ప్రశంస చేయఁదగిన వస్తువులను కొంచెమయినను ప్రశంసింపకుండ విడుచుటయు పాడిగాదు. నన్నియకృతి, సంస్కృతమున కనువాదమును, ఆంధ్రీకరణమును గాదు. అది కేవలము సర్వతంత్ర స్వతంత్ర కావ్యము. మహాభారతమునందలి యభిప్రాయము 'బద్ధ నిరూపితార్థమును' తేటపడునట్లు రచియింపబడిన కావ్యమది. మూలములోని పర్వానుక్రమణికను, పర్వసంగ్రహమును వరుసగా దెలిపియు నన్నియ వేఱువిధానము ననుసరించెను. పాండవ వంశానుక్రమమును మూలమం దున్నట్లుగాక, మార్చి చెప్పెను. మూలమున దుష్యంతుని కథ యయాతి వృత్తాంతమునకు బూర్వము తెలుపబడియుండ, నన్నియదానిని సమంజసముగ యయాతి వృత్తాంతము తరువాతజెప్పెను. ఇది చాళుక్యుల పౌరాణిక వంశక్రమమునం దున్నట్లున్నది. మూలమునం దనేక కథలు రెండుమూడు పర్యాయములు పౌనరుక్త్యమును బొందియున్నవి. అది కావ్య సౌష్టవ భంగహేతువు. నన్నియ కొన్ని కథలను విడిచెను. చెప్పిన కథలను రెండవసారి చెప్పలేదు. ఒక కథను చెప్పిన రీతిగా నింకొక కథను చెప్పలేదు. నన్నియ కళానైపుణ్యమందు గన్పట్టుచుండును. నన్నియకథా సంవిధాన మతి హృద్యమై మూలమునకు వన్నె తెచ్చుచుండును. 'ప్రసన్న కథా కలితార్థయుక్తి' నన్నియ కథాకథనమునందు ప్రతిఫలించుచుండును. అతడు శబ్దబ్రహ్మవేత్త, శబ్దశాసనుడు. అతని రచనసహజమును, అకృత్రిమమును అనన్య సామాన్య

మునై వెలుగుచుండును. అతని రచన సంస్కృతపద భూయిష్ఠమై యున్నను మనోహరమై, అతి సులభగ్రాహ్యమై యొప్పుచుండును. నన్నయకు సంస్కృత సంప్రదాయము, సంస్కృత భాషాన్వయములు ఎంత ప్రీతికరములో, అంతకంటె అధికతరముగ ప్రియములైనవి తెనుగు జాతీయములు, నన్నయకు సహజమైన గాంభీర్యము నాతని సాంస్కృతికాన్వయములందు ప్రకాశించుచుండును. ఆతనికి బహువ్రీహి సమాసములు వాడుట మిక్కిలి యిష్టము. సంస్కృత పదము లాతని కవితయందు గాంభీర్యమును స్ఫురింపజేయుచుండునుగాని ఆడంబరత్వమునుగాని క్లేశార్థములనుగాని సూచింపవు. ఆతని కవనమందు అర్థాలంకారములు మెండు. "నానారుచిరార్థ సూక్తినిధి'యయ్యె నాకారణముచే నన్నయ. రాజమహేంద్ర కవీంద్ర సమాజ విద్వజ్జనులకు ధ్వనిప్రధానమైన కవిత్వమం దభిమానము. అది ఆంధ్రదేశ సంప్రదాయము. రాజమహేంద్ర కవీంద్రసమాజము సునిశ్చితముగ నేర్పరించిన కవితామార్గమది. ఆసంప్రదాయమును నైదువందల సంవత్సరములకు తరువాత 'రమణీయార్థ ప్రతిపాదకశ్శబ్దః కావ్య' మ్మని జగన్నాథపండితరాయ లాసేతుహిమాచలపర్యంతము విస్తరింపజేసెను. ఆసంప్రదాయ మాంధ్రదేశమున, చాళుక్య రాజధానియందు, నన్నయకు పూర్వము ఇన్నూరేండ్లనాడు గుణగవిజయాదిత్యుని కాలమున పాదుకొనెను. నన్నయభట్టుకు పూర్ణోపమలయందు అసమాన ప్రీతి. శ్లేష యతని కవనమందు ఏరెండుమూడుచోట్లనో అపురూపముగ గాన

వచ్చును. శబ్దశ్లేష రాజమహేంద్రకవీంద్ర సమాజమున కాదరణీయముగా నుల్లసిల్లుచుండెను.

నన్నయ కవిత్వమందు గాంభీర్యము జీవకళ. అట్టిదింకేకవియందును గానరాదు. ఎఱ్ఱనయొక్కడు, 'తద్రచనయకా' యని నన్నయభట్టుననుకరించి, సిద్ధుడైనాడు. నన్నయశైలి అర్థపుష్టియు, మాధుర్యమును మనోరహత్వముగలిగి పరిపక్వస్థితికి వచ్చినట్లుండును. ఆది సభా పర్వములందుకంటెను ఆరణ్యపర్వమం దీగుణమధికము. ప్రకృతివర్ణనమందు, పాత్రసంభాషణలందు. పాత్రపోషణమందు నన్నయ అగ్రగణ్యుడు. ఆతనికాతడేసాటి. ఆతనిపాత్రలందాత్మనిగ్రహముట్టిపడుచుండును. నన్నయ పద్యరచనకువలె గద్యరచనకు గురువాద్యుడు. నన్నయవలె గద్య వ్రాసిన దొక్క శ్రీనాథుడు.

వాఙ్మయ దురంధరుడు తనకిష్టుడు నైన నారాయణభట్టు తోడయి నిర్వహింప నన్నయభట్టు భారతమును రచించెను. నారాయణభట్టు తనకు చేసిన సాహాయ్యమును భారతోపమతో నర్థగాంభీర్యముతో తెలిపినాడు నన్నయభట్టు. ఆనాటి రాజమహేంద్రపుర కవీంద్రసమాజమున కధ్యక్షుడు నన్నయ. రాజరాజనరేంద్రున కనురక్తుడాతడు. ఆతడు రచించినకావ్యము, విద్వజ్జనుల కంగీగారముకానుండవలెను. 'సారమతిం గవీంద్రులు ప్రసన్న కథాకలితార్థయుక్తిలో నారయ' వలెను. ఇతరు లక్షరరమ్యతనాదరింపవలెను. అతడు 'నానారుచిరార్థసూక్తినిధియై కావ్యరచనాబంధురుడు' కావలెను. అందులకాతడు నిశితపరీక్షకులయిన రాజమహేంద్రవర విద్వత్సభాంతర సరసీవనంబుల 'ముదంబానరం' గొని

యాడెను. విద్వజ్జనముల యనుగ్రహమును యభిమతమును గోరెను. నారాయణభట్టు సహాయముగోరి దానిని బడయ గల్గెను. అతడును అభిమతస్థితి దోడయ్యెను. నన్నియ కవితా రచనయందప్రతిమానుడయ్యెను. పాండిత్యమున శ్రీనాథునికి నన్నియ సమానుడు కాకపోవచ్చును. కాని నన్నపార్యుడు నారాయణభట్టు సహాయమున విద్వజ్జనుల పరీక్షకు నిలచి కృతినించి పాలచెను. శ్రీనాథుడు తనకవితామార్గమున కట్టి ప్రశస్తినికోరలేదు. ఆతడు రాజమహేంద్రపుర విద్వజ్జనులు పండితమ్మన్యులని, వారి పరీక్ష మాత్సర్యపూరిత మని దూషించి ధిక్కారమును జూపెను.

నన్నియభట్టునకు బూర్వము తెనుగుకవు లుండిరి. ఉండిరనుటకు నన్నియ నుతించిన రాజమహేంద్ర కవీంద్ర సమాజము సాక్ష్యము. వారిలో సారమతులైనవారును గలరు. వారు రచించిన కావ్యములు తెనుగుభాషయందు కనబడ కుండుటకు గారణము చింత్యము. నన్నియభట్టే తెలిపినాడు తానుభయభాషాకావ్య రచనాభిశోభితుడనని. అట్టివారెంద రుండిరో! కోరుమిల్లి శాసనకావ్యకర్త బేతనభట్టొ కడు సంస్కృతాంధ్రకవిగా గన్పట్టును. అతడు రాచియ పెద్దేరి పౌత్రుడు. విమలాదిత్యుని యాస్థానవిద్వత్కవియైన భీమన భట్టుపుత్రుడు. భీమనభట్టు, బేతనభట్టలు మహాకవులలో నెన్నదగినవారు. కోరుమిల్లి శాసనమంధ్రభాషా కావ్యరచనా ప్రవాహమందొక ముఖ్యఘట్టము. తెనుగున కవిత్వము నన్నియకు బూర్వము కనీసము మున్నూరేండ్లక్రిందట ప్రారంభ మయ్యెను. పండరంగని ధర్మవరం పద్యశాసనము, తరువాత

కాలపు యుద్ధమల్లుని బెజవాడశాసనమును ఆంధ్రభాషలో కావ్యరచన యుండినట్లు సూచించుచున్నవి, తెనుగుననున్న యతిప్రాస నియమములు, వృత్తరీతులు సంస్కృతకవుల నాకర్షించెను. ప్రాసనియమముతో నుత్పలమాల యొకటి సంస్కృతమున గుణగ విజయాదిత్యుని సాతలూరు తామ్ర శాసనమున గానవచ్చుచున్నది*. బేతనభట్టు కోరుమిల్యగ్రహారప్రతిగృహీతను అంత్యాను ప్రాసనియములతో గూడిన దేశిరగడ ఛందస్సున వర్ణించెను. అదియొక అపూర్వవిషయము. నారాయణభట్టు కూడ ఆంధ్రభాషను కవితజెప్ప నేర్చిన కవి. నన్నియకుబూర్వము బుట్టిన కావ్యములకు ప్రజాదరణయు, రాజపోషణయు రెండును లేని కారణమున నాశనమొందియుండును. జైనధర్మము నానాటికి ప్రజాదరణమును గోల్పోవుటవలన జినధర్మోద్ధారకములయిన గ్రంథములు, ప్రతులు వ్రాయబడక నశించియుండును. నన్నియభట్టునకు బూర్వము తెనుగుకవులు 'గాసటబీసటే చదివి గాథలు' త్రవ్వుచు కావ్యములు రచించిరి. 'గాసటబీసట గాథలు' జైనుల వ్రతకథలును బౌద్ధుల జాతకథలును గావచ్చును. వ్యాసముని ప్రణీతపరమార్థముగల భారతము రాజరాజుయనుగ్రహమున, ఆంధ్రుల యదృష్టవశమున శాశ్వతమయ్యెను.

నన్నియభట్టు రాజరాజుకు కులబ్రాహ్మణుడు, ఆ రాజ

---

*చ. అరినృప వాజివారణ పదాతిమహాభ్ర విరామమారుతః
పరకరివారి సుస్థితాశిఖరుచి ప్రవినాశన భానుసన్నిభః
గురుతరదీన భాగవత మానవమానిత కల్పపాదపః
వర కరిగల్ల భూమిప భుజాసిరిహాజి భువిప్రహాసతే.

మహేంద్రున కనురక్తుడు. అవిరళ జపహోమ తత్పరుడు. విపుల శబ్దశాసనుడు. వేదాధ్యయన సంపన్నుడు. బ్రహ్మాండాది నానాపురాణ విజ్ఞాననిరతుడు. ఆపస్తంబసూత్రుడు. ముద్గల గోత్రజాతుడు. వినుతి కెక్కిన అకలంకచరిత్రుడు. లోకజ్ఞుడు. ఉభయభాషాకావ్యరచనాభిశోభితు డతడు. అతడు సత్ప్రతిభాభియోగ్యుడు. నిత్యసత్యవచనుడు. మతి విశేషమున బృహస్పతికి సమానమైనవా డతడు. సుజనుడు, పాత్రు డతడు. అత్యధిక వినయసంపన్నుడు. మాత్సర్య మావంతయు లేని యుత్తముడు. ఆత్మ వర్ణనము నుపుఁగూడ ప్రథమ పురుషముగా నితరు లెవ్వరో తనగురించి తెలుపుచున్నట్లు వ్రాసియున్నాడు. ఆవర్ణనయం దతిశయోక్తి గానరాదు. అహంభావము లేదు. అతడు మహామహితాత్ముడు, అతడను రాజరాజువలె సకల సుకవిజన సేవ్యుడు. వైశంపాయనునివలె సమస్త జనపాల సభాజనాభి యోగ్యుడతడు. అక్కయజ్వ నుతించిన ట్లతడు మహామహితాత్ముడు. భద్రకుంజరము వంటివా డతడు ఎఱ్ఱాప్రెగ్గడ చెప్పిన ట్లి, అట్టి మహనీయునిగూర్చి వ్రాసి యాతనికి దుష్కీర్తి నాపాదించిన గాథ లవిశ్వసనీయములు.

నన్నియభట్టు రాజరాజ నరేంద్రునకు రాజపురోహితుడు గాడు. చాలుక్య రాజ్యాంగమున పురోహితుడు. పంచ ప్రధానులలో రెండవవాడు. మంత్రి, పురోహిత, సేనాపతిలు దౌవారిక, యువరాజు పంచప్రధానులు. పురోహితుడు వేఱు, కులబ్రాహ్మణుడు వేఱు. చాళుక్యరాజ్యాంగమున పురోహితుడొక మంత్రి. నన్నియ కులబ్రాహ్మణుడు. రాజ

చాళుక్య కులమున నరపాలురకు కులబ్రాహ్మణు లుండుట చాళుక్య వంశాచారము. ఇమ్మడి అమ్మరాజ విజయాదిత్యునికి తాడిపఱ్ఱువాస్తవ్యుడును, ఆపస్తంబ సూత్రుడును, కౌండిన్య గోత్రుడునగు కులబ్రాహ్మణు డొక డుండెను. వంశ మవిచ్ఛిన్నముగ వర్ధిల్లుటకు క్షత్ర ధర్మ మొకటి భారతకాలము నాటినుండి యాచరణయం దుండెను. అన్వయాభివృద్ధికి భూసురోత్తములు క్షత్రియ రాజ పుత్రికలయందు ధర్మవిధి సంతతి నిలువుచుండిరి. అట్టి భూసురోత్తములు కుల బ్రాహ్మణులు. చాలుక్యవంశ సంజాతలను కులబ్రాహ్మణుల కిచ్చి వారివలన కలిగిన సంతతితో, చాలుక్యవంశము నిలుపను, సంబంధ బాంధవ్యములను గలుపుకొనుచుండిరి. కుల బ్రాహ్మణుల నియమించి వారికి యాడుబిడ్డలనిచ్చి వివాహము చేయు నాచారము కాకతీయ యుగాంతము వఱకు ఆంధ్ర దేశమున వర్ధిల్లెను. తిరువాన్కూరు కొచ్చి రాజ్యములందు నేటికిని రాజకుమార్తెలను నంబూదరులను విప్రోత్తమ వంశీయుల కిచ్చి యుద్వాహ మొనరించుటయు, వారిసంతతిని రాజ్యస్థులను జేయుటయు నాచారముగా నున్నది. బ్రాహ్మణులకు అనులోమ వివాహములు ధర్మశాస్త్ర సమ్మతము గావున కులబ్రాహ్మణులు క్షత్రియపత్నులతో పాటు స్వకులాంగనలను గూడ పెండ్లియాడిరి. కులబ్రాహ్మణులు సాధారణగా నున్నత రాజకీయ పదవులం దుండిరి. అట్టి కులబ్రాహ్మణులు వైదికులు గారు. వారు లోకజ్ఞులు, కవులు, అప్పు డప్పుడు కార్యఖడ్గముల నెఱపిన దక్షులు.

మహాభారత రచనారంభము నందమపూండి శాసన కాలము తరువాత జరిగెను. నారాయణ భట్టు కర్ణాటదేశమును విడచి వేంగియందు సుస్థిర నివాసుడగుట పూర్వమే రాజరాజుకు భారతము తెనుగున రచియింపతలపు పుట్టియుండును. కాని కొప్పం యుద్ధానంతరమే భారతరచనారంభము, శ. ౯౭౬ కు సరియైన జయ సంవత్సరమున (౧౦౫౪), జరిగియుండును. ఆంధ్రభాష దురదృష్టవశమున నన్నియభట్టు భారతము సరిగా మూడు పర్వములైన ముగిసీ ముగియకుండ మరణించెను. నిజముగా నతడు మూడు పర్వములు పూర్తిగా వ్రాసెనో లేదో గాని తిక్కన సోమయాజి మాత్రము వ్రాసినట్లు తెలిపినాడు. తిక్కన సోమయాజి నన్నియభట్టుకు ఇన్నూరేండ్ల తరువాతివాడు. తిక్కనకు డెబ్బదియేండ్లు తరువాతివాడు ఎఱ్ఱాప్రెగ్గడ. అరణ్యపర్వమును వ్రాయుచు నన్నియభట్టు అకస్మాత్తుగ మరణించియుండును, కావున వది అసంపూర్తిగ నుండిపోయెను. ఆదరణీయసారము లేనిది, హృదయాహ్లాదకరముగానిది, నానారసాభ్యుదయోల్లాసియును గానిది శేషించిన అరణ్యపర్వము. కావున ముందుగా నట్టి భాగమును వ్రాసి మహాభారతమును సాంతముగ రచింపబూనుటకంటె, ఆదరణీయ సారముగల్గి హృదయాహ్లాదకరమగుచు నానారసాభ్యుదయోల్లాసియైన విరాటపర్వమునుండి ప్రారంభించి తుదిముట్ట మిగిలిన పదిహేను పర్వములను రచించుట బుధుల కాదరణీయమని తలచి తిక్కన సోమయాజి యట్లు గావించెను. అసంపూర్తిగ నున్న భారతమును సంపూర్ణము చేయదలచి, మహనీయుడగు ఎఱ్ఱాప్రెగ్గడ నన్నియ విడచిన

భాగమును లోకైక విదుడైన యీ మహాకవీంద్రుని సరస సారస్వతాంశప్రశస్తి తన్ను జెందుటవలన సాధుజన హార్ష సిద్ధి గోరి తత్కవితారీతియు గొంత దోప తద్రచనయకా పూరించెను. ఉత్తముడైన నన్నియభట్టును గురించి అసార మతులు గల్పించిన కథ లనేకములు గలవు. వాటిని విశ్వ సించు టవివేకము. నన్నియభట్టు భారత కావ్యరచన ప్రారంభించిన రెండు మూడు సంవత్సరముల లోపల దివం గతుడై యుండును. ఆనాటి దేశకాల పరిస్థితులవలన, దైవ మశ్చేష్టతవలన మహాభారతము పూర్తిగా రచింప బడ కయ్యెను. విద్యా విలాసగోష్ఠిని పేరోలగమున సుఖోపవిష్టు డయి ఇష్టకథా వినోదముల తేలియాడుటకు రాజరాజ నరేంద్రునకు అంతట నుండి తీరిక కూడ లేకపోయెను.

కావ్యరూపమున అమరత్వము నొందిన రాజరాజ నరేంద్రుని రూప లావణ్యాది గుణములు నతి మనోహరముగ చిత్రించినాడు నన్నియ.రాజమహేంద్రుడు మన్మథాకారసుంద రుడు. ఆతని చలుక్యమన్మథుడని, కుమారవిద్యాధరుడని భువనైక సుందరుడని, రాజ మనోహరుడని యాతని రూపును నన్నియభట్టు గొనియాడెను. అతడు చళుక్యాభరణుడని, ఉత్తమచాళుక్యుడని, సమస్త భువనాశ్రయుడని, మాటి మాటికి విమలాదిత్యాగ్ర తనూజుడని నుడివెను. రాజరాజు దేవరకు రాజ చలుక్య వంశమున బుట్టిన కారణమున చలుక్య కుల తిలకుడని, సత్యాశ్రయ కుల తిలకుడని, అభి మానముగల వాడని సూచించుచు అభిమాన మహార్ణవుడని ప్రశంస చేసెను. భారత కావ్యమున నొక్కసారి గూడ రాజ

రాజుతల్లి కుందవాంబాదేవి ప్రసక్తి గానరాదు. చోళభూపతుల రాజనీతిచాళుక్యచూడామణికి మాతవు గాకుండెకాబోలు. అతడు వ్యసన వివర్జితుడై ఆదిక్షత్రనిభుడై ధర్మ నిబద్ధ దయార్ద్రబుద్ధియై జనానురంజకముగ పాలించెను. అతడు సూరినిధానము, గుణనిధి, కరుణారస బంధురుడు, దానవినోది. శిష్టపరిపాలనాసక్తుడు, భూసురోత్తముల ఆశీఃపరంపరావర్ధిత నిత్యోదయుడు. మిత్ర, విద్వజ్జన బాంధవాంభోజములకు సూర్యునివంటివాడు. రాజమార్తాండుడు. రాజసూరి సభాంతరములందు కొనియాడ బడుచుండిన సద్గుణములరాశి యతడు. రాజనారాయణ బిరుదాంచితుడు. అతడు ధర్మశీలుడు. అర్థానర్థవిదుడు, రాజవిద్యాధరుడు. సకలకార్య సమర్థుడు. పరాక్రమ ప్రణయ వశీకృతాఖిల రాజన్యుడు. అత డస్త్రశస్త్రవిద్యా కోవిదుడు. అరివిద్రావణ సాహసికుడు. రణముల నతిక్రూరుడు. వీరావతారుడు. మందర స్థైర్యుడు. మనుమార్గ కంఠీరవుడు. అనంత విలాసనమున, ఆశ్రితపోషణమున, మనీషివిద్యాశ్రమ తత్త్వ విత్తమున, దాన గుణాభిరతియందు, సమస్త వర్ణాశ్రమ ధర్మరక్షణ మహామహిమయందు, ఆదిరాజ నిభు డతడు. జగద్విదిత త్రిభువనాంకుశనామ్ముడతడు, సమస్త భువనాశ్రయుడు, సకల లోకాశ్రయు డతడు. విప్రకులముపై నాతని కభిమానము. అత డగ్రజన్ముల కనుగ్రహించి యగ్రహారము లనేకము లొసగెను. అతడు పరమ మాహేశ్వరుడు. పార్వతీ పతి పదాబ్జధ్యాన పూజాతత్పరుడు. ఎల్లప్పుడు సాధుసాంగత్యము నభిలషించు ధర్మశీలుడు, పరమబ్రహ్మణ్యుడతడు.

ఎలకూచి బాలసరస్వతియో, మరి యెవ్వరో ఆంధ్ర శబ్ద చింతామణిని రచియించి, దాని కర్తృత్వమును నన్ని పార్యునకు ముడివెట్టెను. ఆ లక్షణ గ్రంథమునకు ప్రాశస్త్యము గలిగించు తలంపుతో నట్లు గావించెను. నన్నియ గతించిన ఐదారేండ్లవఱకు దాని స్థితి యెవ్వరికిని దెలియకుండుటకు గారణము దెలుపుటకై సారంగధరుని కథను గల్పించి దానికి ముడివెట్టెను. నన్నియభట్టు వ్రాయలే దాంధ్ర శబ్ద చింతామణిని. దాని నతడు రాజరాజనరేంద్రుని కుమారునికి, సారంగధరున కుపదేశింపను లేదు. రాజరాజ విష్ణువర్ధనునకు అమ్మంగదేవి అగ్రమహిషి. ఆ దంపతులకు రాజేంద్రచోడదేవుడను కుమారుడును, కుందవాంబ యని కుమార్తెయు బుట్టిరి. కుమార రాజేంద్రచోడదేవుడు యువరాజపట్టము నొంది, రాజరాజు మరణానంతరము కొన్నియేండ్లకు చాళుక్య, చోళ, సామ్రాజ్యములకు కర్తయై, చక్రవర్తియై, కులోత్తుంగ చోళదేవుడను పేరుతో ఏబది యేండ్లు సకలాంధ్ర, ద్రావిడ, దక్షిణకర్ణాటక దేశములను పాలించెను. ఇంచుమించుగా డెబ్బది యారేండ్లు జీవించెను. అమ్మంగదేవి గాక రాజరాజు కితర రాణులుండిరి, కాని వారి పేరులుగాని, వారి సంతతిగాని తెలియదు. రాజరాజ దేవరకు సారంగధరుడను తనయుడు లేడు. ఆవృత్తాంత మెంత అసత్యమో, ఆంధ్రశబ్ద చింతామణి నన్నయ రచించినాడనుటకూడ నంతటి యసత్యము. సారంగధరుని కథ వంటిది బౌద్ధ జాతక కథలలో మహాపదుమ జాతక కథయని యొకటికలదు. రాజమహేంద్రవరమున ప్రాచీనకాలము నా డొక బౌద్ధ సంఘారామముండెను.

ఆ సంఘారామముండిన గుట్టకు నేడు సారంగధరుని మెట్ట యని పేరు. దేశమం దచ్చటచ్చట కొన్ని స్థలములకు బౌద్ధ జాతక కథలను ముడిపెట్టి, బౌద్ధధర్మము ప్రజాదరణ బడయుటకొఱకు బౌద్ధక్షేత్రములను నెలకొల్పి యచ్చట సంఘారామ చైత్య స్తూపాముల వద్ద భిక్షువులు నిర్మించి యుండిరి. పిఠాపురము, చేజెర్ల మొదలగు నవి స్థలము లట్టివే. రాజమహేంద్రవరమున మహాపదుమజాతక కథతో ముడి వడిన బౌద్ధసంఘారామ మొకటి వెలసి యుండెను. బౌద్ధ ధర్మము దేశమున నశించిన పిదప పదునేనవ శతాబ్దాంతమున నా సంఘారామము శివయోగుల కాశ్రయ మిచ్చెను. మహా పదుమ జాతక కథ యంతట శివమహిమను దెలుపు నవ నాథ చరిత్రమై వెలసెను. రెంటను కథ యొక్కటియ. మహాపద్ముడు నవనాథచరిత్రయందు సారంగధరుడుగా మారెను. నవనాథ చరిత్ర కారణముగా చాళుక్య రాజ రాజనరేంద్రునికి సారంగధరుడు కుమారుడయ్యెను. తరువాత కథయచ్చట పాదుకొనెను. ఆవిధముగా నన్నియ రాజరాజ నరేంద్రులు దుర్యశము ననుభవించిరి.

నారాయణభట్టు, వాఙ్మయ దురంధరుడు, తనకిష్టుడు సహాధ్యాయుడు నైనవాడభిమతస్థితి దోడయి నిర్వహింప నన్నియభట్టు భారతకావ్యమువ్రాసెను. భారతోపమదెచ్చి, వ్యాసునకు నారాయణుడట్లు, నారాయణభట్టు తనకుసాహాయ్య మొనరించినాడని తెలిపెను. ఆయుపమయందు నిందాస్తుత్య లంకారములేదు! నన్నియభట్టు భారతకావ్యము రచించు చుండ నారాయణ భట్టారక కృష్ణునివలె జూచుచుండెనని

యందు ధ్వనియు గానము. అందలి యపురూపధ్వని విశేష మెట్టిదో నన్నియభట్టే నందమపూండిశాసనమున స్ఫురింప జేసెను. నన్నియభట్టు రచించుచుండిన భారతకావ్యమును రాజరాజు ఎప్పటికప్పుడు అభిలాషతో, విద్వజ్జనపరి వృతుడై వినుచుండెను. విద్వజ్జనుల యనుగ్రహమును ఆదరమును బడయుచు, వారి నిశితపరిశీలనకు నిలువబడి, నన్నియ భట్టు కావ్యరచన సాగించుచుండెను. విద్వత్కవీంద్రుల నిశిత పరీక్ష మహాసంగ్రామము వంటిది. అందు విజయుడై నెలువ డుటకు నారాయణభట్టు తోడ్పడుచుండెను. నన్నపార్యుని కావ్యములోని గుణములను, అతని కావ్యరచనావిధానమును, నారాయణభట్టు సమర్థించుచుండెను. ఆక్షేపించిన విద్వజ్జనుల కుచితరీతిని ప్రత్యుత్తరమిచ్చుచు, వారి విమర్శనలు నిస్సార ములని జూపుచుండెను. ఆవిధముగా నన్నియభట్టుకు భారత కావ్యరచనమందు జయము గూర్చెను.

నారాయణభట్టు వానసవంశసంభూతుడు. హారీత గోత్రు డాపస్తంబ సూత్రుడు. వానసవంశమందు వసిష్ఠ, కాశ్యప, హారీతాది మూడునాలుగు గోత్రములవారుండిరి. వానసశబ్దము వనారస పదమునుండి యుద్భవించినట్లు దోచును. వనారస, యని యనుటవలన నాబ్రాహ్మణులు లోలుత కాశీప్రాంతమునుండి కర్ణాటభూమికి వలసవచ్చినవారుగా గన్పట్టుదురు. క్రమముగా వానసవంశజు లంధ్ర దేశమునకు గూడ ప్రాకిరి. వానసవంశములు దక్షిణాపథమున కెప్పుడే తించి యుండెరో ెలియరాదు; కాని కుంతలచాళుక్యరాజ్య స్థాపనమునాటికి వారు నాగవావి (నాగవాపి) మహాగ్రామము

నగ్రహారముగా బడసి దానిని ఘటికాస్థానముగా జేసిరి. వానస వంశజులందరు జామదగ్ని సంప్రదాయమున వర్ధిల్లిన మహా విప్రోత్తములు. ఒకవంక విద్వాంసులగుచు వేదాధ్యయనము చేయుచు అవిరళ జపహోమతత్పరులై వఱలుచు, మఱియొక ప్రక్క బాహువిక్రమమును, బుద్ధివైభవమును జూపుచు దండనాథులై, సేనాపతులై మంత్రులై ప్రధానులై కార్యఖడ్గములతో కుంతలేశ్వరులను గొలిచియుండిరి. వానసవంశ భూసురులు ఆహవమల్ల ఇమ్మడి తైలపదేవుని నాడాప్త మంత్రులయి, కుంతలరాజ్యస్థాపనకును తద్రక్షణమునకు మూలస్తంభాయమానులై కీర్తికెక్కిరి. నారాయణభట్టు పూర్వులుగూడ తొలుత తైలపదేవునియొద్ద సమాత్యపదవి యందుండిరి. ఆతని పితామహుడు కంచెన సోమయాజి. అతడు పురోడాశపవిత్రవక్త్రుడు. విద్వాంసుడు, విష్ణుసన్నిభుడు విదితుడు. 'పురోడాశ' శబ్దమున కర్థములు చాలగలవు. శబ్దాలంకార ప్రయోగమున కంచెన సోమయాజి మహాత్త్వమును నన్నియభట్టు పొగడినాడు. కంచెనయజ్వకు ప్రభవించినాడు కీరగన్న కంచెనార్యుడు. విద్వాంసులచే గౌరవమునొందినాడతడు. శత్రుసంఘముల కాతడు కాలసముడు. కవీంద్రులకు కామధేనువు. సుహృదులకు మనోహరమైన క్రీడారంగమతడు. బంధువర్గమునకు జీవితమతడు. "యం మన్యంతే యమ మరిగణాః" ఇత్యాది విశేషణములు నన్నియ వాడియుండుట పరికింప కంచెనార్యుడు కర్ణాటచక్రేశ్వరునకమాత్యుడును దండనాథుడునై యుండెనని యూహింపవీలగుచున్నది. కంచెనార్యునకు శౌచాంజనేయుడని ప్రసిద్ధికెక్కిన

అకలంకశంకనామాత్యుడు పుట్టెను. అతడు మహాత్ముడు; ప్రజ్ఞచే వాచస్పతిని సయితము జయించినవాడు. అకలంక శంకనామాత్యుని ధర్మపత్ని సామెకాంబ. ఆపుణ్యదంపతులకు ప్రభవించిన పుణ్యమూర్తి నన్నినారాయణుడు. అతడే నారాయణభట్టు. అతడు జీవితమును జగదుపకరణుడై గడపెను. అతడు సంస్కృత కర్ణాట ప్రాకృత పైశాచి కాంధ్రభాషలందు సుకవిత్వము చెప్పగలిగియుండెను. అట్టి సుకవిత్వవిభవము వలన కవిరాజశేఖరుడని ప్రఖ్యాతిగాంచెను. కొద్దిపాటి పాండిత్యముగలిగి కవులమని చెప్పుకొనుచుండి గర్విష్ఠులైన వారిని పటువైన మనోహరములయిన తన సూక్తులచే గర్వహీనులుగ జేసిన ప్రజ్ఞావంతు డతడు. దుష్కవులను ఏనుగులకు వజ్రాంకుశమైయుండి 'కవీభవజ్రాంకుశు'డని ప్రఖ్యాతుడయ్యెను. సకల జగనుత గుణశాలి యతడు. అతడు సరస్వతీ దేవికి కర్ణావతంసమైన భూషణము. అష్టాదశావధారణ చక్రవర్తి యతడు. నన్నినారాయణుడు చెప్పిన కృతులు మనకు లభింపలేదు. కాని యత డసారమతులయిన కవులును మనీషాలవదుర్విదగ్ధులయిన కవులును రాజమహేంద్రవరము నా నాడు నన్నియభట్టుకు మహాభారత రచనయం దడ్డు తగులుచుండ నారాయణభట్టు అట్టివారినెల్ల పటువైన మృదూక్తులతో నోరెత్తకుండజేసి కవీభవజ్రాంకుశుడని సార్థకనామ్ము డయ్యెను. నన్నియ భట్టుకు భారత కావ్యరచనయందు దోడ్పడుచు నారాయణభట్టు చేసిన సహాయ మిట్టిది.

నారాయణభట్టుగాక రాజమహేంద్రునివలన నగ్రహారమును, సర్వకరపరిహారముగా బడసిన నింకొక ఘనుడు

చీడమార్యుడు. అతడు విష్ణువర్ధనుని మంత్రిముఖ్యుడో యన్నట్లు తోచును. అతడాపస్తంబసూత్రుడు, సంగీత భారద్వాజగోత్రజుడు. జన్మప్రభృతి యతడు గీతవేదార్థ తత్త్విదుడు. రాజరాజనరేంద్రుని భక్తితో సేవించిన మనీషి. శుద్ధమతి. దోషరహితుడు. యజ్ఞయాగాదులు చేసిన పవిత్రమైన శరీరముగలవాడు. సత్యభిలషిత కార్యనిష్పత్తి శక్తుడతడు. సకలార్థశాస్త్ర పరినిశ్చిత వినోదుడతడు. ఆతని దివ్యగేహమున పుణ్యసంచయులైన బ్రహ్మచారుల వేదపఠనము సర్వదా వినబడుచుండెను. ఉదయాస్తమయములందతని గృహమున జపహోమములు సాగుచుండెను. అతడు వేదములకు నిధి. చీడమార్యుని తండ్రి యజ్ఞార్యుడు. అతడు వసిష్ఠునిబోలిన తేజశ్శాలి. ఆతని తల్లి అరుంధతితో సమానమైన సతి మాకవ్వ. యజ్ఞార్యు డఖిల వేదశాస్త్రజ్ఞుడు. సదాపోషిత జ్ఞాతివర్గముగలవాడు. యజ్ఞార్యుని తండ్రి చీడమార్యుడు. శ్రుతినిధి యని పేరొందిన ఘనుడు. కోరుమిల్లి యగ్రహారమునకు భూపసిద్ధాయ మను పన్నొక్కటి తప్ప మిగిలిన కరములన్నియు పరిహరింపబడెను. భూపసిద్ధాయము క్రింద చీడమార్యు డిరువదియైదు గద్యానములను, ఇన్నూటయేబదిపుట్లు ధాన్యమును శ్రీభండారమునకు యేటేట చెల్లింపవలసియుండునట్లు కోరుమిల్లి శాసన మాజ్ఞాపించును.

## అష్టమ ప్రకరణము

మహాభారత రచన ప్రారంభించిన తరువాత మూడు నాలుగు సంవత్సరములకన్న నెక్కువకాలము రాజరాజు మహామహీ రాజ్యసుఖము లనుభవింపలేదు. విద్వజ్జనములు పరివేష్టించి కొలువ విద్యావిలాస గోష్ఠి సుఖోపవిష్టుండై యిష్టకథావినోదంబుల చిరకాలము ప్రొద్దులు గడపను లేదు. భారతరచన మూడవ పర్వమందు సాగుచుండగా నన్నియ భట్టు మరణించెను. నన్నియభట్టు వెనుక నారాయణభట్టుగూడ దివంగతుడగుటయు, నంతట దేశకాల పరిస్థితులు ముంచు కొని వచ్చుటయు సంభవించెను. భారత కావ్యరచన ఆగి పోయెను. మహాసంగ్రామములు మరల ప్రారంభమయ్యెను. త్రైలోక్యమల్ల ఆహవమల్లునకు రణక్రీడయం దభిలాష యింకను తగ్గలేదు. అతడు, రాజాధిరాజువలె ప్రతాప విక్రమ శౌర్యములు గలవాడు. ఆ చోళనరేంద్రునివలె రణో ద్ధతుడు. రాజరాజనరేంద్రుడును వా రుభయులవలె పరా క్రమశాలి. ప్రచండ శౌర్యమూర్తి. మహావిభూతి గలవాడు. కాని రాజరాజదేవునియందున్న అనంతవిలాసము, ధర్మనిబద్ధ దయార్ద్రబుద్ధి, ప్రజలయెడ ప్రీతి, ఇత్యాది సౌమ్యగుణము లాతని సమకాలికు లిద్దరియందును గానరావు. రాజాధిరాజ త్రైలోక్యమల్లు లాకరినిమించిన క్రూరకర్ము లొకరు. బిల్హ ణుడు తెలిపినరీతి ఆహవమల్లుడు చిరకాలము మహామహీ రాజ్యసుఖములనుభవించి, మరలఆహవక్రీడయందభిలాష కలిగి

యకారణముగా చోళనరేంద్రునిమీఁదికి దండెత్తిపోయెను. కాంచీ పురమును ముట్టడించి తగులబెట్టెను. చోళభూపతిని కాంచీ పురమునుండి వెడలనడచి యడవుల బట్టించెను. ఆ వృత్తాంతములు శ. ౯౮౦ కు సరియైన విలంబి (౧౦౫౮) సంవత్సరమున ప్రారంభమై, ఇంచుమించుగా పదునెనిమిది, ఇరువదిమాసములు నడచెను. రాజేంద్రదేవుఁడు, కొప్పం యుద్ధములందు బలమైన గాయములు తగిలి యచిరకాలము మానకుండుటవలన గాంబోలు, త్రైలోక్యమల్లుని మీఁదికి ప్రతీకారమును దలపెట్టజాలడయ్యెను. తుదకు ఆహవమల్లుఁడు తనదేశముమీఁదికి దండెత్తివచ్చినవేళ, స్వయముగ దాను యుద్ధభూమి కరుగజాలక తనయుని రాజమహేంద్రుని రాజ్యాభిషిక్తునిజేసి కాంచీపుర సంరక్షణార్థము బంపెను. రాజమహేంద్రు డాహవమల్లుని యెదుర్కొని కాంచీపురమును సంరక్షింపలేకపోయెను.

శ. ౯౮౦, ౯౮౧ లకు సరియైన విలంబి, వికారి సంవత్సరములం దాహవమల్లుఁడు కాంచీపుర దండయాత్ర గావించెననిదోనెకల్లు*, సుడి[†] శిలాశాసనములు నుడువుచు, బిల్హణుఁడు వ్రాసినదానిని ధృవపఱచుచున్నవి. మొదటి శాసనము విలంబి సంవత్సరారంభమున వేయించబడిన శిలాశాసనము. దానినిబట్టి సిందవాడిసీమను పాలించుచుండిన మహామండలేశ్వర సిద్ధనచోళునకు ఆహవమల్లుఁడు కాంచీపురవరేశ్వరుఁడని బిరుదొసఁగెనని తెలియుచున్నది. దోనెకల్లు శాసనము

* శిలాశాసనం నెం. 392 of 1920.

† ఎ. ఇ. సం. ౧౫. పుట ౭౫. శాసనము నెం F.

శ. ౯౮౦ న చాళుక్య చక్రవర్తి దక్షిణదేశముపై జైత్రయాత్ర బోయెనని తెలుపుచున్నది. సుడిశాసనము నాటికి త్రైలోక్యమల్లుడు దిగ్విజయము జేసి తిరిగి వచ్చుచు పులిగ్రామమున పయనపువీడునందు విడిసియుండి శ. ౯౮౧ యగు వికారి సంవత్సర మాఘపున్నమినాడు (౨౦ జనవరి, ౧౦౬౦) చంద్రగ్రహణ నిమిత్తమున కొన్ని మహాదానములను చేసెను.

ఆహవమల్ల, రాజరాజనరేంద్రులమధ్య దారుణ వైరానలము ప్రబలియుండెను. రాజరాజవిష్ణువర్ధనుని యవమానించు తలంపుతో త్రైలోక్యమల్లుడు తన రాజ్యారంభ కాలమునాడు మహాసామంతాధిపతి శోభనరుసుకు వేంగీపురవరేశ్వర యని బిరుదమిచ్చి యావ్వరాజ్యపట్టముగట్టెను. పిమ్మట ఐదేండ్లకు తన జ్యేష్ఠ తనయుని కుమారసోమేశ్వరుని యువరాజుగా నభిషేకించి, యాతనికి 'వేంగీపురవరేశ్వర' యని బిరుదమొసగెను*. మరల పదేండ్లు గడచిన వెనుక, తన కడగొట్టు తనయునికి విష్ణువర్ధనమహారాజని విజయాదిత్యుడని రెండుపేరులును బెట్టి, వేంగీమండలేశ్వరుడని కీర్తిమాత్రాకరమైన బిరుదుగట్టి నొలంబవాడిని పాలింప మహామాండలికుని జేసెను. ఆ విధముగా రాజరాజు నవమానించి నాతని యుద్ధమున కాహ్వానించుచుండెను. అంతలో ఆహవమల్లుని చోళదండయాత్ర వచ్చెను. తన మేనమేఁదియు, వియ్యంకుడు నగు రాజేంద్రదేవునకు సాహాయ్యము చేయుటకు, నా విధముగా త్రైలోక్యమల్లుని శిక్షించుటకును రాజరాజంధ్ర సైన్యములను చోళదేశమునకు బంపినట్లు తోచును.

* బొంబాయి కర్నాటక శాసనములు. సం. ౧. భా. ౧. నెం. ౭౮.

ఆంధ్రదేశమునకు, విశేషించి యీ రాజ్యమునకు నాయకమణియైన రాజమహేంద్రవరమునకును, రాజరాజదేవునకు నించుమించుగా శ. ౯౮౦ యగు విలంబి సంవత్సరము (౧౦౫౮) నుండి కష్టదినములు ప్రారంభమయ్యెను. చోళదేశ దండయాత్ర దిగ్విజయముగా సాగించి, యాహవమల్లుడు తన రెండవ కుమారుని, అతి ప్రచండ పరాక్రమశాలిని కుమారవిక్రమాదిత్యుని వేంగీసామ్రాజ్యమున విద్రోహులను బురికొల్పి రాజరాజదేవునకు కడలేనిక్లేశములు కలిగింపను ఆంధ్రదేశము మీదికి బంపెను. కుమారవిక్రమాదిత్యుడు సైన్యసమేతుడై, బిల్హణకవి తెలిపినరీతి చక్రకూట రాజ్యమును జయింప ఉత్తరాభిముఖుడై యరిగెను. చక్రకూటరాజ్యమును మిత్రభేదోపాయమున స్వాధీనపఱచుకొనెను. ఆ రాజ్యమునేలు రాజన్యుని, ధారావర్ష దేవుని, వేంగీశ్వరునిపై తిరుగుబాటుజేసి స్వతంత్రుడై, పరమేశ్వరత్వమును ప్రకటించునట్లు పురిగొల్పి వెడలిపోయెను. ధారావర్షుడు తిరుగబడినవేళకు, త్రైలోక్యమల్లుడు కర్ణాటసేనల నంధ్రదేశముమీదికి దండయాత్ర చేయబనిచెను. ఆ నాడు రాజరాజుకు సాయపడజాలక చోళరాజేంద్రుడే వేంగీశ్వరుని సాహాయ్యము కోరుచుండెను. విజిగీషుడై వచ్చిన కుమార విక్రమాదిత్యుని భోజుడొక్కడు ఎదుర్కొనవలసియుండెను. అట్టివేళ రాజరాజు ధారావర్షుని శిక్షింపను తన కుమారుని రాజేంద్రచోడుని చక్రకూటరాజ్యము మీదికి బంపెను. తాను స్వయముగా కర్ణాటసేనాని మధుసూదనుని నెదుర్కొనుటకు దక్షిణాంధ్రసీమను బ్రవేశించెను. ఆ వృత్తాం

తములన్నియు వరుసగా శ. ౯౮౨ యగు శార్వరి సంవత్స రమున (౧౦౬౦) నో అంతకించుక పూర్వమో ప్రారంభమై శ. ౯౮౩ యగు ప్లవ సంవత్సరమునందు గూడ జరిగినట్లు దోచును. రాజరాజనరేంద్రునకును కర్ణాటదండనాయకులకును నడుమ దారుణసంగ్రామములనేకములు జరిగినట్లు తోచును. ఆ నాటి వేంగీశ్వరుని దండనాయకులలో చమూపతి తిక్కప్పయ్యనాయక, మహామండలేశ్వర దేసటినంబిరాజు, మాండలిక దేసటిగండయ యనువారల పేళ్లు శాసనములందు గానవచ్చుచున్నవి. ఆ నాటి యుద్ధములందు ఆంధ్ర, కర్ణాట దండనాథులనేకులు మడిసిరి. రాజరాజదేవుని దురదృష్టవశమున నాటి యుద్ధములు సమములుగా పరిణమించెను. చివరకు రాజరాజకూడ యుద్ధరంగమున గూలి వీరస్వర్గము నొందెను. రాజరాజు తన బలమునన్నింటిని గూర్చుకొనివచ్చి కర్ణాట సేనల నెదుర్కొనుచుండ, నాతని సవతి తమ్ముడు, మరల ద్రోహియై రాజమహేంద్రవరమును, వేంగీమహారాజ్యమును బలాత్కారముగ నాక్రమించుకొనెను. రాజరాజనరేంద్రుని మరణము శ. ౯౮౩ యగు ప్లవ సంవత్సరమున శ్రావణ భాద్రపదములం దెప్పుడో (జులై, ౧౦౬౧) జరిగి యుండును. ఆ నాటికి వీరవిజయాదిత్యుడు, ద్రోహియై తన్నెదిరించిన రాజరాజదేవుని పక్షమువారిని యోడించి వేంగీసింహాసన మాక్రమించుకొనెను. ఆ వృత్తాంతము శ. ౯౮౩ యగు ప్లవ సంవత్సర భాద్రపద (సెప్టెంబరు) మాసమున జరిగెను. శ. ౯౮౩ సంవత్సరము రాజరాజ దేవుని ౪౧ వ విజయరాజ్యవర్షమగును. దూరదేశమున

రాజరాజనరేంద్రుని యాకస్మిక మరణమును, ఆ వేళకు కుమారరాజేంద్రుడు దూరదేశ మందుండుటయు, విజయాదిత్య దేవుని రాజ్యాపహరణ కార్యమునకు సానుకూలములయ్యెను.

వేంగియందు తనతండ్రి లగచాట్లఁబడుచు చివర కన్యాయముగ రణక్షేత్రమునకర్ణాటులతోఁడి సమయుద్ధమునకూలిన వేళ కుమార రాజేంద్రచోళుడు చక్రకూట రాజ్యమున జయపరంపరలను గొనుచుండెను. ఆనాడు చక్రకూట మండలమును నాగవంశ మొకటి పరిపాలించుచుండెను. చక్రకూట మండలము రెండు జనపద ఖండములై యుండెను. దానికి దక్షిణమున గోదావరియును ఉత్తర పడుమటిదిశలందు గోదావరి కుపనదియైన ఇంద్రావతియును, తూర్పున మరియొక యుపనది శబరియును సీమలు. చక్రకూట మండలము త్రికలింగాటవీ రాజ్యములోని దక్షిణ భాగము. త్రికలింగాటవికి మహాకాంతార రాజ్యమని కూడ రెండవ పేరుండెను. నేటి బస్తరురాజ్య మొకప్పుడు మహాకాంతార రాజ్యమై యుండెను. బస్తరు రాజ్యములోని దక్షిణ భాగము రాజరాజనరేంద్రుని కాలమునాటి చక్రకూట మండలమునకు సరిపోవును. శక్తివర్మ కాలమునాడో తత్పూర్వమో చిందక, లేక సిందక రాజ వంశ మొకటి కర్ణాటదేశమునుండి వచ్చి చక్రకూట మండలాధిపులయిరి. సిందకులు నాగకులోద్భవుల మనియు నాగవంశీయులమనియు వింధ్యవాసినీదేవి వర ప్రసాదమున చక్రకూటాధీశ్వరత్వమును బడసితి మనియు దెలుపుకొనిరి. అయినను వారి కులదైవము మాణిక్యేశ్వరి

యగుటవలన శ్రీ మాణిక్యదేవీ దివ్య శ్రీపాదపద్మారాధకులమని చెప్పుకొనిరి. మాణిక్యేశ్వరి నేడు బస్తరు సంస్థానాధీశ్వరులకు కూడ కుల దైవతము. కాని దంతేశ్వరియని పేరు మారిన దా దేవికి. చక్రకూటాధీశులు వేంగీశ్వరులకు సామంతు లగుటవలన గాబోలు వారి యిలవేల్పును దక్షవాటి భీమేశ్వర మహాదేవునికి భోగపత్నిని జేసిరి. రాజ చాలుక్య వంశమునకు దక్షవాటి భీమయదేవుడు కులదైవతముకదా! పంచారామములందు * వెలసిన శ్రీమన్మహాదేవుడు పాశుపతమూర్తి. దాక్షాయణి దక్షయాగమున యగ్నియందు ప్రవేశించిన నాటినుండి, శివుడు బ్రహ్మచర్య వ్రతమును బూని దక్షిణామూర్తి యయ్యెను. దక్షారామమున భీమేశ్వరుడను పేరుతో శివు డావిర్భవించిన నాడు దాక్షాయణి లేదు. పార్వతియై ఇంకను పర్వతరాజింట అవతరింపలేదు. కావున దక్షవాటి భీమనాయకునికి మాణిక్యేశ్వరి భోగపురంధ్రి కావలసివచ్చెను. అష్టాదశ శక్తి పీఠములలో † నొకటి దక్షవాటి మాణిక్యేశ్వరి. ఆంధ్రదేశమందు మాణిక్యేశ్వరితో కలిసియైదు పరాశక్తి పీఠము లున్నవి. దక్షారామమున మాణిక్యేశ్వరి యవతరించినది జటాచోడభీముని కాలమునకాదగును. చక్రకూట నాగవంశీయులు తమ వంశప్రశస్తి

* దక్షారామము, క్షీరారామము (పాలకొలను), కుమారారామము (చాళుక్యభీమవరము), అమరారామము (అమరావతి), భీమారామము (గుణపూడి భీమవరము) ఈ యైదును పంచారామములు.

† అవి ఒడ్డాది ఓంకారశక్తి, పిఠాపుర పురుహూతిక, దక్షవాటి మాణిక్యేశ్వరి, విజయవాడ కనకదుర్గ, శ్రీశైల భ్రమరాంబికలు.

రచనయందు రాజ చాలుక్య కులప్రశస్తిని పూర్తిగా నను కరించిరి. వేంగీ చాళుక్యులకు వారు సామంతు లగుటవలన గాభోలు నా రీతి రచించుకొనిరి. వారు భోగవతీపురవరా ధీశ్వరులమనియు, సవత్సవ్యాఘ్రలాంఛనులమనియు, నాగధ్వ జులమనియు తమ వంశ ప్రాశస్త్యము నుగ్గడించుకొనిరి,

నాగవంశీయులు మూడు శాఖలవారు కర్ణాటదేశ మందు క్రీస్తుశకము పది, పదకొండు, పండ్రెండు శతాబ్దము లందు కనబడుచున్నారు. వారందరు సామంత నృపాలురు. వారేలిన కర్ణాట దేశభాగమునకు సింధువాటియను పేరు. సింధువు అక్కడి కృష్ణానది. దక్షిణమున మాల్యప్రభకును, ఉత్తరమున కృష్ణానదికిని మధ్యస్థితమైన దేశమున కానాడు సింధువాటి లేక సిందవాడి యని పేరు. ఒకప్పుడు సిందవాడి కృష్ణ కుత్తరవు టొడ్డున కొంత దూరము వ్యాపించెను. నేటి బాగల్‌కోట, బిజాపుర, జర, ముధోల్. జంఖండి సీమలును రాచూరు మండలములోని పడమటి భాగము, అన్నియు గలసి సింధువాటి సీమ యని యానాడు బరగుచుండెను. ప్రాయశః చోళత్రినేత్రుడగు జటాచోడభీముని కాలమునాడు, అతని ప్రాపున పదియవ శతాబ్దపు చివరదశలో నాగవంశీయులు, కర్ణాటభూమినుండి వచ్చి చక్రకూట రాజ్యమును సంపాదించు కొని యుందురు. నాగవంశీయులతోపాటు తెనుగు చోడవంశ మొకటి కూడ చక్రకూట మండలమున చిన్నమాండలిక రాజ్య మొకటి సంపాదించుకొనెను.

రాజరాజనరేంద్రుని కాలమునాడు నృపతిభూషణ మహారాజు చక్రకూట మండలాధీశ్వరుడై పరిపాలించు

చుండెను. ఆతడు రాజరాజుకు బూర్వమే చక్రకూట రాజ్యమున కభిషిక్తుడయ్యెను. నృపతి భూషణు డెప్పుడు మరణించెనో, యాతని వెనుక నెవరు సింహాసన మధిష్ఠించిరో తెలియదు. కాని రాజరాజదేవుని యవసాన కాలమునాడు ధారావర్షుడు చక్రకూటాధీశ్వరుడై యుండెను. నృపతిభూషణ,ధారావర్షుల నడుమ నెట్టి బంధుత్వముండెనో తెలియదు. కుమార విక్రమాదిత్యుడు చక్రకూటమున కేతెంచి ధారావర్షుని పురికొల్పిన నాటనుండి,యించు మించుగా శ. ౯౮౧ ( = ౧౦౫౯ నుండి రాజరాజ విష్ణువర్ధనునకు కష్టములు మిక్కుటమయ్యెను. ధారావర్షుడు పారమేష్ఠిత్వమును ప్రకటించి, చాలుక్య చక్రవర్తికి కప్పము గట్టుట మానెను. ధారావర్షుని ద్రోహమడచి బలిమి వాటించి, మరల కప్పము గొనివచ్చుటకు రాజరాజు యువరాజ రాజేంద్రచోడుని బంపెను.

రాజేంద్రచోడు డెప్పుడు జనించెనో తెలియదు, కాని యతడు చక్రకూటాధీశ్వరుని శిక్షింపబోయిన నాటి కించు మించు ఇరువది యేండ్లవాడు గావచ్చును. అప్పటి కతడు వేంగి యువరాజు. కర్ణాట విక్రమాదిత్యునికంటె యువరాజు రాజేంద్రచోడు డించుక పెద్దవాడుగా కన్పట్టును. కుమార రాజేంద్రచోడుడు చక్రకూటమున కరిగి బాహుబలమున విక్రమించి శౌర్య సహాయుడై ధారావర్షుని బూర్తిగ నోడించి మరల తలయెత్తకుండ సర్వనాశకరముగా మర్దించెను. చక్రకూట జైత్రయాత్ర శ. ౯౮౧ ౯౮౨ సంవత్సరముల నడుమ రెండేండ్లు నడచిన ట్లూహింపవచ్చును. చక్రకూట నగర మింద్రావతి యొడ్డున రమణీయమైన జలపాతము

చెంత నున్నది. అది యీనాటి జగదలపురము (జగడాల పురము) నకు వాయవ్యముగా ముప్పదిమైళ్ల దూరమున నున్నది. చక్రకూటమున కిరువదిమైళ్ల దూరమున వజ్రఘుడ (వాయిరాగరము) మున్నది. అది యీనాడు మదగజేంద్రములకు బ్రసిద్ధి కెక్కియుండెను. చక్రకూటాధీశ్వరుని సాధించిన పిదప వేంగీ యువరాజు వజ్రఘుడమునుండి అసంఖ్యాకములైన మదపుటేనుగులను బట్టుకొని వేంగికి తరలించెను. అతడు చక్రకూటమున విజయపరంపరలను గొనుచుండ వేంగి దక్షిణ భాగమందు తండ్రి యుద్ధరంగమున మరణించుటయు, నాతని పరోక్షమందు, తన్నెదిరించినవారి నోడించి, ద్రోహియై వేంగిరాజ్యమును పినతండ్రి బలాత్కారముగ లాగుకొనుటయు సంభవించెను. ఆ వృత్తాంతములు చెవి సోకిన తక్షణమ చక్రకూటమండలమునుండి కుమార రాజేంద్రచోడుడు హుటాహుటి వేంగికి శరవేగమున మరలి వచ్చెను. ఆనాటికి శ. ౯౮౩ యగు ప్లవ సంవత్సరము గడచి పోయి, శ. ౯౮౪ శుభకృతు (మార్చి, ౧౦౬౨) చైత్రమే తెంచియుండును.

వీరవిజయాదిత్యదేవుడు ద్రోహియై సంపాదించిన వేంగీ రాజ్యమును పుత్రస్నేహమున ఇమ్మడిశక్తివర్మ కభిషేకించెను. వేంగి యువరాజు కపుడు సంకటమైన సందిగ్ధావస్థ సంఘటిల్లెను. దైవవశమున చేతులనుండి జారిపోయిన పైతృక రాజ్యమును మరల జయించుకొనవలసిన దుస్థితియేర్పడెను. వీరవిజయాదిత్యదేవుడు వేంగీసింహాసనముపై సుస్థిరముగ గూర్చుండుట కవసరమైనచో నిటు కళింగగంగ భూపతు॥

సహాయ్యము గాని యటు త్రైలోక్యమల్లుని సహాయ్యము గాని యపేక్షింపగలడు. మరియు, నాతనితండ్రిపై నెత్తివచ్చిన కర్ణాట సేనలింకను వేంగియం దున్నట్లు యూహింపవచ్చును. వృద్ధుడైన పినతండ్రికి రాజ్యతృష్ణ తీరకుండెను. అట్టి పరిస్థితు లందు పినతండ్రితో వైరము దెచ్చుకొనుట నీతి గాదని వేంగీ యువరాజుకు తోచెను. పినతండ్రితోడి వైరమునకు కళింగ, కర్ణాట భూపతుల విరోధము సాహాయ్యపడగలదు. అంతట వేంగియువరాజుకు దక్షిణాపథమున మిత్రుడొక్కడును గూడ నుండడు. ఆ సందిగ్ధ సమయమున నాతనికి చోళరాజ్య పరి స్థితులుగూడ అనుకూలముగ పరిణమించెను. అంతట రాజేంద్రచోడుడు పినతండ్రితో సఖ్యపడియెను. వేంగీ మహీ మహారాజ్యమును వీర విజయాదిత్యునికి వదిలిపెట్టెను. విరోధి యైన పినతండ్రికంటె కృతజ్ఞతతో పుత్రస్నేహము జూపగల పినతండ్రి యాసమయమున తన కావశ్యకమని యాతనికి తోచియుండును. ఆతడు చోళరాజ్యాభిలాషియై యట్లు గావించెను.

యువరాజ రాజేంద్రచోడుడు వేంగికి మరలి వచ్చిన వేళకు చోళసామ్రాజ్యములో జేరిన చేర పాండ్యాది రాజన్యులు రాజేంద్రదేవునిమీద తిరుగబడిరి. ఆనాటి సంకుల మందు రాజేంద్రదేవుడు మరణించెను. అతడు వేంగీయువ రాజుకుమేనమామయు కూతునిచ్చిన మామయునై యుండెను. రాజేంద్రదేవుని యేకైకపుత్రిక, మధురాంతకి, వేంగియువ రాజున కగ్రమహిషి. వారి వివాహము రాజరాజనరేంద్రుని మరణమునకు బూర్వమే, రెండవ కొప్పం యుద్ధముజరిగిన

కొంతకాలమునకు జరిగియుండును. రాజేంద్రదేవునకు రాజమహేంద్రుడనుకుమారుడుండెను. వేంగియందురాజరాజనరేంద్రుడు మరణించినకాలమున నించుమించుగా, (శ. ౯౮౩ న) చోళరాజమహేంద్రుడుగూడ రణక్షేత్రమున మడిసెను. ఆ మరణమెట్లు తటస్థించెనో యూహింప దుస్సాధ్యము. రాజమహేంద్రుని మరణముతో రాజేంద్ర దేవుని యనంతరము చోళసింహాసన మధిష్ఠింపగల ఔరసుడు లేకపోయెను. ఆస్థితి వేంగియువరాజుకు చోళరాజ్యాభిషిక్తుడు గావలయునన్న యభిలాషను గలిగించెను. అతడు చక్రవర్తి గంగైకొండ చోళునికి దౌహిత్రుడు. ఆకారణమున వేంగియువరాజుకు చోళరాజ్యాభిషిక్తుడగుట కితరులతోపాటు సమానమైన అధికారముగలదు. ఆనాటిశాసనములందును, కళింగత్తు పరణి యను తమిళ కావ్యమునందు నీయూహను బలపఱచువాక్యములనేకములు గలవు. రాజేంద్రదేవుడు మరణించినాడన్న వార్త వచ్చినంతనే కుమారరాజేంద్రదేవుడు వీరవిజయాదిత్యునితో మైత్రిచేసికొని వేంగీమహామహారాజ్యము నాతనికిచ్చి, చోళరాజ్యాభిలాషియై దక్షిణమునకు పయనమయ్యెను. అప్పటికి శ. ౯౮౪ శుభకృతు సంవత్సరమున నించుమించుగా (మేయి, ౧౦౬౨) రెండుమూడు మాసములు గతించియుండును. అన్నకుమారునితోడ విరోధము నశించినందులకు వీరవిజయాదిత్య దేవుడు సంతసించెను. వేంగీసింహాసన మతనికి నతని కుమారునికిని సుస్థిర మయ్యెనని యతడు సుహృష్టుడయ్యెను.

వీరవిజయాదిత్య దేవునికి కలియుధిష్ఠిరుడనియు కరవాలభైరవుడనియు బిరుదములు గలవు. అత డాహవకార్య

నిపుణుడు. అసహాయవిక్రముడు. వీరవిజయాదిత్యునికి హైహయరాజ్యకులమున ప్రభవించిన మాలవమహాదేవి యగ్రమహిషి. ఆ దంపతులకు శక్తివర్మయను కుమారుడు పుట్టెను. శక్తివర్మకు సత్యాశ్రయదేవుడని మరియొక పేరు గలదు. ఆనాడు కోనమండలమున నొక హైహయరాజన్య వంశము, పల్నాడునందొక హైహయరాజవంశమును పరిపాలించుచుండెను. మాలవమహాదేవి యారెండింటిలో నేవంశమున జన్మించెనో ఊహింపజాలము. విజయాదిత్యదేవునికి బెజయితదేవుడని తెనుగున నామాంతరముండెను. తండ్రికిని అన్నకు నుండిన రాజమార్తాండుడను బిరుదము అతనికి గూడనుండెను. బెజయితదేవునికి రేవలదేవియను భోగపత్నియందు సోమలదేవియని కుమార్తె కలిగెను. ఆమె జగదేకసుందరి, గుణారామ. శ. ౯౭౮ సంవత్సరమున దక్షారామ భీమేశ్వరున కామె బంగారముతో చేయబడిన కల్పవృక్ష పుష్పమును, వెండిపాత్రను, అఖండదీపమును సమర్పించెను. ఆమె దానశాసనము పద్యరూపమున వెలసెను. ఇంచుమించుగా నన్నియభట్టు భారతకావ్యమును రచించిన పదియేండ్ల కాపద్యశాసనము వ్రాయబడెను.

అజ్ఞానవశమున కొందరికి విజయాదిత్యుని సప్తమ విజయాదిత్యుడని వ్యవహరించుట అలవాటయినది. నిజమున కాత డష్టమవిజయాదిత్యుడు. అష్టమ సప్తమ సంఖ్యాసంజ్ఞలతో వ్యవహరించుట పాశ్చాత్యుల సంప్రదాయము. భరతఖండమునందు, విశేషించి, దక్షిణాపథమందట్టి యాచారము లేదు. ప్రతినరపాలునకు విశిష్టమైన వ్యవహారనామముండెను.

ముఖ్యముగా నీసంప్రదాయము చాళుక్యవంశములందుగాన వచ్చును. కావున వేంగిచాళుక్య సంప్రదాయము ననుసరించి అష్టమసంజ్ఞను వదిలి, వీరవిజయాదిత్య దేవుడని వ్యవహరించుటయుక్తము. పాములవాక, ర్యాలిశాసనములం దతడు వీర విజయాదిత్యదేవుడని పేర్కొనబడుచున్నాడు. ఆతనిరాజ్య కాలము, రాజరాజనరేంద్రుని మరణమున కించుక బూర్వమే ప్రారంభమయ్యెను. అది శ. ౯౮౩ శ్రావణమాస ప్రాంతమున (జూలై, ౧౦౬౧) జరిగియుండును. వీరవిజయాదిత్య దేవుడు రాజమహేంద్రవరమును విడిచి, దక్షారామము చెంతను నగరము నిర్మించుకొని రాజధాని యక్కడికి మార్చెను. ఆవృత్తాంత మాతని రాజ్యారంభకాలమున జరిగియుండెను. ఆనూతన రాజధానిపేరు జననాథపురము.

సత్యాశ్రయదేవునికి సమరైక భైరవుడని బిరుదు గలదు. అతని పట్టాభిషేకము శ. ౯౮౩ న తులామాస మున శుక్లపక్ష ద్వితీయాగురువారమునాడు (౧౮ అక్టోబరు, ౧౦౬౧) అనురాధా నక్షత్రయుక్త కుంభ లగ్నసమయ మున నడిచెను. సత్యాశ్రయదేవుడు యువరాజ రాజేంద్రుని కంటె కొంచెము పెద్దవాడుగావచ్చును. ఆత డేవేళ నభిషిక్తుడయ్యెనో గాని, ఒక్కయేడుమాత్రము మహా మహీరాజ్యసుఖము లనుభవించి, రెండవ విజయ రాజ్యవర్ష మున యుద్ధరంగమున నిహతుడయ్యెను. శత్రువులసేనలు వేంగీదేశముపై దండెత్తి వచ్చినవేళ, సంకులసమరము లేక కాలమున రెండురంగములందు జరుగుచుండినవేళ, తండ్రి వీరవిజయాదిత్యుడు దూరస్థలమున చాముండరాజు సైన్య

ములతో బోరుచుండినవేళ, నలుప్రక్కలను చుట్టుకొనివచ్చి శత్రువులు మార్కొనినపుడు సత్యాశ్రయుఁడొంటరివాఁడై అభిమన్యునివలె గాయపడి విధివశుఁడై మరణించెను. అభిమన్యుని చావుతో సత్యాశ్రయునిచావును బోల్చుట చూడ ఇమ్మడిశక్తివర్మ పటువిక్రమ సాహసుఁడై బోరాడినను, పంచాననపరాక్రముఁడైన తండ్రి చెంతలేనిసమయమున దుర్మతులైన శత్రువుల క్రౌర్యమునకుగురియై కూలెనని కవిముత్తయభట్టు ధ్వన్యలంకారమున స్ఫురింపజేయుచున్నాఁడు. వీరవిజయాదిత్యుఁడు సత్యాశ్రయవీరుని దుర్మరణమునకు, అభిమన్యుని చావుకు పార్థునివలె, దుఃఖించెను. దుఃఖక్లేశజరాభారములచే క్రుంగియు, వీరవిజయాదిత్యుఁడు విబుధులు, కులక్రమాగతులైన ఆప్తులు, పలుమారు బోధించుటవలన ప్రజాహితముకొఱకును ధర్మసంస్థాపనార్థమును మరల సింహాసనమెక్కి వేంగీసామ్రాజ్యమును పరిపాలించెను. సమరైకభైరవుఁడగు సత్యాశ్రయదేవుఁడు మరణించినది శ. ౯౮౪ సంవత్సర మాఘమాసమునకు బూర్వము (జనవరి, ౧౦౬౩) కావచ్చును.

సత్యాశ్రయుని మరణమునకు గారణమైన యుద్ధము, వైరము నెవరివల్ల సంఘటిల్లెనో యూహించుట కష్టము. అయినను చేదిదేశాధీశుని జైత్రయాత్రయందు జరిగిన ఘోరయుద్ధమునందు సత్యాశ్రయుఁడు మరణించినట్లూహింపవచ్చును. చేది దేశాధీశులు హైహయులైన కలచుర్యులు. వారినిగుఱించి మున్నొకసారి ప్రస్తావించితిమి. కలచుర్య రాజధాని త్రిపురి. వారు కుంతలేశ్వరులగు కర్ణాటచాళుక్య

లకు బంధువులు, మిత్రులు. హైహయలక్షణ రాజదేవుని దౌహిత్రుడు ఆహవమల్ల ఇమ్మడితైలపదేవుడు. లక్షణరాజ దేవుని తనయుడు ఇమ్మడి యువరాజదేవుడు. అతని పౌత్రుడు విక్రమాదిత్య బిరుదాంచితుడైన గాంగేయదేవుడు. అతడు జగదేకమల్ల ఇమ్మడిజయసింహుని కాప్తుడు. గాంగేయ దేవుడు కుంతలభంగభంగి రసికుడని బిరుదువహించినవాడు. గాంగేయదేవుని కుమారుడు కర్ణదేవుడు. అతని తనయుడు యశఃకర్ణదేవుడు. రాజరాజనరేంద్రుడు మరణించుటకు బూర్వము కొంతకాలముక్రిందట, యశఃకర్ణదేవుడు చేదిదేశాధీశుడయ్యెను. అత డంధ్రదేశముపై జైత్రయాత్ర నెఱపెను. ఆనాడు యశఃకర్ణదేవునికి అంధ్రాధీశునితోడ వైరము వాటిల్లుటకు కారణము దురూహ్యము. యశఃకర్ణదేవుని జైత్రయాత్రాఫలితమైన ఘోరసంకులమందు సత్యాశ్రయుడు మరణించెను. ఆ యుద్ధము దాక్షారామముచెంత జరిగియుండినట్లూహింపవచ్చును. మహాబలవంతుడును, అవక్రపరాక్రమోపేతుడునగు నంధ్రాధీశ్వరుని సంహరించి యాతని వస్తుచయమునెల్ల కొల్లగొని, యాభూషణములతో దక్షవాటి భీమేశ్వరు పూజించితి నని యశఃకర్ణదేవుడు తన ప్రతాపమును జెప్పుకొనెను*. యశఃకర్ణదేవుని యశమును సప్త

---

* అంధ్రాధీశవరంధ్రవోద్వేలపీఠం స్వచ్ఛందముచ్ఛిందతా
శ్రీనాథస్యర్చ్చితభూరిభిః సభగవాన్భీమేశ్వరో భూషణైః।
యస్యాకర్ణదరాత్త నృత్యలహరీ భ్రూభంగ్గి గోదావరీ
గాయంత్యున్మద హంసనాద మధురైః స్తోత్ర స్వరైః సప్తభిః॥
యశఃకర్ణదేవుని ఖైరా తామ్రశాసనము; ఎ. ఇ. సం. ౧౨; పుట ౨౦౫.

గోదావరీ స్రవంతి, మదహంసలు మధుర నాదము చేయు చుండ, తరంగములు నృత్యము చేయుచుండ సప్తస్వరములతో గానము చేసెనట!

యశఃకర్ణదేవుని దండయాత్రకు కళింగభూపతి ప్రోత్సాహముగూడ గారణమై యుండవచ్చును. విమలాదిత్యుని సింహాసన పరిత్యాగకాలమునాటినుండి, కళింగగంగ భూపతులు ఆంధ్రాధీశులకు శత్రువులై వర్తించుచుండిరి. మధుకామార్ణవు డనేకసారులు రాజరాజనరేంద్రుని యెదిరించి నిర్జింపలేక పోయెను. ఆనాటి వైరము మధుకామార్ణవుని యనంతరము సింహాసన మధిష్ఠించిన ముమ్మడి వజ్రహస్తునినాడుకూడ వర్ధిల్లెను. గంగభూపతులు తమ పుత్రికలను చాళుక్య రాజన్యులకిచ్చి బంధుత్వమును గలుపుకొనుచుండుటవలన కళింగాధీశులకు జ్యేష్ఠవంశజులైన వేంగీశ్వరులకు శత్రువులగుట సంభవించెను. మధుకామార్ణవుడు పిఠాపుర చాళుక్య భూపాలుడైన ఉత్తమచాళుక్యునికి పిమ్మట నాతని కుమారులకును రాజరాజనరేంద్రుని తోడి పోరాటములందు సాహాయ్యము చేసియుండును. ఆ వైరకారణమున ముమ్మడి వజ్రహస్తదేవుడు కూడ నిడదవోలు, పిఠాపురం, సర్వసిద్ధి, ఆదిగాగల చిన్నచాళుక్యవంశములతోడి బంధుత్వము నెఱపుచు రాజచాళుక్య వంశమున కహితుడై యుండెను. ఆ కారణమున ముమ్మడి వజ్రహస్తదేవుడు వీరవిజయాదిత్యునికి విరోధియైన ట్లూహింపవచ్చును. ముమ్మడివజ్రహస్తుడు శ ౯౬౦ సంవత్సర వైశాఖమాసమున (ఏప్రిలు, ౧౦౩౮) రాజ్యాభిషిక్తు

డయ్యెను. అదిమొదలుకొని పాలించిన ముప్పదిరెండేండ్లను ఆతడు వేంగీశ్వరుని కహితుడై వర్తించియుండును.

ముమ్మడివజ్రహస్తుడు శ. ౯౯౨ సంవత్సరారంభమున (ఏప్రిలు, ౧౦౭౦) మరణించెను. పిమ్మట నాతని కుమారుడు దేవేంద్రవర్మ, రాజరాజను పేరుతో పట్టాభిషిక్తుడయ్యెను. అత డెనిమిది సంవత్సరములు శ. ౯౯౨ - ౯౯౯( ౧౦౭౦ - ౧౦౭౮) కళింగమును అతివైభవముతో, శత్రు నిర్మూలనముగావించి, అజితుడై, పరిపాలించెను. వీరవిజయా దిత్యునికి రాజరాజుతోడి వైరము వజ్రహస్తుని మరణానంత రము మరింత వృద్ధిపొందెను. రాజరాజు వేంగిపై చాలతడవలు యుద్ధమునకువచ్చెను. అవి సమయుద్ధములుగా పరిణమించుట వలన నిశ్చితజయ మెవ్వరికిని లభింపదయ్యెను. ఆ కారణ మున, కళింగ వేంగీశ్వరుల నడుమ యుద్ధములు నిరంతరము సాగుచుండెను. మండలిక వనపతి, రాజరాజుకు మహాప్రధాని. అతడు కళింగాధీశున కన్వయాగతమైన మహాప్రతీహారి ముఖ్యుడు. బ్రాహ్మవంశమండనుడు, ఆత్రేయగోత్రజుడు, గోకర్ణత నూజుడు. మహాప్రచండ దండనాయకుడతడు. దేవేం ద్రవర్మయైన రాజరాజు జీవించియుండిన కాలమున వేంగీశ్వరుని పలుమారు నోడించి యాతని అఖల వస్తురాశి నపహరించితినని దీర్ఘాసి శాసనమునందు తన ప్రశస్తివ్రాయించుకొనెను. ఆశాసనము శ. ౯౯౭ సంవత్సరము ( ౧౦౭౫ - ౭౬) నాటిది.

# నవమ ప్రకరణము

యువరాజరాజేంద్రచోడుడు చోళరాజ్యాభిలాషియై దక్షిణమునకుబోయి, విశ్వప్రయత్నములు గావించి, తుదకు విఫలమనోరథుడయ్యెను. చోళరాజేంద్రదేవుని కింకను ఇద్దరు తమ్ములుండిరి. వారిలో పెద్దవాడు ఆలవందాను. రెండవ వాడు వీరరాజేంద్రుడు. ఆలవందాను పరాక్రమోపేతుడు గాడు. రాజేంద్రదేవుని మరణానంతర మొకవంక ఆలవందానును ఇంకొకప్రక్క వేంగియువరాజును ద్రోసిపుచ్చి వీర రాజేంద్రుడు విక్రమైక సహాయముతో పటుసాహసమున శ. ౯౮౫ సంవత్సర కార్తీకమాసప్రాంతమునందు (సెప్టెంబరు అక్టోబరు ౧౦౬౩) చోళరాజ్యాభిషిక్తుడయ్యెను. పరాజితుడైన పిదపకూడ కుమారరాజేంద్రుడు వీరరాజేంద్రుని పదచ్యుతిని జేయుటకు ప్రయత్నములు చేయుచుండెను. ఆరీతిగా మేనమామకును మేనల్లునకును బద్ధవైరము స్థిరముగా నేర్పడెను.

చోళరాజ్యమునకై రాజ్యాభిలాషులై రాజేంద్రచోడ, వీరరాజేంద్రాదులు కలహించుచుండుటజూచి, యాతరుణమున త్రైలోక్యమల్లుడు గంగవాడిమీదికి సమర్థుడైన కుమారవిక్రమాదిత్యుని, జైత్రయాత్రచేయ బంపెను. విక్రమాదిత్యునివెంట నాతనితమ్ముడు జయసింహుడుగూడ నుండెను. అంతలోపల వీరరాజేంద్రుడు శత్రువులను నిగ్రహించి చోళరాజ్యాభిషిక్తుడయ్యెను. అతనియన్న లిరువురును

త్రైలోక్యమల్లునివలన పరాజితులై పరాభవమునొందిన దానికి ప్రతిక్రియనాలోచింపసాగెను. కర్ణాటసేనానులు గంగవాడిమీదకు జైత్రయాత్రవచ్చినవార్తవిని తన కార్యసానుకూలతకు తగిన తరుణమని వెంటనే యాతడు ప్రస్థానభేరి మ్రోగించెను. గంగవాడిని ప్రవేశించి, కర్ణాటసేనానుల నోడించెను. యుద్ధభూమినుండి ప్రాణములను కాపాడుకొన దలచి వెన్నిచ్చిపాఱిపోవుచున్న విక్రమాదిత్యుని సైన్యములను తుంగభద్రానదిలోనికి తఱిమి నాశనముచేసెను. విక్రమాదిత్యుడంతట చెదరిన సైన్యమును గూర్చుకొని మరల యుద్ధమునకు దలపడెను. ఆసంకులము తుంగభద్రాతటమున నెక్కుడనో జరిగెను. వీరరాజేంద్రుడు విక్రమాదిత్యుని మరల రెండవసారి యోడించెను. ఆవృత్తాంతములు శ. ౯౮౫ సంవత్సరారంభమున (ఫిబ్రవరి ౧౦౬3) జరిగియుండును.

అంతకు బూర్వమొకసారి విక్రమాదిత్యుడు వేంగిమీదకు మహాదండనాయక చాముండరాజను బంపెను. ఆయుద్ధమున వీరవిజయాదిత్యుడు చాముండరాజు నోడించి పరాభవించి వెనుకకు బంపెను. ఇంచుమించుగా నావేళకుత్తరమునుండి చేదిదేశాధీశుడు వేంగిమీదికి జైత్రయాత్రసాగించుటయు, ఆనాటి సంకులమందు సత్యాశ్రయదేవుడు (ఇమ్మడి శక్తివర్మ) ఆహవభూమిని అభిమన్యునివలె మరణించుటయు జరిగెను. వీరవిజయాదిత్యదేవుని యోడించి వశంవదునిచేసుకొనుటయో, లేక పదచ్యుతిని గావించి వేంగీమహారాజ్యమును కుంతల చాళుక్య సామ్రాజ్యమునందు గలుపుకొనుటయో త్రైలోక్యమల్లుని యభిలాషయైనట్లు కన్పించును. ఆతని

యభిప్రాయము నెఱిగి యనుమతినిబడసి కుమార విక్రమాదిత్యుడు మహాదండనాయక చాముండరాజుకు విశేషసైన్యమిచ్చి వేంగిభూమిపై మరల జైత్రయాత్రసాగింప బనిచెను. కర్ణాటసైన్యము వేంగిని జయించుట వీరరాజేంద్రుడు ఇష్టపడ లేదు. వెంటనే యాతడు చాముండరాజు సైన్యము వేంగిభూమిని ప్రవేశింపకుండ నడ్డుతగిలి యుద్ధమునకాహ్వానించెను. ఆయుద్ధ మెక్కడనో తుంగభద్రా దక్షిణతటమున కంపిలి నగర ప్రాంతమున జరిగినట్లు దోచును. వీరరాజేంద్రుడు చాముండరాజు నోడించి చంపెను. అతని యేకైకపుత్రికను, నాగల యనుదానిని, మత్తమయూరమువంటి సౌందర్యరాశిని, మహామండలేశ్వర ఇరుగయ్యచోళుని దేవేరియైనదానిని బట్టుకొని ముక్కుగోసి పరాభవించెను.

చాముండరాజు నోడించి వీరరాజేంద్రుడు తానే వేంగిని జయించి యాక్రమింప నుద్యోగించి యుండెను. వీరవిజయాదిత్యుడుగాని కుమార రాజేంద్రచోడుడుగాని యాచోళ భూపతి కాప్తులుగారు. వారహితులై జీవించి యున్నంతకాలము వీరరాజేంద్రుడు తాను కుంతలేశ్వరుని సంపూర్ణముగ నోడింప జాలనని గ్రహించెను. వీరరాజేంద్రుడు వేంగీశ్వరుని జయించుటగాని, యాతని వశవర్తిని జేసికొనుట గాని ఆహవమల్లునికిసమ్మతముగాదు. అందువలన నాతడు కుమారవిక్రమాదిత్య జయసింహులను వీరరాజేంద్రచోళుని మీదికిబంపెను. ఈసారి చోళభూపతి నరికట్టినగాని, విజయోత్సాహముతో, అజేయుడై కేరుచున్న వీరరాజేంద్రుడు వేంగిని

జయించునని త్రైలోక్యమల్లుడు భయపడెను. ముందుగా కుమార విక్రమాదిత్య జయసింహుల సైన్యములు, వేంగీ దేశమును జొఱబడిపోవుచున్న వీరరాజేంద్రుని కడ్డుతగులుట కాజ్ఞాపించి, ఆహవమల్లుడు వెనుకనుండి పయనమయ్యెను. ఆహవమల్లుడు తలచినరీతిగా నడిచె నానాటి ఆహవకార్యము.

అంతలోపల కుమార విక్రమాదిత్య జయసింహులు చెదిరిన బలములను మరల సమకూర్చుకొని వీరరాజేంద్రుని తోడ మూడవసారి యుద్ధమునకు దలపడిరి. కుమారులకు సాహాయ్యముగ ఆహవమల్లుడు విశేష సైన్యములో వచ్చి కలసికొనెను. వేంగీదేశమునందు జొచ్చి సాగిపోవుచున్న వీరరాజేంద్రుని కూడలి సంగమంవద్ద కర్ణాట సేనలు ఎదుర్కొనెను. అచ్చట మహా దారుణ సంగ్రామము జరిగెను. కూడలిసంగమమన్నది కర్నూలు మండలమున కృష్ణా భవనాశినదులు సంగమించిన స్థలము: సంగమేశ్వరము దాని పేరు. సంగమేశ్వరమునకు తూర్పున కొంత దూరమున కృష్ణానదికి దక్షిణపు టొడ్డున నాటి మహాసంగ్రామము జరిగెను. అది శ. ౯౯౦ సంవత్సర శ్రావణమాసమున (జూలై, ౧౦౬౮) జరిగెను. అది వర్షాకాల మగుటవలన రెండునదులును పొంగియుండెను. కృష్ణానది బురదనీటితో ప్రవహించుచుండెను. కూడలిసంగమం (సంగమేశ్వర) యుద్ధమున ఆహవమల్లుడు సంపూర్ణముగ పరాజితుడయ్యెను. ఆతని సేనలు పీనుగుపెంటలయ్యెను. కర్ణాట సేనానులు, మధువూద నయ్య, కేశవయ్య, కేతరసు, మారయ ప్రభృతులు, భయపడి పారిపోయిరి. ఆహవమల్లుడు, తనకు జరిగిన మహా

పరాభవమునకు తల్లడిలి పాఱిపోయెను. విక్రమాదిత్య జయ సింహు లాతని వెంబడించిరి. ఆహవమల్లుని యవరోధజనము, మద మాతంగ తురంగములు, ఛత్ర చామరాది చక్రేశ్వర లాంఛనములు, కోశము, వేయేల అఖిల వస్తుచయమును, వీర రాజేంద్రు డపహరించెను. అఖండ విజయ దర్పితుడై యుండిన నా సమయమున వేంగి యువరాజు బలములు చోళ రాజ్యమును జొఱబడుచుండెను. ఆవార్తవిని, వీరరాజేంద్రుడు వేంగిమీదకు విజిగీషుడై యరుగుట మాని, నిజ రాజధానికి పయనమయ్యెను. మార్గమున నెక్కడనో, వేంగి యువరాజు సైన్యముతో ఘోరయుద్ధము సంఘటిల్లెను. వేంగిచాలుక్య సామంత దండనాథులు పెక్కం డ్రా సంగ్రామమున జచ్చిరి. అట్టివారిలో నొకడు పొత్తపి నగరాధీశ్వరుడైన అనుగు చోడ మాండలికుడు. మరియొకడు చక్రకూటాధీశ్వరుడైన జననాథదేవుని తమ్ముడు. రణరంగమున జచ్చినవారి శిర ముల గోయించి తెచ్చి వీరరాజేంద్రుడు గంగైకొండ చోళపురమందు నగరు వాకిట పాతిన శూలములకు గ్రుచ్చి వేంగియువరాజు పక్షము బూని వర్తించుచుండిన ద్రోహిసామంత కులమునకు భీతి గలుగునట్లు చేసెను. పొత్తపిచోడుడు మొదల లయినవారు వేంగి యువరాజుకు సామంత మండలేశ్వరులగుచు సేనానులై యుందురు. రాజేంద్రచోడుని పనుపున వారు వీర రాజేంద్రుని యుద్ధరంగమున నెదుర్కొని పరాజితులై మర ణించిరి. ఆ యుద్ధమున యువరాజరాజేంద్రచోడు డోడి వెన్నిచ్చిపాఱి యుండెనని గూడ నూహింపవచ్చును.

వీరరాజేంద్రుడు నిజరాజధానికి మరలివచ్చిన కొంత కాలమునకు, "కూడలిసంగమం (సంగమేశ్వరం) యుద్ధమునకు ప్రతిక్రియ చేయ దలపెట్టితిని గావున, శక్తియున్నచో మరల ఆహవక్రీడకు రావలసిన"దని, వీరరాజేంద్రునకు ఆహవమల్లుడు మహామండలేశ్వర గంగకేతరసు ద్వారా రాయబార మంపెను. వీర రాజేంద్రు డా రాయబారమును తక్షణము యంగీకరించి చైత్రయాత్ర వెడలెను. ఆ వృత్తాంతము శ.౯౮౭ సంవత్సరమున (౧౦౬౫-౬౬) జరిగెను. ఈసారి యతడు త్రైలోక్యమల్లునితోడి యుద్ధకార్యమునకు తుంగభద్రా తటమున కరండ్ల లేక కండై యను చోట స్కంధావారము నిర్మించుకొని విడిసెను. కరండ్ల, లేక కండై యనునది కందనోలు (కర్నూలు) గావచ్చును. ఆహవమల్ల సోమేశ్వరుని రాకకు వీరరాజేంద్రు డచ్చట నొక మాసము వేచి యుండెను. స్వయముగా నాహవకార్యమునకు రాజాలక సోమేశ్వరుడు పెద్దసేననిచ్చి ముగ్వురు దండనాయకులను బంపెను. వీర రాజేంద్రుడు కర్ణాట దండనాథులను బూర్తిగ పరాభవించెను. వెన్నిచ్చి పాఱుచున్న కుంతల దండనాథులను వెంట దఱుముచు బోయి, అంతట తుంగభద్రనుదాటి యచ్చట జయస్తంభమును పాతెను. రట్టపాడి భాగమైన రాచూరు మండలమునుజొచ్చి, యాప్రాంతమును కొల్లగొట్టుచు గ్రామములను తగులబెట్టుచు యథేచ్ఛగ విధ్వంసము గావింప సాగెను.

వీరరాజంద్రుని యాహ్వానించియు సోమేశ్వరు డాహావకార్యమునకు బోజాలకుండుటకు గారణములు గలవు.

కళ్యాణకటకమున ఆ నాడు తలవని తలంపుగ కొన్ని వింతలు పుట్టెను. ఆహవమల్లునికి రెండవ కుమారుడు విక్రమాదిత్యునిపై నే కారణముననో ఆగ్రహము జనించెను. అంతట కోపావిష్టుడై కుమారుని మదపుటేనుగు కాలిక్రింద బడద్రోసి త్రొక్కించుడని యానతిచ్చెను. విక్రమసాహసుడైన విక్రమాదిత్యు డుపాయమున ఆపదనుండి తప్పించుకొని సైన్యసమేతుడై వచ్చి కృష్ణాతుంగభద్రల నడిమి సీమలో నిర్దయాత్ముడై వీరవిహారము సలుపుచున్న చోళభూపతిని, తన తండ్రికి పరమశత్రువైనవానిని, గలసికొనెను. అపుడేమి జరిగెనో వివరములు తెలియవు. కాని వీరరాజేంద్రుడు కుమార విక్రమాదిత్యునితో సంధిజేసికొనెను. ఆతనికి కుంతల యువరాజ కంఠపట్టికను గట్టి, తన కూతునిచ్చి పెండ్లిచేసి యల్లుని గావించుకొనెను. ఆ వృత్తాంతములు శ. ౯౮౭ సంవత్సరమున (ఫిబ్రవరి, మార్చి, ౧౦౬౬) జరిగినట్లు కనబడును. ఆ విధముగా రాజకుటుంబమున వైమనస్యములు, కలహములు గలుగుచుండిన కారణమున ఆహవమల్ల సోమేశ్వరుడు వీరరాజేంద్రుని యుద్ధమున గదియలేకపోయెను. అనృతవచనుడయ్యె నతడు. కుమార విక్రమాదిత్యుడు తన కల్లుడైన కతన కొంత కాలమువఱకు కుంతలేశ్వరుని కుటుంబ కలహములు దీరునంతవఱకు, ఆ దిశనుండి తన కెట్టియాపదయు రాజాలదను ధైర్యము వహించి వేంగియందు కుమార రాజేంద్రచోడుని నాతని పితృవ్యుని శిక్షింపదలచెను. వేంగీ మహారాజ్యమును తన సామ్రాజ్యమున గలుపుకొనదలచి, విజిగీషుడై నిశ్శంకతో వేంగిమీదకు నడ

చెను. చోళరాజ్యసీమలందు మలయుచున్న కుమార రాజేంద్ర చోడునిదృష్టిని మరల్చి, వేంగీశ్వరుని, వేంగి యువరాజును గూడ వేంగిదేశమందోడింప సంకల్పించెను.

ఆహవమల్లుడు మునుపటివలె కర్ణాటసేనలను వేంగి భూమికి బంపునన్న భీతి యిపుడాతనికి లేదు. తుంగభద్రా తటమునుండి తన విజయస్కంధావారమును నెత్తించి, వేంగీ విజయప్రస్థానపటహమును మ్రోగించువేళ, కుమార రాజేంద్ర చోడున కన్యాపదేశముగ "పూర్వము మావశమైయుండిన వేంగిని మేము మరల జయింపదలచి, జైత్రయాత్ర బోవు చున్నారము. భుజబలమున్నచో, వచ్చి సంరక్షించుకొనుము" అని సందేశమంపెను. కుమార రాజేంద్రచోడుడు చోళ రాజ్యాభిలాషియై ప్రవర్తించిననాటనుండి, వీరరాజేంద్రుడు వేంగి యువరాజును విరోధిగా భావించియుండెను. వీరరాజేం ద్రుని భీషణ సందేశము నందుకొని కుమార రాజేంద్రచోడుడు చోళసైన్యముల నెదుర్కొనుటకు ముగ్గురు దండనాథులను, చక్రకూటాధీశ్వరుడైన జననాథుని, దండనాయక రాజ మయ్య గజ సాహిణిని, చమూపతి ముప్పరసును బంపెను. అత్యుగ్రవిపక్షసేనల సేనలకు విజయవాడవద్ద ఘోర సంగ్రామమయ్యెను. అందు వేంగీ యువరాజుసేనలు హత మయ్యెను. శేషించిన బలములు అడవులదారి బట్టెను. విజయవాడ యుద్ధము శ. ౯౯౦ సంవత్సర ఆశ్వయుజ కార్తిక ప్రాంతములందు (సెప్టెంబరు అక్టోబరు, ౧౦౬౮) జరిగెను. అంతట విజయహర్షాతిరేకమున వీరరాజేంద్రుడు రాజమహేం ద్రవరముమీదికి నడచెను. గోదావరిని దాటెను. రాజేంద్ర

చోడుని సైన్యము పరాజయమొందుటగాంచి రాజమహేంద్ర వరమును నిస్సహాయుడై రక్షించుకొనజాలక, వీరవిజయాదిత్యుడు పశ్చిమాంబుధియందు గ్రుంకుచున్న సూర్యుని పగిది నుండి, కళింగరాజరాజుని సాహాయ్యము వేడెను. ఆపన్నుడై, శరణార్థియై వచ్చిన శత్రువునకు విజయాదిత్యుని కభయమిచ్చి, రాజరాజు మండలిక వనపతిని సేనాధిపతిగ నభిషేకించి వీర రాజేంద్రుని నెదుర్కొనుటకు పడుమటిదిక్కుగానున్న వేంగీ రాజ్యమునకరిగెను. రాజరాజ, విజయాదిత్య దేవులు ఘోర సంగ్రామరంగమున చోళభూపతి నెదుర్కొనిపోరాడిరి. ఆ యుద్ధము వేంగీరాజ్యాంతర్గతమైన దక్షిణకళింగమందెచ్చటనో సంఘటిల్లెను. జయలక్ష్మి దానవై వచ్చి రాజరాజును వరించెను.* దండనాయక వనపతి విక్రమరణకౌశలములు విజృంభించి, రాజరాజు కఖండ జయము నొడగూర్చెను. ఆ దారుణ యుద్ధము దీర్ఘాసి శాసనమున వర్ణింపబడియున్నది. తలవని తలంపుగా పరాజయము కలుగుటవలన వీరరాజేంద్రునికి కళింగభూపతితోడ సంధిజేసికొనుట సంభావ్యమని తోచెను. అంతట తన రెండవ కుమార్తె రాజసుందరిని రాజరాజుకిచ్చి

---

త్యక్త్వా వేంగిం సపది పరిణామోదయేద్యామివాన్యాం
చోడవ్యాకే మహతి విజయాదిత్య మాగ్ధా విమంక్షుం
ఆపన్నానం పరవశరణం రాజరాజో విచిత్రం
లక్ష్మీభాజం సుచిరమకరోత్ పశ్చిమాయాం దిశాయాం ॥

స రాజరాజః ప్రథమం జయశ్రియః పతిర్బభూవ ప్రవిశాహవోత్సవే
విరాజమానా మథరాజసుందరీ ముమాద్వహాం కోచ్చెడమహీభుజాత్మజాం॥

శ. ౧౦౩౮ నాటి అనంతవర్మ చోడగంగదేవుని కొర్ని తామ్రశాసనము.

యుద్వాహమొనర్చి, యేకక్రియను బంధుత్వమును మైత్రిని రెండింటిని సాధించెను. ఆ కార్యములన్నియు శ. ౯౮౯ సంవత్సర మార్గశీర్షములోపల (నవంబరు, ౧౦౬౬) జరిగి యుండును. వీరవిజయాదిత్యు డానాడు కళింగేశ్వరుని శరణార్థి యగుటవలన, మరల పదస్థుడయ్యెను. వీరరాజేంద్రుడు దర్పముతో కీర్తిమాత్రాకరముగ, తాను విజయాదిత్యుని వేంగియందు పదస్థుని జేసితినని లేనిగొప్పలు చెప్పుకొనెను. వేంగి యువరాజుకు సామంతుడైన చక్రకూటాధీశ్వరుని బెద రించెను. యువరాజరాజేంద్ర చోడుడులేని సమయముగావున అప్పుడు వీరరాజేంద్రుడు దతనిమీదికి చోళసైన్యములంపి కప్పములు, గొనెను.

కళింగమునం దారీతిగా వృత్తాంతములు నడచుచుండ, చోళరాజ్యమునందు కుమారరాజేంద్రచోడుడు ప్రవేశించెను. అతడు తన కెగ్గు దలపెట్టు చున్నాడను వార్త వినవచ్చుటచేత గాబోలు అంతట చోళభూపతి వడివడిగ దక్షిణమునకు బయన మయ్యెను. ఆ వృత్తాంతము శ. ౯౮౯ న, మాఘ ఫాల్గుణము లందు (ఫిబ్రవరి, ౧౦౬౭) జరిగియుండును. వీరరాజేంద్రుడు వేంగి నుండి కదలిన పిదప దేశమున నొక విధముగా శాంతి నెలకొనెను. ఆ నాటి కింకను కర్ణాటదేశమున కాలపరిస్థితులు చక్కబడలేదు. ఆహవమల్లుడు వృద్ధుడయ్యెను. కుమార విక్రమాదిత్యునితోడి సంధి కుదురలేదు. ఆతడింక యుద్ధ కార్యములు తలపెట్టలేకపోయెను. విక్రమాదిత్యుడు వివాహా నంతరము బనవాసి సీమయందు కొంతకాలముండెను. పిమ్మట తుంగభద్రా, కృష్ణాతటములందు పర్యటనము చేయుచు,

కల్యాణకటకమున జరుగుచుండిన వృత్తాంతముల నెప్పటి కప్పుడు తెలిసికొనుచుండెను. క్రమముగా సోమేశ్వరుడు వ్యాధిగ్రస్తుడయ్యెను. ఆతని పీడించుచుండిన విషజ్వరము ఔషధసేవవలన గుదురకపోయెను. చివరకు విసిగి వేసారి యాహవమల్లుడీశ్వరునియందు బుద్ధి స్థిరముగ నిల్పి, జైన శ్రావకుడట్లు, సల్లేఖన మొనరించి ప్రాణత్యాగము జేసెను. జ్వరపీడితుడగుచు నతడు తుంగభద్రా జలములందు ప్రవేశించి తలమునుగువఱకు నడచి యచ్చట ప్రాణములను విడచెను. అది శ. ౯౯౦ యగు కీలకసంవత్సర చైత్ర బహుళ అష్టమీ ఆదివారము (౨౯ లేక 30 మార్చి, ౧౦౬౮) నాడు జరిగెను. అనంతర మాతని జ్యేష్ఠ తనయుడు (ఇమ్మడి) సోమేశ్వరుడు భువనైకమల్లుడను బిరుదుతో కర్ణాటసింహాసన మధిష్ఠించెను. వీరవిజయాదిత్యున కతడు సమకాలికుడు. ఇమ్మడిసోమేశ్వరు డెనిమిదేండ్లుమాత్రము పరిపాలించి, తమ్ముడు విక్రమాదిత్యునితోడి వైరమువలన రాజ్యభ్రష్టుడై, చెఱయందుబడి కడకు దుర్మరణము నొందెను.

వీరవిజయాదిత్యదేవుని చరమవయసు దుఃఖభూయిష్ఠమై గడచెనని చెప్పవచ్చును. అతడు దురదృష్టవంతుడు. ప్రాయముప్రాలుచున్న వయసునందు వీరవిజయాదిత్యునికి సంతానము కలిగెను. ఆబాలుడు చిరంజీవియై వర్ధిల్లగలడని యాతడు పుట్టెడాశ పెట్టుకొనెను. అంత విజయాదిత్యుని కారెండవ కుమారుడు పంద్రెండవ విజయరాజ్యవర్షమునకు బూర్వమెపుడో కలిగెను. ఆతనయు డొకప్పుడు జీవించడను భీతికలిగి విజయాదిత్యదేవుడు భూసురోత్తములకు దానములు

ధారవోసెను. పండ్రెండవ విజయరాజ్యవర్షమున అనగా శ. ౯౯౨ యగు పరీధావి సంవత్సర పుష్యబహుళ ఏకాదశి ఆదివారమునాడు (౨౩ డిసంబరు, ౧౦౭౨) ఉత్తరాయణ సంక్రాంతివేళ కలియుధిష్ఠిరమహారాజు 'అస్మత్సంతాన బలాయురారోగ్యైశ్వర్యాభివృద్ధ్యర్థ'మని పసుదోవవాస్తవ్యుడైన పంపనభట్టోపాధ్యాయునికి, మావిండేఱు క్రుందిడి గ్రామములను, ఒకదాని తరువాత నింకొకదానిని రెండుఅగ్రహారములను అష్టభోగసర్వ సంపదలతో ననుభవించుటకు సర్వకర పరిహారముగా, 'సర్వనమస్య'గా ధారవోసెను. సర్వనమస్య ననుటవలన దానములు విజయాదిత్యుని సంతానము జీవించుట కొక సవనము (యాగము) చేయుట కొసగబడినట్లుతోచును. ఆగ్రామములు నేడు రామచంద్రపురం తాలూకా యందు కోరుమిల్లి దాక్షారామముల నడుమనున్నవి. మావిండేఱు మామిడాడగను, క్రుందుడి కుందూరుగాను మారెను.

పంపన భట్టోపాధ్యాయుడు పరాశరగోత్రజుడు, కేశవశర్మ తనూజుడు, పంపనార్యుని మనుమడు. పంపనభట్టోపాధ్యాయుడు వేదవేదాంగ పారగుడు. మీమాంస శాస్త్రముకు గురువు. వాఙ్మయ వారిధిని అగస్త్యుడు రత్నాకరమును నాపోశనము పట్టినరీతి అతడు అశేషము ద్రావెను. షట్కర్మనిరతుడతడు. కేశవశర్మ గూడ వేదవేదాంగ సకలశాస్త్రార్థవిదుడు. పితామహుడైన పంపనార్యుడు కూడ బ్రహ్మసమానుడు, సర్వశాస్త్రవేది. ఎన్నిసవనములు చేసినను కలియుధిష్ఠిరుని యభిలాష ఫలించినట్లు గన్పడదు. అతడు చివరకు సంతానహీనుడై మరణించెను. అతడు శ. ౯౯౮ యగు

నలసంవత్సర చైత్రమందు (ఏప్రిలు, ౧౦౭౬) దివంగతుడైన ట్లూహింపవచ్చును. ఆతనితో వేంగియందు రాజ చాళుక్య వంశ మంతరించెను. సంతానవంతుడయ్యు రాజరాజనరేంద్రుడు చాళుక్యగోత్ర నిస్తారకుడు కాజాలడయ్యెను. ఆతని తనయుడు చోళవంశకర్తయయ్యెను. సంతానమును తనకండ్ల యెదుటనే గోల్పోయి దుఃఖమున మునిగి విజయాదిత్యుడు కూడ గోత్రనిస్తారకు కాజాలడయ్యెను. నిజమునకు వీర విజయాదిత్యుడే కట్టకడపటి సత్యాశ్రయకులజుడు.

